www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 16-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 211

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 11.51 తదుపరి విదియ; నక్షత్రం: కృత్తిక రా. 7.28 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.8.41-10.07; దుర్ముహూర్తం: ఉ.6.24-7.53; అమృతఘడియలు: సా.5.18-6.44; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 5.35 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లాభం గాడిద గుడ్డు
గాడిదలను అంటగట్టి రూ.100కోట్లకు కుచ్చుటోపీ!
3
లీటరు పాలు రూ.1600కు కొంటామని హామీ
ఒక్కో జీకి రూ. లక్షన్నర.. రూ.5 లక్షలు డిపాజిట్
షెడ్డుకు రూ.10 లక్షలు.. మొత్తం రూ.కోటి పెట్టుబడి
చేతులెత్తేసిన తమిళనాడులోని 'ది డాంకీ ప్యాలెస్'
తమకు న్యాయం చేయాలంటూ బాధితుల గగ్గోలు

బై బ్యాక్ బురిడీ 3
నెలనెలా రిటర్న్స్.. రెట్టింపు లాభాలు
ప్లాట్లు, బంగారంపై 'పెట్టుబడి' వల
రూ. 300 కోట్లు కొల్లగొట్టిన ముఠా
నిలువునా మునిగిన 3600 మంది
హైదరాబాద్‌లో 8 మంది అరెస్టు


ఖమ్మం జిల్లా కామేపల్లిలో ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

సర్వేను అడ్డుకుంటే ఉపేక్షించొద్దు
ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
రాష్ట్రంలో 5.24 లక్షల ఇళ్లలో పూర్తయిన కార్యక్రమం
నిర్వహణ తీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తూ.. ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని, తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వేపై శుక్రవారం సాయంత్రం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం.. దేశానికే ఆదర్శంగా ఈ సర్వేను నిర్వహించాలని, నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలని అధికారులతో అన్నారు. ఈ సర్వేలో సేకరిస్తున్న

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో అలెగ్రో మైక్రోసిస్టమ్స్
పరిశోధన కేంద్రంపై ఒప్పందం
500 మందికి ఉపాధి: శ్రీధర్ బాబు

కొనుగోలు కేంద్రాల్లోనే రశీదులు
తూకం వేయగానే లెక్కలు తేల్చాలి
గతంలోలా మిల్లర్ల అనుమతి అక్కర్లే
ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం
మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా: తుమ్మల 14

ఫ్యూచర్ సిటీ
30 వేల ఎకరాల్లో
ల్యాండ్ పూలింగ్ విధానంలో 15 వేల ఎకరాలకు పైగా సేకరణ

ఇప్పటికే ప్రభుత్వం వద్ద 14 వేల ఎకరాలు
అభివృద్ధి చేసిన ప్లాట్లలో రైతులకు సగం వాటా!
ప్రజల నుంచి వ్యతిరేకత తలెత్తకుండా జాగ్రత్తలు
నిర్మాణ పనులకు విస్తృతాధికారాలతో అథారిటీ
పాలకవర్గంతో పాటు కార్యనిర్వాహక మండలి
శరవేగంగా నిర్మాణాలకు సర్కారు సన్నాహాలు
300 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పనులు షురూ
వారంలో రెండో విడత భూసేకరణ నోటిఫికేషన్
త్వరలో ఫార్మా కంపెనీలకు భూకేటాయింపు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగర శివార్లలో నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా 15 వేల ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. దీనికి అదనంగా 15 వేల ఎకరాలకు పైగా భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని సర్కారు నిర్ణయించింది. అంటే మొత్తం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది. రైతుల అంగీకారంతో భూమిని సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంతే గాక పక్కనే ఉన్న వేల ఎకరాల అటవీ భూముల్లో కూడా పర్యాటకులను ఆకర్షించేలా నైట్ సఫారీ, తదితర ప్రాజెక్టుల రూపకల్పన చేస్తోంది. ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టేందుకు ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయనుంది. దానికి పాలకవర్గంతో పాటు కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన శశాంకను ప్రభుత్వం కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఇటీవల జీవో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఫ్యూచర్ సిటీ నిర్మాణ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ పనుల పర్యవేక్షణకు నానక్‌రాంగూడలోని హెచ్ఎండీఏ గ్రోత్ కారిడార్ కార్యాలయాన్ని కేటాయించారు. త్వరలోనే అవసరమైన సిబ్బందినీ నియమించనున్నారు. ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా 15 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరించనున్నారు. భూసేకరణ విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరిహారం విషయంలోనూ కొంత ఉదారంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో అభివృద్ధి చేసిన ప్లాట్లలో రైతులకు 50-60 శాతం

మిగతా 13వ పేజీలో...



ఉద్యోగుల జీపీఎఫ్‌కు
వడ్డీ ఏదీ?
2023 మిత్తిని ఖాతాల్లో జమ చేయని సర్కారు
ఏడాది వడ్డీ నష్టపోతాం: ఉద్యోగులు, టీచర్లు
జడ్పీ జీపీఎఫ్ ఖాతాల వారికే ప్రధాన సమస్య
కొత్త జిల్లాలకు మారడం వల్లే ఈ పరిస్థితి
పాత జిల్లాల నుంచి ఖాతాల బదిలీతోనే సరి
గత ఏడాది వడ్డీని బదిలీ చేయని అధికారులు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. తమ జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) విషయంలో అధికారుల తీరు వల్ల పెద్ద ఎత్తున నష్టపోయే పరిస్థితి నెలకొంది. 2023 సంవత్సరానికి సంబంధించి జీపీఎఫ్‌కు ప్రభుత్వం కలపాల్సిన వడ్డీని ఇప్పటికీ కలపకపోవడమే ఇందుకు కారణం. ఏయేటికాయేడు వడ్డీ జమ అయితే.. అది అసలు సొమ్ము (ప్రిన్సిపల్ అమౌంట్)గా మారుతుందని, దానిపై మళ్లీ వడ్డీ కలుస్తూ రావాలని ఉద్యోగులు చెబుతున్నారు. కానీ, గత ఏడాదికి సంబంధించిన వడ్డీ జమ కాకపోవడంతో అటు వడ్డీ రూపంలో నష్టంతోపాటు ప్రిన్సిపల్ అమౌంట్ రూపంలోనూ నష్టపోవాల్సి వస్తోందని అంటున్నారు. తమ సొమ్మును జీపీఎఫ్‌లో జమ చేసే బదులు.. ఏ బ్యాంకులోనో జమ చేసుకుంటే కచ్చితంగా వడ్డీ వచ్చేదని పేర్కొంటున్నారు. అయితే రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొత్త జిల్లాలకు బదిలీ కావడంతోనే ఈ సమస్య తలెత్తిందని చెబుతున్నారు. సాధారణంగా

మిగతా 13వ పేజీలో...


శాంసన్ (109) 6 ఫోర్లు, 9 సిక్సర్లు

సఫారీలపై సెంచరీల సవారీ 11
దక్షిణాఫ్రికాపై శతకాలతో చెలరేగిన తిలక్‌వర్మ, సంజూ
ఒక టీ20లో ఇద్దరు సెంచరీలు కొట్టడం ఇదే మొదటిసారి
భారత్ రెండో అత్యధిక స్కోరు.. 3-1తో సిరీస్ సొంతం
పాక్‌కు చెక్.. పీవోకేలో చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శన రద్దు


తిలక్(120) 9 ఫోర్లు, 10 సిక్సర్లు


12

కేసీఆర్ బాటలోనే రేవంత్
అబద్ధాలు, దోపిడీలు.. అదే పాలన
నిరుద్యోగం, ధాన్యం కొనుగోళ్ల సమస్యలు ఇప్పుడు కూడా..
పేదల ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తారా?: కిషన్‌రెడ్డి

పది ఫీజు పరేషాన్
6-10 విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ తప్పనిసరి
ఏ ఒక్కరిది కాకున్నా పరీక్ష ఫీజు చెల్లింపులో ఇబ్బంది
ఈ ఏడాది తెచ్చిన కొత్త నిబంధనతో తంటాలు
ఎల్లుండి వరకే గడువు.. పొడిగింపునకు డిమాండ్



హైదరాబాద్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలను రాయబోయే విద్యార్థులకు ఆన్‌లైన్ కష్టాలు మొదలయ్యాయి. మార్చిలో జరగబోయే వార్షిక పరీక్షలకు సంబంధించి ఈ నెల 18వ తేదీలోపు విద్యార్థులు ఫీజును చెల్లించాల్సి ఉంది. గడువు ముగియడానికి రెండు రోజుల సమయమే ఉంది. ఇందులోనూ వరుసగా సెలవులు వస్తున్నాయి. ఈ ఫీజును చెల్లించడంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఇంకా యుడైస్ పోర్టల్‌లో నమోదు చేయకపోవడమే ఇందుకు కారణం. సాధారణంగా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి వివరాలను స్కూల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన యుడైస్ పోర్టల్‌లో నమోదు

మిగతా 14వ పేజీలో...



గుర్రంపై కొండా
హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీసుకు ఎంపీ చేవెళ్లకు చెందిన నేతలతో కలిసి రాక
గుట్టలబేగంపేట భూములు లాక్కొనేలా వక్ఫ్ బోర్డు యత్నాలు: విశ్వేశ్వర్ రెడ్డి 12

రేవంత్ ఓ రాబందు
సీఎం నిర్ణయాలతో ప్రజలు రోదిస్తున్నారు
కొడంగల్‌కు చక్రవర్తిలా తిరుపతిరెడ్డి
కలెక్టర్లు, అధికారులు మోకరిల్లుతున్నారు
'లగచర్ల'లో కాంగ్రెస్ వాళ్లు కూడా ఉన్నారు
గ్రామంలో లేనివారినీ జైలుకు పంపారు
న్యాయపోరాటం చేసి వారికి బెయిలిప్పిస్తాం
కొడంగల్‌లో మర్లబడ్డట్టే తెలంగాణ అంతా..
ప్రభుత్వానికి పేదోళ్ల ఉసురు: కేటీఆర్
సంగారెడ్డి జైల్లో లగచర్ల వాసులకు పరామర్శ
కీలక పాత్రధారి సురేశ్ కోసం ముమ్మర వేట
పట్నం నరేందర్‌రెడ్డిని కస్టడీ కోరే చాన్స్



సంగారెడ్డి/పటాన్‌చెరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజల పాలిట రాబందులా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం నిర్ణయాలతో ప్రజలు రోదిస్తున్నారని, ఆక్రోశిస్తున్నారని తెలిపారు. ఇటీవల వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై, అధికారులపై దాడి చేసిన ఘటనలో

మిగతా 12వ పేజీలో...

రైలు ముందు రీల్స్‌కు జైలే
సర్వీసులకు ఆటంకం కలిగిస్తే ఎఫ్ఐఆర్
అన్ని జోన్లకు రైల్వే బోర్డు ఆదేశాలు 2

అధికార్లపై దాడి చేస్తే ఊరుకోం 12 కొడంగల్‌లో పరిశ్రమ ఇష్టం లేకపోతే ఎక్కడైనా నిరసనలు తెలపొచ్చు: పొన్నం

అమిత్ షా బ్యాగుల తనిఖీ



న్యూఢిల్లీ, నవంబరు 15: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ తమను మాత్రమే లక్ష్యంగా చేసుకుని తనిఖీలు చేస్తున్నారంటూ కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. హింగోలి జిల్లాలో మహాయుతి కూటమి పార్టీల తరఫున ప్రచారానికి వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బ్యాగులను, ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఈసీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. "హింగోలి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లాను. ఈ సందర్భంగా నేను ప్రయాణించిన హెలికాప్టర్ సహా నా బ్యాగేజీని ఈసీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై బీజేపీకి విశ్వాసం ఉంది" అని షా పేర్కొన్నారు. ఇదిలావుంటే, గత మూడు రోజులుగా ఈసీ తమ బ్యాగులను మాత్రమే తనిఖీ చేస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, ఉద్ధవ్ ఠాక్రే తదితరులు విమర్శలు సంధిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అన్ని పార్టీల నాయకులకు చెందిన బ్యాగులు, వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తుండడం గమనార్హం.

మోదీ ప్రయాణిస్తున్న విమానంలో
సాంకేతిక లోపం

దేవ్‌గఢ్, నవంబరు 15: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తుది దశ ప్రచారం నిమిత్తం శుక్రవారం ఈ రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఝార్ఖండ్‌లోని దేవ్‌గఢ్‌లో ప్రచారం ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీకి పయనమయ్యారు. అయితే, 80 కిలో మీటర్లు వెళ్లిన తర్వాత ఆయన ప్రయాణిస్తున్న విమానం సాంకేతిక లోపం కారణంగా వెనుదిరిగి వచ్చింది. దీంతో మరో విమానంలో ప్రధాని ఢిల్లీకి వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంది. దీంతో హుటాహుటిన అధికారులు ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని సిద్ధం చేశారు.

రాహుల్ హెలికాప్టర్ టేకాఫ్
45 నిమిషాలు ఆలస్యం

» ప్రధాని ఉన్నారనే ఇలా చేశారు.. ఈసీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

గొడ్డా, నవంబరు 15: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తుది దశ ప్రచారంలో రాజకీయ రగడ చోటు చేసుకుంది. రాహుల్‌గాంధీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు అనుమతులు ఇవ్వడంలో 45 నిమిషాలపాటు ఆలస్యం జరిగింది. దీంతో ఆయన ఝార్ఖండ్‌లోని గొడ్డా నియోజకవర్గంలోనే ఉండిపోయారు. అయితే, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలోనే తమ నాయకుడి హెలికాప్టర్‌ను 45 నిమిషాల పాటు నిలుపుదల చేశారని, కాంగ్రెస్ పార్టీ ప్రచారంపై ప్రభావం చూపించేలా వ్యవహరించారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) అధికారులకు ప్రధాని మోదీ కదలికలపై ఉన్న దృష్టి.. రాహుల్ గాంధీపై లేదు" అని దుయ్యబట్టారు. కాగా, ఈ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. కాగా, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడుతూ.. బీసీలంటే బీజేపీకి లెక్కలేదని విమర్శలు గుప్పించారు. "ఝార్ఖండ్‌లో బీసీల రిజర్వేషన్‌ను 27 శాతం నుంచి 14 శాతానికి బీజేపీ తగ్గించింది" అని దుయ్యబట్టారు.

లోకం తీరు





రూ.23 కోట్ల దున్నపోతు!

న్యూఢిల్లీ, నవంబరు15: అన్‌మోల్.. అంటే 'వెల కట్టలేనిది' అని అర్థం! ఈ చిత్రంలో యముని మహిషంలా బలంగా కనపడుతున్న దున్నపోతు పేరు అదేగానీ.. దీనికి ఒక వెల ఉంది. అది రెండు రోల్స్‌రాయిస్ కార్ల ఖరీదంత. 10 బెంజ్ కార్ల ఖరీదంత. హైదరాబాద్‌లో ఔటర్ చుట్టుపక్కల 10 విల్లాలు కొనేంత ఖరీదు.. అక్షరాలా 23 కోట్ల రూపాయలు!! హరియాణాలోని సిర్సా జిల్లాకు చెందిన గిల్ అనే ఆసామీ వద్ద ఉందీ దున్నపోతు. దీని బరువు 1500 కిలోలు. మేలు జాతి జీవం కావడంతో దీని వీర్యానికి బోలెడంత డిమాండ్ ఉంది. ఎంతంటే.. అన్‌మోల్ వీర్యాన్ని అమ్మడం ద్వారా దీని యజమాని గిల్ నెలకు రూ.5 లక్షల దాకా సంపాదిస్తున్నాడు. దీన్ని ఆరోగ్యంగా ఉంచడం ద్వారా అంత ఆదాయం సంపాదించాలంటే.. అందుకు తగ్గ ఖర్చు ఉంటుంది. దీనికి రోజూ పావుకిలో బాదం పప్పులు, నాలుగు కిలోల దానిమ్మ గింజలు, 30 అరటిపండ్లు, 5 లీటర్ల పాలు, 20 గుడ్లు పెడతారు. ఇవి కాక.. పచ్చగడ్డి, తవుడు, సోయా బీన్స్, మొక్కజొన్న వంటివి కూడా పెడతారు. అన్‌మోల్ ఇంత బలంగా ఆరోగ్యంగా ఉండడానికి కారణం.. దీని తల్లి నుంచి దీనికి సంక్రమించిన జన్యువులేనని.. ఆ గేదె రోజుకు 25 లీటర్ల పాలు ఇచ్చేదని.. గిల్ తెలిపాడు.

రైల్వే ప్రాంగణాల్లో రీల్స్ చేస్తే జైలే

న్యూఢిల్లీ, నవంబరు15: రీల్స్ పేరుతో రైల్వే కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం, ప్రయాణికులకు అసౌకర్యం కల్పించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని రైల్వేబోర్డ్ నిర్ణయించింది. రైల్వే ప్రాంగణాలు, రైల్వే ట్రాకులు, కదులుతున్న రైళ్లలో ఈ తరహా ఘటనలు పెరిగిపోవడంతో ఇలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు రైల్వేబోర్డు అన్ని జోన్లకు ఆదేశాలు పంపింది. సోషల్ మీడియాలో పోస్టుల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టడమే కాకుండా మిగతా ప్రయాణికులకు ప్రమాదకరంగా తయారు కావడంతో కఠినచర్యలు తీసుకోకతప్పడం లేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇటీవల చెన్నైలోని వ్యాసర్‌పాడి జీవా రైల్వేస్టేషన్‌లో కొందరు విద్యార్థులు ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణిస్తూ గందరగోళం సృష్టించడంతో పాటు రైలుపైకి ఎక్కి హంగామా చేశారు. ఈ ఘటనలో పది మంది విద్యార్థులపై రైల్వే పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

మైనర్ భార్యతో శృంగారం అత్యాచారమే

ముంబై, నవంబరు 15: మైనర్ బాలికతో శృంగారం జరపడం అత్యాచారం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఆమె సొంత భార్యే అయినప్పటికీ, శృంగారానికి అంగీకారం తెలిపినప్పటికీ చెల్లదని తెలిపింది. 18 ఏళ్లు నిండని బాలికతో శారీరక సంబంధం పెట్టుకోవడం నేరమని, అందువల్ల మైనర్ భార్యతో పరస్పర సమ్మతితో జరిపిన శృంగారాన్ని కూడా రేప్‌గానే పరిగణించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గోవింద్ సనప్ తీర్పు చెప్పారు. దీన్ని అత్యాచారం కింద గుర్తిస్తూ పోక్సో చట్టం కింద ఓ భర్తకు శిక్ష వేస్తూ వార్ధా జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించారు. భార్యతో జరిపే శృంగారం నేరం ఎలా అవుతుందంటూ నిందితుడు చేసిన వాదనను తిరస్కరించారు. నిందితుడు తన భార్య(మైనర్)ను గర్భస్రావం చేయించుకోవాలని వేధించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు కోర్టుకు వెళ్లింది.

టీనేజీ ముద్దు నేరమేమీ కాదు: మద్రాస్ హైకోర్టు



చెన్నై, నవంబరు 15: టీనేజీ దశలోని యువతీ యువకులు పరస్పర ఇష్టంతో చేసుకునే కౌగలింతలు, పెట్టుకునే ముద్దులను క్రిమినల్ చర్యలుగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. యవ్వన ఆకర్షణతో తప్ప, క్రిమినల్ దురుద్దేశాలు లేకుండా చేసే ఇలాంటి పనులకు క్రిమినల్ నేరం కింద సెక్షన్లు మోపలేమని తెలిపింది. 19 ఏళ్ల యువతి, టీనేజీలోని మరో యువకుడు ప్రేమలో పడ్డారు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏకాంత ప్రదేశంలో తనను ముద్దు పెట్టుకోవడంతో పాటు, హత్తుకున్నట్టు తెలిపింది. లైంగిక వాంఛతో దగ్గరకు వచ్చాడన్న నేరంపై పోలీసులు ఐపీసీలోని సెక్షన్ 354-ఎ(1)(1) కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

గైడెడ్ పినాక సామర్థ్య పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, నవంబరు 15: భారత అమ్ముల పొదిలోకి మరో అస్త్రం చేరనుంది. గైడెడ్ పినాక ఆయుధ వ్యవస్థ సామర్థ్య పరీక్షలన్నీ పూర్తి చేసుకుని సైన్యంలో చేరడానికి సిద్ధమైంది. పీఎస్‌క్యూఆర్ ధ్రువీకరణల్లో భాగంగా గైడెడ్ పినాక ఆయుధ వ్యవస్థ సామర్థ్య పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు డీఆర్‌డీవో ఓ ప్రకటనలో పేర్కొంది. విభిన్న క్షేత్రస్థాయి ఫైరింగ్ రేంజ్‌ల్లో మూడు దశల్లో ఈ పరీక్షలను పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఈ రాకెట్ పరీక్షల్లో దూరం, కచ్చితత్వం, నిలకడ, వివిధ లక్ష్యాల విషయంలో కాల్పుల శాతాన్ని మదించినట్లు తెలిపింది. ఒక్కో ప్రొడక్షన్ ఏజెన్సీ నుంచి 12 రాకెట్లు, ఉన్నతీకరించిన రెండు పినాక లాంచర్లను పరీక్షించినట్లు డీఆర్‌డీవో పేర్కొంది. పినాక మల్టిపుల్ లాంచ్ రాకెట్ వ్యవస్థ పూర్తి దేశీయ పరిజ్ఞానంతో తయారైంది.

ఢిల్లీలో రూ.900 కోట్ల కొకైన్ స్వాధీనం

న్యూఢిల్లీ/అహ్మదాబాద్, నవంబరు 15: పశ్చిమ ఢిల్లీలో సుమారు రూ.900 కోట్లు విలువ చేసే 82 కిలోల నాణ్యమైన కొకైన్‌ను శుక్రవారం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ నుంచి ఆస్ట్రేలియాకు అక్రమంగా తరలించడానికి ఏర్పాట్లు చేస్తుండగా కొరియర్ ఆఫీసు వద్ద పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అదే సమయంలో గుజరాత్ తీరంలో ఇండియన్ నేవీ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లు కలిపి 700 కిలోల మెటంఫెటామైన్ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఎనిమిది మంది ఇరాన్ జాతీయులను అరెస్టు చేశాయి. ఒకే రోజున ఇంత భారీ మొత్తంలో మత్తుపదార్థాలను పట్టుకున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సిబ్బందిని అభినందించారు.

సీఐఎస్ఎఫ్‌లో మహిళా బెటాలియన్ ఏర్పాటు

చండీగఢ్, నవంబరు 15: సీఐఎస్ఎఫ్‌లో తొలిసారి పూర్తి మహిళా సిబ్బందితో బెటాలియన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలిపింది. మహిళా బెటాలియన్ వల్ల మరింత మంది ఔత్సాహిక యువతులు దేశ సేవ చేసేందుకు ముందుకు వస్తారని సీఐఎస్ఎఫ్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. వీఐపీ భద్రత, విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రోలో భద్రత వంటి విధులు నిర్వహించేందుకు కొత్త బెటాయన్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

హిందూ వ్యతిరేక భావజాలంతోనే

యోగి వ్యాఖ్యలను అజిత్‌పవార్ తప్పుపట్టడంపై ఫడణవీస్

» 'కటేంగేతో బటేంగే' అన్న యోగి వ్యాఖ్యల్లో తప్పేమీ లేదు

» ఈ దేశ చరిత్రనే చెప్పారు: ఫడణవీస్

» 'మహాయుతి'లో లుకలుకలు బయటకు



సతారాలో ఫడణవీస్ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ, నవంబరు 15: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కీలక సమయంలో అధికార 'మహాయుతి' కూటమిలో లుకలుకలు పెరుగుతున్నాయి. మహాయుతి కూటమి పక్షాన ఇటీవల ప్రచారం చేసిన యూపీ సీఎం, బీజేపీ నేత యోగి ఆదిత్యనాథ్.. హిందువులను ఉద్దేశించి 'కటేంగేతో బటేంగే'(ఐక్యత లేకపోతే విభజిస్తారు) అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కూటమి పార్టీల మధ్య వివాదానికి దారితీశాయి. యోగి చేసిన వ్యాఖ్యలను కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(అజిత్ పవార్) నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బహిరంగంగానే తప్పుబట్టారు. యోగి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మతతత్త్వ భావనతోనే యోగి ఇలా వ్యాఖ్యానించారని చెప్పుకొచ్చారు. అయితే, తాజాగా మరో ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడణవీస్.. అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫడణవీస్ మాట్లాడుతూ.. ఆయనలో(అజిత్) హిందూ వ్యతిరేక భావజాలం ఉందని, అందుకే యోగి వ్యాఖ్యలపై అలా వ్యాఖ్యానించారని చెప్పారు. అంతేకాదు, ప్రజల మనసులు అర్థం చేసుకునేందుకు అజిత్‌కు కొంత సమయం పడుతుందన్నారు. "యోగి నినాదంలో తప్పేముంది? ఈ దేశ చరిత్రనే ఆయన చెప్పుకొచ్చారు" అని యోగిని ఫడణవీస్ సమర్థించారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలని యోగి పిలుపునివ్వడంలో తప్పులేదన్నారు. "అజిత్.. సుదీర్ఘకాలం పాటు హిందూ వ్యతిరేక శక్తులతో కలిసి ప్రయాణించారు. ఆయనలోనూ హిందూ వ్యతిరేక భావజాలం ఉంది. తమకు తాము లౌకిక వాదులమని చెప్పుకొనే వారిలో నిజమైన లౌకిక వాదం లేదు. హిందూత్వను వ్యతిరేకించే వారితో అజిత్ దశాబ్దాల పాటు కలిసి ఉన్నారు" అని ఫడణవీస్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి ప్రజల సెంటిమెంట్లను అర్థం చేసుకోలేరు. వారి ప్రకటనలను కూడా అర్థం చేసుకోలేరు. ఇంకేదో చెపాలనుకుంటారు" అని అన్నారు. యోగి చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదన్న ఆయన.. ఆ నినాదం భారత దేశ చరిత్రను చాటి చెబుతుందన్నారు. "యోగి నినాదంలో ఎలాంటి తప్పూ లేదు. మన చరిత్రను చూడండి. ఎప్పుడెప్పుడు విడిపోయామో అప్పుడప్పుడు బానిసలుగా మారాం. ఎప్పుడైతే ఈ దేశం కులాలు, రాష్ట్రాలు, మతాలు, సంఘాలుగా విడిపోయిందో అప్పుడప్పుడల్లా మనం బానిసలమైపోయాం. దేశం, ప్రజలు కూడా విడిపోయారు. అందుకే మనం(హిందువులు) ఐక్యంగా ఉండాలి. ఇదీ మన చరిత్ర. చిత్రం ఏంటంటే.. విభజన వద్దని చెప్పేవారే.. యోగి వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నారు. ఇదే నాకు అర్థం కావడం లేదు" అని ఫడణవీస్ అన్నారు.

అప్పట్లో మాతో కలవాలని పవార్ భావించారు!

మహారాష్ట్రలో 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, శివసేన కూటమి మెజారిటీ దక్కించుకున్నా ముఖ్యమంత్రి పీఠంపై ఏర్పడిన వివాదంతో ఈ కూటమి విచ్ఛిన్నమైంది. అయితే, అప్పట్లో ఎన్సీపీ నేతగా ఉన్న శరద్ పవార్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని తాజాగా ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. "ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో మేం సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ సమయంలో ఎన్సీపీ నుంచి ఇద్దరు నాయకులు వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేద్దామన్నారు. ఈ ఆఫర్ చూసి నేను ఆశ్చర్యపోయారు. ఆ ఇద్దరూ శరద్ పవార్ పంపించిన వారేనని తెలిసింది. దీంతో కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులపై వారితో చర్చించాం. ఎన్నికలు ముగిసిన తర్వాత శరద్ పవార్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తొలుత రాష్ట్రపతి పాలనకు వెళ్లాలని భావించారు. తర్వాత శరద్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి.. సుస్థిర ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు కోరుతున్నట్టు చెప్పి.. తర్వాత మా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని భావించారు. అంతేకాదు, వాస్తవానికి రాష్ట్రపతి పాలన కోసం.. 'ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని' పేర్కొంటూ ఎన్సీపీ సిద్ధం చేసిన లేఖ మా దగ్గరే సిద్ధమైంది. తర్వాత శరద్ పవార్ అనుమతి తీసుకుని గవర్నర్‌కు పంపించాం. ఉద్ధవ్ మాతో అంటీ ముట్టనట్టు ఉండేసరికి పవార్‌తో చేతులు కలపాలని నిర్ణయించాం" అని ఫడణవీస్ వివరించారు.

మహా వికాస్ అఘాడీ సర్కారు
కూల్చివేతలో అదానీ హస్తం

» ధారావిని సొంతం చేసుకునేందుకే:రాహుల్



నాందేడ్, నవంబరు 15: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ హస్తం ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2019లో అవిభాజ్య ఎన్సీపీ, బీజేపీ మధ్య జరిగిన సమావేశంలో అదానీ పాల్గొన్నట్టుగా ఇటీవల అజిత్ పవార్ వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజకీయ పార్టీల పొత్తు సమావేశంలో ఓ పారిశ్రామికవేత్తకు పనేంటని ప్రశ్నించారు. ధారావి ప్రాంతంపై అదానీ ఆనాడే కన్నేశారని, దానిని సొంతం చేసుకోవడానికి రాజకీయంగా పావులు కదిపారని అన్నారు. ఇందులో మోదీ పాత్ర కూడా ఉందని రాహుల్ ఆరోపించారు.

సమాజాన్ని మోదీ విభజిస్తున్నారు



పుణె, నవంబరు 15: ప్రధాని మోదీ తన ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్నారని ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోపించారు. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత వల్ల ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి అధికారంలోకి రానుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం అజిత్‌పవార్‌ను తిరిగి కలుపుకొనే అవకాశంపై ప్రశ్నించగా, అలాంటి అవకాశమే లేదన్నారు. బీజేపీతో కలిసి ఉన్నవారితో తనకు ఏ విధమైన సంబంధమూ లేదని తేల్చిచెప్పారు. అజిత్‌పవార్ వెంట వెళ్లిపోయిన నేతలను 'ద్రోహులు'గా ఆయన అభివర్ణించారు. ఎన్నికల్లో గెలుపు కోసం మహాయుతి కూటమి భారీగా ధనాన్ని వెదజల్లుతోందని శరద్ పవార్ ఆరోపించారు.

డిజిటల్ అరెస్టు అని సైబర్ పోలీసుకే ఫోన్

న్యూఢిల్లీ, నవంబరు 15: సైబర్ నేరగాళ్లు ఈ మధ్య వీడియో కాల్స్ చేసి.. 'మీరు మనీలాండరింగ్ కుంభకోణంలో ఇరుక్కున్నారు. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అని చెప్పి బెంబేలెత్తించి బాధితుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్న కేసులు బాగా వెలుగుచూస్తున్నాయి. ఇలానే ఓ సైబర్ నేరగాడు పోలీసు దుస్తుల్లో ఓ నంబరుకు వీడియో కాల్ చేశాడు! 'మేం ముంబై పోలీసులం. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అని హెచ్చరించాడు. అవలి వ్యక్తి వీడియో కాల్‌లో తెర మీద కనిపించకుండా సైబర్ నేరగాడిని గౌరవంగా 'సర్' అని సంబోధించాడు. హెచ్చరికలన్నీ ఆలకించి.. కొద్దిసేపటికి తెరమీద దర్శనమిచ్చాడు! కనిపించిన ఆ వ్యక్తిని చూసి సైబర్ నేరగాడు వణికిపోయాడు! కారణం.. ఆ కేటుగాడు వీడియో కాల్ చేసింది సాక్షాత్తు యూనిఫాంలో ఉన్న సైబర్‌సెల్ పోలీస్ అధికారికి! 'నీ లొకేషన్.. అడ్రస్ సహా అన్నీ నా వద్ద ఉన్నాయ్. నువ్వు ఫోన్ చేసింది సైబర్ సెల్ కార్యాలయానికి బ్రదర్' అని నేరగాడితో పోలీసు అధికారి వ్యాఖ్యానించారు.

దీపావళి వేడుకలో మద్యం, మాంసాహారం

» బ్రిటీష్ హిందువులకు యూకే ప్రధాని ఆఫీసు క్షమాపణ

న్యూఢిల్లీ, నవంబరు 15: దీపావళి సందర్భంగా యూకే ప్రభుత్వం అక్టోబరు 29న నిర్వహించిన వేడుకలో అతిథులకు మద్యం, మాంసాహారం అందించడంపై విమర్శలు వెల్లువెత్తడంపై ఆ దేశ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ స్పందించారు. జరిగిన పొరపాటును తెలుసుకున్నామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని బ్రిటీష్ హిందువులకు క్షమాపణలు చెప్పారు. ఇందుకు సంబంధించి యూకే ప్రధాని కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీపావళి వేడుకలో మద్యం, మాంసాహారం అందించడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని బ్రిటీష్ ఇండియన్, కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ శివానీ రాజ గురువారమే ప్రధానికి లేఖ రాశారు. నిర్వాహకులకు హిందూ సంప్రదాయాలపై కనీస అవగాహన లేకపోవడం శోచనీయమని ఆమె పేర్కొన్నారు.

శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో ఎన్‌పీపీ స్వీప్

కొలంబో, నవంబరు15: శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) పార్టీ సత్తా చాటింది. మూడింట రెండొంతుల మెజార్టీ సాధించింది. అంతేకాదు చరిత్రలో తొలిసారిగా తమిళుల కంచుకోట జాఫ్నాలోనూ విజయకేతనం ఎగురవేసింది. 225 స్థానాలకు గాను ఎన్‌పీపీ కూటమికి 159 దక్కాయి. విపక్ష సజిత్ ప్రేమదాస నేతృత్వంలోని యునైటెడ్ పీపుల్స్ పవర్ పార్టీ 40 సీట్లలో విజయం సాధించింది. ఈ ఏడాది సెప్టెంబరు 21న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నేత దిస్సనాయకే విజయం సాధించారు. ఆ తర్వాత ఆయనే పార్లమెంట్‌కు ఎన్నికలు ప్రకటించారు.

అమెరికాలో బడ్జెట్ కోతల విభాగం

ఉద్యోగాలకు అర్హతలు: సూపర్ హై-ఐక్యూ, రోజుకు కనీసం 12 గంటలు పనిచేసే అనురక్తి

» ఆధ్వర్యం: మస్క్, వివేక్

» జీతం మాత్రం సున్నా

» రక్షణ మంత్రిగా పీట్ హెగ్‌సెట్ పేరును ప్రతిపాదించిన ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 15: అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్.. ప్రభుత్వ సామర్థ్యం పెంపును తన ప్రథమ కర్తవ్యంగా ఎంచుకున్నారు. వృథా వ్యయాలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని తగ్గించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ సామర్థ్య విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్న్‌మెంట్ ఎఫిఫియన్సీ-డీఓజీఈ)ని ఏర్పాటు చేశారు. ఈ విభాగానికి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఆధ్వర్యం వహిస్తున్నారు. అమెరికా వార్షిక బడ్జెట్ 7 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.600 లక్షల కోట్లు) కాగా, దాంట్లో 2 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.170 లక్షల కోట్లు) మేర కోత విధించడమే ట్రంప్ లక్ష్యం. ఇందుకోసం కొత్తగా ఏర్పాటయిన విభాగంలో ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు మస్క్, వివేక్‌లు ప్రకటించారు. వారిని నియమిస్తున్నట్టు గురువారం ట్రంప్ ప్రకటించగా, వెంటనే రంగంలో పని ప్రారంభించారు. డీఓజీఈలో పనిచేసేందుకు ఆసక్తికలవారు తమ రెజ్యూమేలను ఎక్స్ ద్వారా డైరెక్ట్ మెసేజ్ (డీఎం)ల రూపంలో పంపించాలని సూచించారు. నెలకు కనీసం 8 డాలర్ల చందా చెల్లించే ఎక్స్ ఖాతాల ద్వారా మాత్రమే ఈ డీఎంలు పంపించే అవకాశం ఉంది. "ఐడియాలు ఇచ్చేందుకు మాకు పార్ట్ టైం ఉద్యోగులు అవసరం లేదు. 'స్మాల్-గవర్నమెంట్' విప్లవకారులుగా పనిచేసేందుకు సూపర్ హై-ఐక్యూ, వారానికి 80గంటలకు పైగా (రోజుకు సుమారుగా 12 గంటలు) పనిచేసేందుకు అనురక్తి ఉండేవారు కావాలి. 'ఖర్చుల్లో కోత విధించే' పనులు చేయాలి. ఇది అంత గ్లామర్‌గా ఉండదు. మొదటి 1%లో ఉండే డైరెక్ట్ మెసేజ్‌లను ఎలాన్, వివేక్‌లు స్వయంగా పరిశీలిస్తారు" అని డీఓజీఈ ఎక్స్ సందేశంలో తెలిపింది. ఎలాన్ మస్క్ మరో సందేశం ఇస్తూ "డీఓజీఈలో పనిచేసే సిబ్బంది ప్రభుత్వ వ్యయాల తగ్గింపునకు, సామర్థ్యం పెంపునకు జాగురూకతతో పని చేయాల్సి ఉంది. ఇందుకు ఎలాంటి పరిహారం చెల్లించరు" అని స్పష్టం చేశారు. "నిజానికి ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. ఎంతో మంది శత్రువులను కొని తెచ్చుకుంటారు. పరిహారం మాత్రం సున్నా. చాలా మంచి బేరం కదూ!" అంటూ వ్యాఖ్యానించారు.

యుద్ధాలను నిలిపివేస్తా

శక్తిమంతమైన సైన్యం సాయంతో ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్, మధ్యప్రాచ్యం యుద్ధాలను నిలిపివేస్తానని ట్రంప్ అన్నారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని పామ్‌బీచ్‌లో ఉన్న తన సొంత రిసార్ట్ అయిన మార్ ఎ లాగోలో నెలకొల్పిన 'అమెరికా ఫస్ట్' పాలసీ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం జరిగిన సన్మాన సభలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. 'అమెరికా ఫస్ట్' పేరుతో విదేశాంగ విధానంపై మాట్లాడుతూ 'తక్కువ పన్నులు, శక్తిమంతమైన సైన్యం ఉన్న దేశంగా అమెరికాను మళ్లీ అభివృద్ధి చేయాలి' అని అన్నారు. మరోవైపు ఫాక్స్ న్యూస్ టీవీ యాంకర్, నేషనల్ గార్డ్ మాజీ ఉద్యోగి పీట్ హెగ్‌సెట్‌ను రక్షణ మంత్రిగా నియమించాలని ట్రంప్ ప్రతిపాదించారు. దీన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది.

ఇరాన్ రాయబారితో ఎలాన్ మస్క్ భేటీ!

న్యూయార్క్, నవంబరు 15: అమెరికా, ఇరాన్ అంతర్యుద్ధం వేళ కీలక పరిణామం జరిగింది. ఐక్యరాజ్యసమితికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానితో అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు. ఓ రహస్య ప్రదేశంలో వీరిద్దరు సమావేశమైనట్లు శుక్రవారం న్యూయార్క్ టైమ్స్ ఒక కథనంలో పేర్కొంది. కనీసం గంట పాటు జరిగిన చర్చల్లో రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు దృష్టి సారించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను తొలగించాలని, రెండు దేశాల మధ్య వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించాలని ఆ దేశ రాయబారి కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశానికి సంబంధించి అమెరికా, ఇరాన్ అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఓబీసీ క్రీమీలేయర్‌లో 'జీతం' లెక్కించాలా?


ప్రభుత్వరంగ సంస్థల సిబ్బందికీ వర్తింపజేయాలా?

» పార్లమెంటరీ స్థాయీ సంఘంలో చర్చ

న్యూఢిల్లీ, నవంబరు 15: సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఓబీసీ క్రీమీలేయర్ విధానాన్ని అమలుచేయడంలో వారి తల్లిదండ్రుల 'వేతనాన్ని' పరిగణనలోకి తీసుకునే విషయంలో పార్లమెంటరీ స్థాయీ సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఈ నెల 28వ తేదీకి సమావేశం వాయిదా పడింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేస్తున్న ఓబీసీ వర్గం తల్లిదండ్రుల పిల్లల విషయంలో ఈ సమస్య తలెత్తింది. తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి ఓబీసీ క్రీమీలేయర్‌ను సహజంగా నిర్ణయిస్తారు. ఒకవేళ ఆదాయం రూ. 8 లక్షలు మించితే వారి పిల్లలకు రిజర్వేషన్లు వర్తించవు. ఈ విధానాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కూడా వర్తింపజేయాలని ఇటీవల సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల ఆదాయాన్ని లెక్కించడంలోనూ 'వేతనాన్ని' పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని ఓబీసీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రస్తుతం పరిశీలిస్తోంది. ఇందుకోసం వచ్చే సమావేశానికి హాజరు కావాల్సిందిగా కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం ఉన్నతాధికారులకు నోటీసులు జారీచేసింది. అయితే, పీఎస్‌యూలకూ 'వేతన' ప్రమాణాన్ని వర్తింపజేసే ప్రతిపాదనను విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు వ్యతిరేకిస్తున్నారు. పీఎస్‌యూల్లో పనిచేస్తున్న ఓబీసీ కేటగిరి సిబ్బంది వేతనం, వ్యవసాయం ద్వారా వారికి లభించే లాభాలను.. ఆదాయంగా పరిగణించరాదని 1993 ఆఫీస్ మెమొరండంలో స్పష్టంగా ఉన్నదని, కానీ, దానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు ఆక్షేపించారు. ఈ కారణంగా అనేక మంది ఓబీసీ అభ్యర్థులు గ్రూపు ఏ,బీ,సీ,డీ పోస్టులకు అనర్హులు అవుతున్నారన్నారు. అయితే, ఐదేళ్ల క్రితం ఇదే అంశం చర్చకు వచ్చినప్పుడు దానిని స్థాయీ సంఘం తిరస్కరించింది. అప్పుడు స్థాయీ సంఘానికి నేతృత్వం వహించిన బీజేపీ ఎంపీ సురేశ్ సింగ్ ఇప్పుడూ సంఘం చైర్మన్‌గా ఉండటం గమనార్హం.

మధుమేహుల్లో నాలుగో వంతు భారత్‌లోనే

» ప్రపంచవ్యాప్తంగా 82.8 కోట్లు.. భారత్‌లో 21.2 కోట్ల మంది బాధితులు



న్యూఢిల్లీ, నవంబరు 15: ప్రపంచానికి అతిపెద్ద సవాల్ విసురుతున్న సమస్యల్లో మధుమేహం ఒకటి. 2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 82.8 కోట్ల మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, ఇందులో నాలుగో వంతు మంది భారత్ (21.2 కోట్లు)లోనే ఉన్నారని ది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచ మధుమేహ దినోత్సవం (నవంబరు 14) సందర్భంగా ప్రచురించిన ఈ అధ్యయనం ప్రకారం.. 1990 లెక్కలతో పోలిస్తే ఈ 82.8 కోట్ల సంఖ్య నాలుగు రెట్లు అధికం. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ సంఖ్యలో భారీగా పెరుగుదల కనిపించిందని అధ్యయనానికి నేతృత్వం వహించిన నాన్ కమ్యూనబుల్ డిసీజ్ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబరేషన్ (ఎన్‌సీడీ-ఆర్ఐఎస్‌సీ) పరిశోధకులు తెలిపారు. 1990-2022 మధ్యకాలంలో అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో మధుమేహ చికిత్స రేట్లు తక్కువగానే ఉన్నాయని, కేసులు మాత్రం ఎక్కువగా పెరిగాయని వారు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మధుమేహంతో బాధపడుతున్న 82.8 కోట్ల మందిలో ఒక్క భారత్‌లోనే 21.2 కోట్ల మంది ఉన్నారని, ఆ తర్వాత చైనాలో 14.8 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు. అమెరికాలో 4.2 కోట్లు, పాకిస్థాన్‌లో 3.6 కోట్లు, బ్రెజిల్‌లో 2.2 కోట్ల మంది ఉన్నారని చెప్పారు. 2022లో 30 ఏళ్లు పైబడిన బాధితుల్లో 44.5 కోట్ల మంది అసలు మధుమేహానికి చికిత్స తీసుకోలేదని, వారిలో 13.3 కోట్ల మంది భారత్‌లోనే ఉన్నారని వెల్లడించారు.

బై బ్యాక్ పాలసీ పేరుతో బురిడీ

- ప్లాట్లు, బంగారంపై పెట్టుబడి పెడితే.. ప్రతి నెల రిటర్న్స్, రెట్టింపు లాభాలంటూ మోసం
- 3,600 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు
- 8 మందిని అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ప్లాట్లు, బంగారంపై పెట్టుబడులు పెడితే 'బై బ్యాక్ పాలసీ' కింద ప్రతి నెల రిటర్న్స్ ఇవ్వడంతో పాటు 25 నెలల్లో రెట్టింపు లాభాలు ఇస్తామని జనానికి ఆశపెట్టిందో ముఠా. 3,600 మంది నుంచి రూ.300 కోట్లు కొల్లగొట్టింది. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ(ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్) డీసీపీ కె.ప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన కలిదిండి పవన్‌కుమార్, తన సహచరులు రావుల సత్యనారాయణ, బొడ్డు హరికృష్ణ, వల్లూరు భాస్కర్‌రెడ్డి, పగడాల రవికుమార్‌రెడ్డి, కొల్లాటి జ్యోతి, కూరళ్ల మౌనిక, కుర్కుల లావణ్యతో '12 వెల్త్ క్యాపిటల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో సంస్థను ప్రారంభించాడు. బై బ్యాక్ పాలసీ కింద ఒక వ్యక్తి రూ.8.8 లక్షలు పెట్టుబడి పెడితే 2 గుంటల మేర ఓపెన్ ప్లాటు వారి పేరున రిజిస్ట్రేషన్ చేస్తారు. బై బ్యాక్ పాలసీ కింద ప్రతి నెల రూ.32,000 చొప్పున 25 నెలలపాటు రిటర్న్స్ ఇస్తామని నమ్మించారు. అంతేకాకుండా కొత్త కస్టమర్లను చేర్పించి వారితో పెట్టుబడి పెట్టిస్తే.. కమీషన్ కింద ప్రతి నెల రూ.7,200 చొప్పున 25 నెలలు అందిస్తామని నమ్మించారు. అయితే ఈ ముఠా డబుల్ గోల్డ్ స్కీమ్ అంటూ మరో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద.. ఒక కస్టమర్ రూ.4లక్షలు పెట్టుబడిగా పెట్టి గోల్డ్ స్కీమ్‌లో చేరితే.. 12 నెలల్లోనే రూ.8లక్షల విలువైన బంగారం బిస్కెట్లు అందిస్తామని ముఠా నమ్మించింది. ఈ మేరకు రసీదులు, బాండ్లు రాసిచ్చారు. స్విట్జర్లాండ్ ముద్రతో బంగారం బిస్కెట్లు అందిస్తామని నవిస్మించారు. తమకు తెలిసినవారు, స్నేహితులు, బంధువులతో పాటు కొంతమంది ఏజెంట్ల ద్వారా సుమారు 3600 మంది కస్టమర్ల నుంచి రూ.300 కోట్లు సేకరించారు. నమ్మకం కోసం కొద్దిరోజులు రిటర్న్స్ ఇచ్చిన ముఠా ఆ తర్వాత ఇవ్వడం ఆపేసి బిచాణా ఎత్తేసింది. దీంతో బాధితులు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీకి చెందిన నాయని హరికాంత ఫిర్యాదు మేరకు ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు టీమ్ రంగంలోకి దిగి 8 మందితో కూడిన ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఇలాంటి స్కీములు నమ్మి ఎవరూ మోసపోవద్దని డీసీపీ సూచించారు.

ఫిలిప్పైన్స్‌లో సంగారెడ్డి జిల్లా వైద్య విద్యార్థిని మృతి

- పుట్టిన రోజునే అనంత లోకాలకు
- అనుమానాస్పదంగా గదిలో మృత్యువాత


విద్యార్థిని స్నిగ్ధ

పటాన్‌చెరు, నవంబరు, 15 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పైన్స్‌లో రాష్ట్ర వైద్య విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతురాలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇంద్రేశానికి చెందిన స్నిగ్ధ. శుక్రవారం ఆమె పుట్టినరోజు. ఆ రోజు రాత్రి కొందరు స్నేహితులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఆమె గదికి వెళ్లగా అప్పటికే విగతజీవిగా పడి ఉంది. అమృతరావు, అరుణ దంపతులకు స్నిగ్ధ ఏకైక కుమార్తె. అమృతరావు మెదక్‌లో ట్రాన్స్‌కో డీఈగా పనిచేస్తున్నారు. స్నిగ్ధ మనీలాలోని పర్పెక్చువల్ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. చలనం లేని స్థితిలో ఉన్న స్నిగ్ధను గమనించిన స్నేహితులు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతిపై తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇంద్రేశంలోని అమృతరావు ఇంటికి పెద్దఎత్తున బంధువులు, స్నేహితులు చేరుకుని వారిని ఓదార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గత మార్చిలో స్నిగ్ధ ఇంటికి వచ్చి నెలపాటు కుటుంబంతో సంతోషంగా గడిపి వెళ్లింది. ప్రతి రోజు తమతో మాట్లాడే బిడ్డ హఠాత్తుగా మృతి చెందడంపై అనుమానాలున్నాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమార్తెను డాక్టర్‌ను చేయాలని విదేశాలకు పంపిస్తే ఘోరం జరిగిపోయిందని అమృతరావు కంటికిమంటికీ ధారగా రోదించడం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. తమ బిడ్డ మృతిపై ఫిలిప్పైన్స్ ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని తండ్రి అమృతరావు కోరారు. మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వం సహకరించాలని కోరారు.

పాల లాభం.. గాడిద గుడ్డు

గాడిదలను అంటగట్టి రూ.100కోట్లకు కుచ్చుటోపీ.. లీటరు పాలు 1600కు కొంటామని ఆశపెట్టిన వైనం

- రూ.కోటి పెట్టుబడి పెట్టిన బాధితులు
- చేతులెత్తేసిన 'ది డాంకీ ప్యాలెస్'
- న్యాయం చేయాలంటూ వేడుకోలు


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బాధితులు

పంజాగుట్ట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బర్రె పాలు చిక్కటివైతే లీటరు ఎక్కువకు ఎక్కువ రూ.80! మరి.. గాడిద పాలు లీటరు ధర ఎంతో తెలుసా రూ.1,600! ఓ షెడ్డు కట్టుకొని 20-30 గాడిదలు కొనుక్కొని పాలు పితికి ఇస్తే డబ్బులిచ్చే పూచీ మాది! తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన 'ది డాంకీ ప్యాలెస్' సామాజిక మాధ్యమాల్లో ఇలానే ప్రచారం చేసింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది ఎగబడ్డారు. పెద్ద పెద్ద షెడ్లు నిర్మించి.. రూ.80వేల నుంచి రూ.1.50 లక్షల చొప్పున వెచ్చించి గాడిదలు కొనుక్కున్నారు! కొద్దిరోజులు చెప్పినట్లుగానే పాలు తీసుకున్న 'ది డాంకీ ప్యాలెస్' నిర్వాహకులు తర్వాత తూచ్ పొమ్మన్నారు! ఫలితంగా నమ్మి గాడిదలు కొనుకున్న వారంతా తలా రూ.50 లక్షల నుంచి రూ.కోటి దాకా నష్టపోయారు! అయితే.. 'గాడిద' మాటలతో నమ్మించి 'ది డాంకీ ప్యాలెస్' వారు రూ.100 కోట్ల దాకా పోగేసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన బాధితులు, ఫ్రాంచైజీ సభ్యులు గోడు వెళ్లబోసుకున్నారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. కరోనా తర్వాత జనాలకు రోగ నిరోధక శక్తి పెరుగుదల, పోషక పదార్థాలు అవసరం చాలా ఉంటుందని.. ఇవి గాడిద పాలల్లో పుష్కలంగా ఉంటాయని.. ఔషధాల తయారీలోనూ గాడిద పాలు వాడతారని ఫలితంగా డిమాండ్ బాగా ఉంటుందంటూ ది డాంకీ ప్యాలెస్ నిర్వాహకుడు బాబు ఉలఘనాథన్, సభ్యులు గిరి సుందర్, బాలాజీ, సోనిక రెడ్డి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఫలితంగా చాలామంది ఫ్రాంచైజీలు తీసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కట్టారు, షెడ్లు నిర్మించుకున్నారు, వారి వద్దనే గాడిదలు కొనుగోలు చేశారు. మూడు నెలలు వారి వద్ద నుంచి పాలు సేకరించి డబ్బులు చెల్లించినా తర్వాత స్పందించడం, డబ్బులు చెల్లించడం మాని వేశాడని బాధితులు ఆరోపించారు. వారు ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అప్పు చేసి మరి ఫ్రాంచైజీలో చేరామని.. సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 లక్షలు తీసుకున్నారని వారు చెప్పిన విధంగా అన్ని సౌకర్యాలతో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి షెడ్లు కూడా నిర్మించామని అన్నారు. 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు, నాలుగు నెలల పాటు లీటరుకు రూ.1600 చొప్పున ఒక్కొక్కరికి సుమారు రూ.4లక్షలు-రూ5లక్షల దాకా చెల్లించారని చెప్పారు. భారీగా లాభాలు వస్తాయని నమ్మించడంతో తాము తీసుకున్న డబ్బులను తిరిగి వ్యాపారంలోనే పెట్టించారని చెప్పారు. 2023 ఏప్రిల్, మే తర్వాత నుంచి ఇప్పటి వరకు సరఫరా చేసిన పాల డబ్బులు, నిర్వహణ ఖర్చులు, షెడ్ నిర్మాణం, సిబ్బంది జీతాలు, వెటర్నరీ చికిత్స ఖర్చులు ఇవ్వడం లేదని చెప్పారు. తమతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఇచ్చిన జీఎస్టీ సంఖ్య కూడా నకిలీదని, అసలు గాడిద పాలతో వ్యాపారం చేయడానికి మన దేశంలో అనుమతి లేదని తెలుసుకున్నామని అన్నారు. చివరికి.. మోసపోయామని గ్రహించి ప్రశ్నిస్తే తమకు బ్యాంకు చెక్కులు ఇచ్చారని, తమ బ్యాంకు ఖాతాలో వేస్తే అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు వంద మందికి పైగా రూ.100 కోట్ల వరకు నష్టపోయామన్నారు. ఇదో పెద్ద కుంభకోణమని, దీని వెనుక రాజకీయ పెద్దల హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తమిళనాడులో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నామని, తమ సమస్య మీద మాజీ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా స్పందించారని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రులు స్పందించి తమకు న్యాయం చేయాలని, తమ డబ్బులు తమకు ఇప్పించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేకపోతే తమకు బలవన్మరణాలే దిక్కు అని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు గాడిదలను పోషించలేక విడిచి పెట్టామని తేజస్విని అనే బాధితురాలు చెప్పారు. కాగా తిరునల్వేలి కలెక్టర్ విష్ణు గోపాలన్ డాంకీ ప్యాలెస్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారని బాధితులు చెప్పడం గమనార్హం. కొసమెరుపు ఏమిటంటే.. గాడిదల పేరుతో కోట్లు కొల్లగొట్టిన 'ది డాంకీ ప్యాలెస్' నిర్వాహకుడు బాబు ఉలఘనాథన్ పెద్దగా చదువుకోలేదట! ఏడో తరగతి ఫెయిల్ అయ్యాడట!

దోష నివారణ పేరిట ట్రాన్స్‌జెండర్ మోసం

- జనగామలో అక్కాతమ్ముళ్ల నుంచి రూ.55 లక్షలు కాజేత

జనగామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): "మీ ఇంటో దోషం ఉంది, నివారణ పూజలు చేయాల"ంటూ ఓ అమాయక మహిళను, ఆమె తమ్ముడిని ఓ ట్రాన్స్‌జెండర్ మోసం చేసింది. శాంతి పూజలు పేరిట వారి నుంచి దాదాపు రూ.55 లక్షలు దోచుకుంది. జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామలోని వెంకన్నకుంటకు చెందిన ఉప్పల సిరివెన్నెలకు నిరోష అనే స్నేహితురాలి ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సత్యనారాయపురం గ్రామానికి చెందిన నాగదేవి అనే ట్రాన్స్‌జెండర్ పరిచయం అయింది. ఈ ఏడాది జూన్‌లో నాగదేవి జనగామకు రాగా సిరివెన్నెల తన కుటుంబంలోని సమస్యలను ఆమెకు వివరించింది. "మీ ఇంటో దోషం ఉంది. అందుకే ఇలా జరుగుతోంది. దోషం తొలగాలంటే పూజాలు చేయాలి. అందుకు పెద్దమొత్తంలో డబ్బు అవసరమవుతుంది" అని నాగదేవి చెప్పింది. ఈ విషయాన్ని సిరివెన్నెల మేడ్చల్‌లోని తన తమ్ముడు నిఖిల్‌కు వివరించింది. అనంతరం జనగామలో నాగదేవి ఇంట్లో ఓసారి, మేడ్చల్‌లోని నిఖిల్ ఇంట్లో ఓసారి నాగదేవి పూజలు చేసింది. ఈ క్రమంలో వారి నుంచి రూ.55 లక్షల వరకు వసూలు చేసింది. ఇందులో రూ.13 లక్షలు లిక్విడ్ క్యాష్ రూపంలో, మిగిలినవి ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా తీసుకుంది. అయితే పూజలు చేసి అయిదు నెలలు గడుస్తున్నా కుటుంబ పరిస్థితులు చక్కబడకపోవడంతో సిరివెన్నెల, నిఖిల్‌లు నాగదేవిని నిలదీశారు. ఆమె నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని జనగామ సీఐ తెలిపారు.

మా అమ్మాయికి చికిత్స చేయించండి

- ప్రజావాణి తలుపుతట్టిన పేద కుటుంబం
- స్పందించి చికిత్స చేయించిన అధికారులు


ఆపరేషన్ అనంతరం బిస్మిల్లా బీతో ఆరోగ్య మిత్ర ప్రతినిధి

బేగంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): "నా కూతురు(16) గొంతు వాపు వ్యాధితో బాధపడుతోంది. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే రూ.2 లక్షలు ఖర్చవుతుందన్నారు. నా భర్త చనిపోయాడు. నాకు అంత ఆర్థిక స్తోమత లేదు. నా బిడ్డకు చికిత్స చేయించండి" అంటూ ఓ తల్లి ప్రజావాణిని ఆశ్రయించారు. స్పందించిన అధికారులు ఆ బాలికకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. సైదాబాద్‌కు చెందిన జుమాన్ బీ భర్త ఎనిమిదేళ్ల క్రితం చనిపోయారు. ఆమె చిన్న కిరాణ దుకాణం నడుపుకుంటూ కూతురు బిస్మిల్లా బీ(16)ను పోషించుకుంటుంది. అయితే ఏడాది క్రితం బిస్మిల్లా బీ మెడకు ఎడమవైపు వాపు వచ్చింది. అది గొంతు వద్ద గడ్డలా మారింది. దాంతో తరచూ నొప్పి, జ్వరంతో పాటు ఆకలి లేకపోవడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. గడ్డ కారణంగా ఆహారం తీసుకునేటప్పుడు నొప్పితో ఇబ్బంది పడుతుండేది. సమస్య తీవ్రతరం కావడంతో స్థానికంగా ఉన్న ఓ వైద్యుడిని సంప్రదించగా క్యాన్సర్ అయ్యి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే రూ.2 లక్షల ఖర్చవుతుందన్నారు. అంత ఆర్థికస్తోమత లేక జుమాన్ బీ అక్టోబరు 18న ప్రజాభవన్‌లో ప్రజావాణికి వెళ్లి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు తన బాధను చెప్పుకున్నారు. ఆమె వెంటనే స్పందించి బాలికకు అవసరమైన చికిత్స ప్రైవేట్ ఆస్పత్రిలో అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు ఈనెల 6న బిస్మిల్లా బీను ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. బాలిక కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీకి అవసరమైన పత్రాలను అధికారులు ఆస్పత్రి వర్గాలకు అందించారు. అదే రోజు సాయంత్రం బాలికకు గొంతు వద్ద శస్త్రచికిత్స చేశారు. వారం రోజులకు సరిపడా మందులు అందించి ఈనెల 8న బాలికను ఆరోగ్య మిత్ర ప్రతినిధులు అంబులెన్స్‌లో ఇంటికి పంపించారు. కాగా, తనకు ఉచితంగా వైద్యం అందించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి బిస్మిల్లా బీ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు బాలిక ఓ లేఖ రాసింది.

శ్రీశైలంలో వేగంగా పడిపోతున్న నీటి నిల్వ

- పోటీపడి తరలిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాలు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పోటీపడి నీటిని తరలిస్తుండటంతో శ్రీశైలంలో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. గడిచిన రెండు నెలల్లో రిజర్వాయర్‌లో నీటి నిల్వ సగటున రోజుకో టీఎంసీ తగ్గిపోతోంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 166.31 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పటికే 49.5 టీఎంసీల నీటిని తరలించాయి. ఇందులో తెలంగాణ 16 టీఎంసీల నీటిని తరలించగా, మిగిలిన నీటిని ఏపీ తీసుకువెళ్లింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును ఆపేయాలని కృష్ణాబోర్డు ఇప్పటికే ఏపీని రెండుసార్లు కోరింది. అయినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటి తరలింపును కొనసాగిస్తోంది. తెలంగాణ తరలించిన నీటిలో మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వాటా ఉంది. నీటి తరలింపులో రెండు రాష్ట్రాలు ఆచితూచి వ్యవహరించాలని కృష్ణా బోర్డు ఇప్పటికే రెండుసార్లు కోరింది. అయినా, ఫలితం లేకుండా పోతోంది. మరోవైపు, జలాశయానికి నెలరోజుల నుంచి ఒక్క చుక్క ఇన్‌ఫ్లో కూడా లేదు. ఇదే పరిస్థితి మరో నెలన్నరరోజుల పాటు కొనసాగితే శ్రీశైలం డెడ్ స్టోరేజీలోకి వెళ్లనుంది. దీంతో, వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.


సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సాయిబాబా ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోవెలలో కార్తీక దీప కాంతులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవాలయాలు దీపాల కాంతుల్లో వెలిగిపోయాయి. మహిళలు భక్తి పారవశ్యంతో వెలిగించిన దివ్వెలతో కోవెలలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచే దైవ దర్శనాల కోసం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేములవాడ, యాదగిరి గుట్ట, కీసర, ధర్మపురి, వేయి స్తంభాల ఆలయం, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. కీసరగుట్ట ఆలయంలో వేకువ జామున 3 గంటలకే రామలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ధర్మపురిలోని బ్రహ్మపుష్కరిణిలో పంచ సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. యాదగిరి గుట్ట, గూడెం గుట్ట ఆలయాల్లో దంపతులు పెద్ద సంఖ్యలో వ్రత పూజలు చేశారు.

రిజిస్ట్రేషన్‌కు రూ.2లక్షలు లంచం డిమాండ్ చేశారంటూ పిటిషన్

- రంగారెడ్డి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1, సిబ్బందిపై విచారణకు హైకోర్టు ఆదేశాలు
- ఆఫీసుల్లో ఫిర్యాదుల పెట్టెలు పెట్టాలని ఆదేశం

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేస్తున్నారని కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌కు చెందిన పి.రమ్యశ్రీ, కొండాపూర్ రాజరాజేశ్వర నగర్‌కు చెందిన వల్లూరి వెంకటరమణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1(మూసాపేట్) కార్యాలయంలో సిబ్బంది లక్ష్మణ్ రెడ్డి, సాయి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ డాక్యుమెంట్ రైటర్ రూ.2 లక్షల లంచం డిమాండ్ చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర్‌నగర్‌లోని 300 చదరపు గజాల ప్లాట్‌కు సంబంధించిన సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయడంలేదని తెలిపారు. ఈ పిటిషన్ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు రాగా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌ను ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. విచారణకు హాజరైన రంగారెడ్డి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 వివరణ ఇస్తూ.. పిటిషనర్లు అసలు డాక్యుమెంట్ సమర్పించలేదని.. పిటిషనర్లు ఆరోపిస్తున్న తేదీన తాను సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు పిటిషనర్లు ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం..'రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై అధికారులు విచారణకు ఆదేశించి.. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ తనిఖీలు నిర్వహించి తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ల వ్యవస్థను సరిచేస్తారని, తమ మార్గదర్శకాలను అమలుచేస్తారని భావిస్తున్నాం. ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1, సిబ్బందిపై విచారణ చేపట్టాలి. పిటిషనర్ల సేల్‌డీడ్ డాక్యుమెంట్లను వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయాలి. తదుపరి విచారణ నాటికి రంగారెడ్డి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై విచారణ నివేదికను సీల్డ్ కవర్‌లో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సమర్పించాలి' అని పేర్కొంది.

'గాంధీ'లో ఎక్స్‌రేలకు తిప్పలు

- ఆస్పత్రిలో ఆర్నెల్లుగా మూలన పడ్డ యంత్రాలు
- ఐదింటికిగాను వాడుకలో ఉన్నది ఒకే ఒక్కటి
- ఐపీ, ఓపీ విభాగాల్లో రోగులకు తీవ్ర ఇబ్బందులు
- ఎక్స్ రే తీయించుకోవడానికి 2, 3 రోజులు పడిగాపులు



అడ్డగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే అతి పెద్ద ప్రభుత్వ దవాఖాన అయిన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎక్స్ రే యంత్రాలు పని చేయడం లేదు. ఆస్పత్రి మొత్తం ఐదు యంత్రాలు ఉండగా.. అందులో నాలుగు మూలన పడ్డాయి. ఒకే యంత్రం పనిచేస్తుండటంతో ఐపీ, ఓపీ విభాగాలకు చెందిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓపీకి వచ్చే రోగులు బయట ఎక్స్‌రేలు తీయించుకుంటున్నారు. డబ్బులు లేని నిరుపేదలు ఆస్పత్రిలోనే ఎక్స్ రే తీయించుకోవాలనుకుంటే రెండు, మూడు రోజులు ఎదురుచూడాల్సి వస్తోంది. మరోవైపు, హైదరాబాద్‌లో అర్ధరాత్రి ప్రమాదాలకు గురైన వారు దాదాపు 150 మంది వరకు అంబులెన్స్‌ల్లో గాంధీకి వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో వీరికి ఎక్స్‌రేలు తీయడం ఇబ్బందిగా మారుతోంది. ఆర్నెల్లుగా యంత్రాలు పనిచేయకపోయినా.. పట్టించుకోకపోవడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిల్లో పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి'లో ఇరవై రోజుల క్రితం కథనం వచ్చింది. దీనిపై స్పందించిన తెలంగాణ డీఎంఈ డాక్టర్ వాణి అదే రోజు ఆస్పత్రికి వచ్చారు. ఈ క్రమంలో ఎక్స్‌రే యంత్రాల విషయం ప్రస్తావనకు వచ్చింది. పాడైపోయిన యంత్రాలను మూడు రోజుల్లో బాగు చేస్తామని ఆమె హామీ ఇచ్చినా.. సమస్య పరిష్కారం కాలేదు.

విడి భాగాలు ముంబై నుంచి రావాలి

ఎక్స్‌రే యంత్రాల విడి భాగాలు ముంబై నుంచి రావాలని రేడియాలజీ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. కంపెనీకి సమాచారం ఇచ్చామని, రెండు మూడు రోజుల్లో ముంబై నుంచి టెక్నీషియన్లు వస్తున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని చెప్పారు.

మొన్న పూవర్తి.. నేడు కొండపల్లి

- నక్సల్స్ అడ్డాలో మరో పోలీస్ క్యాంప్
- స్తూపాల కూల్చివేత.. మొదలైన కూబింగ్
- 5 వేల మంది పోలీసులతో పూవర్తి అడవులు జల్లెడ


కొండపల్లిలో స్తూపాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూలుస్తున్న దృశ్యం

చర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రాబల్యమున్న ప్రాంతాలను తమ అదుపులోకి తీసుకుని భద్రతా దళాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మొదటి బెటాలియన్ సీఎల్‌జీఏ కమాండర్ మాద్వి హిడ్మా సొంతూరు బీజాపూర్ జిల్లాలోని పూవర్తిని ఇప్పటికే అధీనంలోకి సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశాయి. సుమారు 5వేల మంది కేంద్ర బలగాలు పూవర్తి అడవులను జల్లెడ పడుతున్నాయి. ఇటు మావోయిస్టుల సంచారం అధికంగా ఉండే కొండపల్లి గ్రామంలోనూ గురువారం సీఆర్‌పీఎఫ్ పోలీస్ క్యాంపును ఏర్పాటు చేశారు. దాదాపు 5 వేల మంది డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, మహిళా కమాండోలు రంగంలోకి దిగారు. కొండపల్లిని అధీనంలోకి తీసుకుని.. అక్కడి భారీ స్తూపాలను కూల్చివేశారు. గతంలో చనిపోయిన మావోయిస్టుల ముఖ్య నేతల స్మారకార్థం పదేళ్ల కింద మావోయిస్టులు ఈ స్తూపాలను నిర్మించారు. వీటి వద్దే మావోయిస్టుల సమావేశాలు జరుగుతుండేవని.. ఇవి 30, 20 అడుగుల ఎత్తు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కొండపల్లి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. కొండపల్లిలో క్యాంప్ ఏర్పాటుపై మావోయిస్టులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. వేల మంది పోలీసులు కొండపల్లిలో మకాం వేయడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. వెరసి.. అడవుల్లో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో పూవర్తి, గుండం, ధర్మారంలో పోలీసులు క్యాంపులు ఏర్పాటు చేస్తుండగా మావోయిస్టులు దాడులు చేసిన ఘటనలున్నాయి.

అయ్యప్ప భక్తుల కోసం మరో 4 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల కోసం మరో 4 ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈనెల 22, 25 తేదీల్లో హైదరాబాద్‌లోని మౌలాలి స్టేషన్ నుంచి కొల్లాంకు, ఈనెల 24, వచ్చేనెల 1 తేదీల్లో కొల్లాం నుంచి మౌలాలికి ఈ ప్రత్యేకరైళ్లు నడుస్తాయని సీపీఆర్‌వో(చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) శ్రీధర్ తెలిపారు. చర్లపల్లి, భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట తదితర స్టేషన్ల మీదుగా ఈ ప్రత్యేకరైళ్లు నడుస్తాయన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గ్యాస్‌చాంబర్

గాలి నాణ్యత ముప్పైఐదున్న వయనాడ్‌నుంచి గ్యాస్‌చాంబర్ లాగా ఉన్న ఢిల్లీలో ఇప్పుడే అడుగుపెట్టానంటూ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ట్వీట్ చేశారు. అందులో బాధ ఉన్నదో, బాదుడు ఉన్నదో తెలియదు గానీ, ఢిల్లీకాలుష్యం ఉచ్ఛస్థితికి చేరి అందరినీ భయపెడుతోంది. పెద్దలు బయటకు రావద్దని, పిల్లలు స్కూలుకుపోవద్దని, టీచర్లు ఆన్‌లైన్‌లోనే పాఠాలు చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రతీ ఏటా విద్యాసంస్థలకు సమ్మర్ హాలిడేస్ లాగా పొల్యూషన్ హాలిడేస్ కూడా ముందుగానే క్యాలండర్‌లో నిర్ణయించాల్సిన కాలం సమీపిస్తున్నదేమో. గ్రాప్–3 నిబంధనలను అమలులోకి తెచ్చి భవన నిర్మాణాలనుంచి వాహన వినియోగం వరకూ సమస్తమూ నియంత్రించే ప్రయత్నం సాగుతోంది. మార్నింగ్ వాక్ మానేసి చాలా రోజులైందనో, ఎదురుగా నిలబడినా తాజ్‌మహల్ కనిపించడం లేదనో సుప్రీంకోర్టు నుంచి సామాన్యుడి వరకూ బాధపడుతున్నారు. ఢిల్లీలో దిగాల్సిన విమానాలు మరెక్కడో నేలవాలుతున్నాయి, దారికనిపించక రైళ్ళు రాజధానికి ఆలస్యంగా చేరుతున్నాయి. దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతున్నామని చెబుతున్న పాలకులు, గాలినాణ్యత అథమస్థాయికి చేరి రికార్డులు రాస్తున్న రాజధానిని మాత్రం దాని ఖర్మానికి వదిలేశారు.

ఢిల్లీలో చాలాప్రాంతాలవారికి సరిగా ఊపిరి అందడంలేదు, కళ్ళు, ముక్కు మండిపోతూ, తీవ్రమైన తలనొప్పితో రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. నివాసయోగ్యం కాని ప్రాంతంగా ఢిల్లీని ప్రకటించడం ఎంతో దూరంలో లేదని ఓ పర్యావరణ ప్రేమికుడు చేసిన వ్యాఖ్యలో అతిశయోక్తి ఉన్నదేమో కానీ, ఆ ఆగ్రహాన్ని అర్థంచేసుకోవాలి. పలు ప్రాంతాల్లో గాలి నాణ్యతా సూచీ నాలుగువందల యాభై దాటి ఐదువందలను తాకుతూండటం ఆశ్చర్యంతో పాటు బాధ కలిగిస్తుంది. పాలకులు, ప్రజలు కాస్తంత బాధ్యతగా వ్యవహరిస్తే, అత్యున్నతస్థాయి సాంకేతికతలు అందుబాటులో ఉన్న ఈ కాలంలో కాలుష్యంపై యుద్ధం అంతకష్టమేమీ కాదన్నమాట నిజం. ఇదేమీ అకస్మాత్తుగా ముంచుకొచ్చిన కరోనా వంటి రోగం కాదు. ఏటా, మరీముఖ్యంగా శీతాకాలంలో ఢిల్లీ ఇలా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతూనే ఉంది. ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకంటూ కొన్ని వ్యవస్థలు, విధానాలు కూడా ఏర్పడ్డాయి. పొరుగు రాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం, ఢిల్లీలో వాహన, పారిశ్రామిక కాలుష్యాలు కలగలసి పరిస్థితిని తీవ్రం చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్‌ప్లాన్ (గ్రాప్) వంటి పద్ధతులున్నా, ప్రాణాల మీదకు వచ్చిన పరిస్థితుల్లో, తాత్కాలిక ఉపశమన చర్యలకే ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

గతంతో పోల్చితే ఢిల్లీ ఇప్పుడు శాశ్వత అత్యయికస్థితిని ఎదుర్కొంటోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏడాదిపాటూ చక్కని సమన్వయం కనుక ఉంటే, ఇలా శీతాకాలం సమీపించగానే ఉక్కిరిబిక్కిరి కావాల్సిన అవసరం ఉండదు. ఢిల్లీని కమ్మేస్తున్న పొగమంచుకు హర్యానా, పంజాబ్‌లలో రైతులు సరిగ్గా ఇదేకాలంలో పంటవ్యర్థాలను తగలబెట్టడం ఓ ముఖ్యకారణమవుతున్నప్పుడు అక్కడ ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నాయన్నదానితో సంబంధం లేకుండా, ఆ ప్రక్రియను నిలువరించడానికి ఒక నిర్దిష్టమైన ప్రయత్నం జరగాలి. కానీ, కేంద్రంలో, ఢిల్లీలో, హర్యానాలో, పంజాబ్‌లో అధికారంలో ఉన్న పార్టీలను బట్టి రాజకీయయుద్ధం సాగుతూంటుంది. ఒకప్పుడు పంజాబ్‌ను కూడా తప్పుబట్టిన ఆప్, ఇప్పుడు అక్కడ తమ ప్రభుత్వమే ఉన్నందున దానిని వెనకేసుకొస్తూ హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లను విమర్శిస్తున్నది. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతులకు అత్యంత సులువైన, ఆర్థికభారం లేని, ఓ అలవాటైన మార్గం. వారిని దానినుంచి మళ్ళించాలంటే, నిలువరించాలంటే పలురకాలుగా ఆదుకోవాలి. అంతేగానీ, న్యాయస్థానం గట్టిగా విమర్శించగానే పెనాల్టీలు రెట్టింపుచేసి భయపెట్టాలనుకోవడం సరికాదు. వారికి ఆర్థికసాయం, యంత్రసౌకర్యం కల్పించనంతకాలం వ్యర్థాలు ఇలా తగలబడుతూనే ఉంటాయి. వాహన, పారిశ్రామిక కాలుష్యాలు, వివిధ నిర్మాణాలూ కూల్చివేతల విషయంలోనూ ఏడాదిపాటూ వర్తించే సమగ్రమైన విధానం ఉండాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వినియోగం విస్తృత ప్రజానీకానికి నిత్యకృత్యం కావాలి. కాలుష్యం ఇంత తీవ్రంగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ ఆదేశాలు అత్యంత బలహీనంగా అమలు కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తాత్కాలిక ఉపశమన చర్యలకంటే నిర్దిష్టమైన దీర్ఘకాలిక విధానాలతోనే ఢిల్లీ కాలుష్యాన్ని కొంతమేరకు నియంత్రించగలం. ఏటా సర్వోన్నతన్యాయస్థానంతో చీవాట్లు తినడం ప్రభుత్వాలకు కూడా అప్రదిష్ఠ.

వెలలేని మాగాణి మహారాష్ట్ర

మహారాష్ట్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది, అభివృద్ధి పరిచింది భారత జాతీయ కాంగ్రెస్. బొంబాయి రాష్ట్రం నుంచి విడివడి, మరాఠా ప్రజల స్వరాష్ట్రంగా మహారాష్ట్ర ఏర్పడిన నాటి (మే 1, 1960) నుంచి ఇప్పటిదాకా (64 సంవత్సరాలుగా) 20 మంది ముఖ్యమంత్రులు (వీరిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ పర్యాయాలు ఆ ఉన్నత బాధ్యతలు నిర్వహించారు) మహారాష్ట్రను పరిపాలించారు. వారిలో ఐదుగురు మినహా అందరూ కాంగ్రెస్ పార్టీ నాయకులే (ఒకప్పుడు కాంగ్రెస్ చీలిక పక్షం ఐఎన్‌సి–సోషలిస్ట్‌కు ప్రాతినిధ్యం వహించిన శరద్ పవార్‌ను సైతం కాంగ్రెస్ ముఖ్యమంత్రిగానే నేను పరిగణిస్తున్నాను). కాంగ్రేసేతర ముఖ్యమంత్రులు మనోహర్ జోషి, నారాయన్ రాణే, దేవేంద్ర ఫడ్నవీస్, ఉద్ధావ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే. ఈ 64 ఏళ్లలో కాంగ్రెస్ ప్రత్యర్థి పక్షాలకు చెందిన ఈ ఐదుగురు ముఖ్యమంత్రుల మొత్తం పరిపాలనా కాలం 15 సంవత్సరాల 6 నెలల, 17 రోజులు. మిగతా సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాడు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మహారాష్ట్ర శాసనసభకు చివరి ఎన్నికలు నవంబర్ 2019లో జరిగాయి. గత ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఆ రాష్ట్ర పరిపాలకులుగా ఉన్నారు. వారిలో ఇద్దరు –దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే– మహాయుతి కూటమిలో ఉన్నారు. ఉద్ధవ్ ఠాక్రే ఎమ్‌వీఏ కూటమిలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ అక్టోబర్ 31, 2014 నుంచి (నవంబర్ 2019, జూన్ 2022 మధ్య రెండు సంవత్సరాల 214 రోజులు మినహా) మహారాష్ట్రలో అధికారంలో ఉన్నది. ఆ మినహాయింపు కాలంలో శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ భాగస్వాములుగా ఉన్న ఎమ్‌వీఏ కూటమి అధికారంలో ఉన్నది. శివసేన, ఎన్‌సీపీల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించిన బీజేపీ, ఎమ్‌వీఏ కూటమి ప్రభుత్వాన్ని కూల్చివేసి తన సొంత కూటమి (మహాయుతి) ప్రభుత్వాన్ని గద్దె నెక్కించింది.

నవంబర్ 20, 2024న మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 'వ్యక్తుల మంచితనం వారి అస్థికలతో భూస్థాపితమవుతుంది' అన్న షేక్స్పియర్ సత్య వచనం ఈ సందర్భంగా నాకు గుర్తుకు వస్తుంది. నిజమే, గతకాలం వైభవాలకోసం ఎవరూ ఓటువేయరు. మహారాష్ట్ర ఇప్పుడు ఎలా ఉన్నది, ఎక్కడ ఉన్నది, దాని భవిష్యత్తు ఏమిటి? ఆ భవితవ్యం ఎలా ఉండాలి అన్న విషయాలే ప్రస్తుత ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయించే అంశాలు.

ఆర్థిక వ్యవస్థకు సంబంధించినంతవరకు పారిశ్రామికీకరణలో మహారాష్ట్రను నెంబర్ 1 రాష్ట్రంగా అభివృద్ధిపరిచింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఇప్పుడు ఈ అగ్రగామి రాష్ట్రం 'అభివృద్ధి'కి సంబంధించిన వివిధ ప్రమాణాల విషయంలో అధో స్థానాలకు జారిపోయింది. ఈ క్రింది గణాంకాలే అందుకు సాక్ష్యం. గత రెండు ఆర్థిక సంవత్సరాలలో వివిధ రంగాలు ఎలా ఉన్నాయో చూడండి: (నిర్దిష్ట అంశం ఎదురుగా ఉన్న అంకెలలో మొదటిది 2022–23, రెండో అంకె 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినది) వృద్ధిరేటు: 9.4 శాతం, 7.6 శాతం; రెవెన్యూ లోటు: రూ.1,936 కోట్లు, రూ.19,531 కోట్లు; ద్రవ్యలోటు: రూ.67,602 కోట్లు, రూ.1,11,956 కోట్లు; మూలధన వ్యయం: రూ.85,657 కోట్లు, రూ.85,292 కోట్లు; వ్యవసాయ రంగ వృద్ధిరేటు: 4.5 శాతం, 1.9 శాతం; సేవల రంగ పెరుగుదల: 13 శాతం, 8.8 శాతం; రవాణా, వర్తకం, కమ్యూనికేషన్స్ రంగాల పెరుగుదల: 13 శాతం, 6.6 శాతం; నిర్మాణ రంగ వృద్ధిరేటు: 14.5 శాతం, 6.2 శాతం.



ఓటర్ (ఆమె/అతడు) పూర్తిగా ఒక ఆర్థిక జీవి (ఎకనామిక్ బీయింగ్) అయితే, మరే ఇతర అంశాల కంటే మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత సంపద్వంతం చేసే లక్ష్యానికి అగ్ర ప్రాధాన్యమిచ్చి ఆ విద్యుక్త ధర్మ నిర్వహణకు అంకితమయ్యే అభ్యర్థులు, పార్టీలకే ఓటు వేస్తాడు, వేయాలి కూడా. మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అపురూపమైనది. వెలలేని ఆస్తి అది. ఎటువంటి పరిస్థితులలోను దాన్ని అలక్ష్యం చేయకూడదు, కోల్పోకూడదు.

సరే, నిరుద్యోగిత గురించి చెప్పేదేముంది? అది పెచ్చరిల్లుతోంది. యువజనుల నిరుద్యోగిత 10.8 శాతం కాగా మహిళా నిరుద్యోగిత 11.1 శాతం; మహారాష్ట్రలో ఉద్యోగిత చాల వరకు స్వయం ఉపాధే. స్వల్ప సంఖ్యలో ఉన్న ప్రభుత్వోద్యోగాల భర్తీకి ప్రకటనలు వెలువడినప్పుడల్లా వేలు, లక్షల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 18,300 పోలీస్ కానిస్టేబుల్ / డ్రైవర్ ఉద్యోగాలకు, 4,600 తలాతి (గ్రామీణ ఉద్యోగి) ఉద్యోగాలకు 11 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఉద్యోగాలను సృష్టించే అంతర్జాతీయ కంపెనీలను మహారాష్ట్ర ప్రభుత్వం బాగానే ఆకట్టుకుంటున్నది. తమ కార్యాలయాలు లేదా ఫ్యాక్టరీలను మహారాష్ట్రలో ఏర్పాటు చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్న తరువాత, సదరు కంపెనీలు గుజరాత్‌కు తరలిపోయేలా ఢిల్లీ పాలకులు వాటికి నచ్చచెప్పుతున్నారు! టాటా–ఎయిర్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ, వేదాంత–ఫాక్స్‌కామ్ సెమి–కాండక్టర్ ఫ్యాక్టరీ ఉదంతాలే అందుకు ఉదాహరణలు. భారతదేశ వాణిజ్య రాజధానిగా ముంబై ప్రపంచ ప్రసిద్ధమయింది. అయితే ఇప్పుడు ఆ మహానగరానికి ఆ ప్రతిష్ఠ లేకుండా చేసేందుకు 'గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్–టెక్' సిటీని ప్రత్యేక చట్టాలు, అద్వితీయ సదుపాయాలతో పనికట్టుకుని అభివృద్ధి పరుస్తున్నారు.

మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్నదో రెండు ఉదాహరణలతో వివరిస్తాను. మహారాష్ట్రలో నాలుగు భిన్న ప్రాంతాలు ఉన్నాయి. అభివృద్ధిలో వాటి మధ్య అసమానత పెరిగిపోతోంది. ముంబై, పూణే, థాణే జిల్లాలు మహా సంపద్వంతమైనవి. నదుర్‌బార్, వాషిమ్, గడ్చిరోలి, యవత్మాల్, హింగోలి, బల్దానా జిల్లాలో పేదరికం తాండవమాడుతోంది. సంపద్వంత జిల్లా నికర జిల్లా దేశీయోత్పత్తి (ఎన్‌డీడీపీ), పేద జిల్లాల ఎన్‌డీడీపీ కంటే మూడు రెట్లు ఎక్కువ. తలసరి ఎన్‌డీడీపీలో వ్యత్యాసం 2011–12లో రూ.97,357 నుంచి 2022–23లో రూ.2.4 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమరీతిలో అభివృద్ధిపరచడంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో మరి చెప్పాలా?

మరో ఉదాహరణ రైతుల దుస్థితి. 2023లో మహారాష్ట్రలో 2,851 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. కారణమేమిటి? ఉల్లిపాయలపై కేంద్ర ప్రభుత్వ విధానాన్నే తీసుకోండి. మొదట ఉల్లిపాయల ఎగుమతులను నిషేధించింది. దీనిపై నిరసనలు వెల్లువెత్తడంతో ఆ ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేశారు. అయితే కనీస ఎగుమతి ధరను విధించారు. ఎగుమతి సుంకాన్ని 40 శాతంగా నిర్ణయించారు. పర్యవసానంగా ఉల్లి రైతులు భారీ నష్టాలను చవిచూశారు. అంతర్జాతీయ విపణిలో భారత్ తన వాటాను కోల్పోయింది. ఏటా జూలై నాటికి 15 లక్షల టన్నుల ఉల్లిపాయలు ఎగుమతి చేయడం పరిపాటి. అటువంటిది ఈ ఏడాది 2.6 లక్షల టన్నుల ఉల్లిపాయలే ఎగుమతి అయ్యాయి.


మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దుర్నిర్వహణకు ఇంకా ఎన్నైనా ఉదాహరణలు ఇవ్వవచ్చు. డబుల్ –ఇంజిన్ ప్రభుత్వమనేది ఒక డొల్లమాట. ఎందుకని? మొదటి ఇంజిన్ అభివృద్ధి రైలును గుజరాత్‌కు మళ్లిస్తున్నది. రెండో ఇంజిన్ ఆర్థిక వ్యవస్థకు ఒక జడభారంగా పరిణమించింది.

ఓటర్ (ఆమె/అతడు) పూర్తిగా ఒక ఆర్థికజీవి (ఎకనామిక్ బీయింగ్) అయితే, మరే ఇతర అంశాల కంటే మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత సంపద్వంతం చేసే లక్ష్యానికి అగ్ర ప్రాధాన్యమిచ్చి ఆ విద్యుక్త ధర్మ నిర్వహణకు అంకితమయ్యే అభ్యర్థులు, పార్టీలకే ఓటు వేస్తాడు, వేయాలి కూడా. మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అపురూపమైనది. వెలలేని ఆస్తి అది. ఎటువంటి పరిస్థితులలోను దాన్ని అలక్ష్యం చేయకూడదు, కోల్పోకూడదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మహాత్ముడిని మనకిచ్చిన 'ఫీనిక్స్'

సరిగ్గా నూట ఇరవై సంవత్సరాల క్రితం మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ దక్షిణాఫ్రికాలోని డర్బన్ నౌకాశ్రయానికి 14 మైళ్ల దూరంలో దాదాపు 100 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఈ భూస్వామ్యానికి పూర్వం ఆయన తన మొదటి మూడున్నర దశాబ్దాల జీవితమంతా పూర్తిగా పట్టణ ప్రదేశాలలోనే నివసించారు : పోర్ బందర్, రాజ్‌కోట్ లాంటి చిన్న పట్టణాలలోను, డర్బన్, జోహన్నెస్‌బర్గ్ లాంటి పెద్ద పట్టణాలలోను, లండన్, బొంబాయి లాంటి మహానగరాలలోను మాత్రమే ఆయన ఉన్నారు. ఈ పట్టణ, నగర వాసాలలో గాంధీ కార్యకలాపాలు మేధో శ్రమ– వివేచన, విలేఖనం, (న్యాయస్థానంలో తన కక్షిదారుల తరఫున) వాదనకే పరిమితమయ్యాయి. హెన్రీ పోలక్ అనే స్నేహితుడు తనకు కానుకగా ఇచ్చిన జాన్ రస్కిన్ పుస్తకం 'Unto This Last' పఠనం ఆయన జీవితాన్ని ఒక మేలు మలుపు తిప్పింది. రస్కిన్ భావాల స్ఫూర్తితో, దైనందిన జీవితంలో కనీసం కొంత సమయాన్ని తన చేతులతో పనిచేసే మట్టి మనిషిగా జీవించాలని గాంధీ నిర్ణయించుకున్నారు. 'ఇండియన్ ఒపీనియన్' అనే బహుభాషా వార్తా పత్రికను కూడా ఆయన ప్రారంభించారు. దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, భయాందోళనలను వ్యక్తం చేసేందుకు ఉద్దేశించిన పత్రిక అది.



గాంధీ తన మొదటి మూడున్నర దశాబ్దాల జీవితమంతా పూర్తిగా పట్టణ ప్రదేశాలలోనే నివసించారు. పట్టణ వాసంలో గాంధీ కార్యకలాపాలు మేధో శ్రమ– వివేచన, విలేఖనం, (న్యాయస్థానంలో తన కక్షిదారుల తరఫున) వాదనకే పరిమితమయ్యాయి. జాన్ రస్కిన్ పుస్తకం 'Unto This Last' స్ఫూర్తితో దైనందిన జీవితంలో కనీసం కొంత సమయాన్ని తన చేతులతో పనిచేసే మట్టి మనిషిగా జీవించాలని గాంధీ నిర్ణయించుకున్నారు.

గాంధీ తాను కొనుగోలు చేసిన స్థిరాస్తికి, చేరువలోనే ఉన్న రైల్వే స్టేషన్ పేరిట ఫీనిక్స్ ఫామ్ అని పేరు పెట్టారు. ఫీనిక్స్ ఫామ్ 120వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణాఫ్రికా విదుషీమణి ఉమా ధూపేలియా –మెస్త్రియె ఆ సెటిల్‌మెంట్ (కొత్తగా ఏర్పడిన గ్రామం) చరిత్ర (Gandhi's African Legacy: Phoenix Settlement 1904 to 2024)ను ప్రచురించారు. ఫీనిక్స్ ఫామ్ మొదటి పదేళ్ల (దక్షిణాఫ్రికాలో గాంధీ నివసించిన చివరి పది సంవత్సరాలు) చరిత్ర గురించి విపుల కథనంతో ఆ పుస్తకం ప్రారంభమవుతుంది. ఆ తరువాత తొమ్మిది అధ్యాయాలలో, గాంధీ శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత ఫీనిక్స్ చరిత్రను తెలియజేసే (ఎంపిక చేసిన) లేఖలను తన వివరణలు, వ్యాఖ్యలతో ఉమా ప్రతిభావంతంగా నివేదించారు. ప్రస్తుతం ఫీనిక్స్ స్థితిగతుల గురించిన భరత వాక్యంతో ఆ ఆసక్తికరమైన పుస్తకం సమాప్తమవుతుంది.

జోహన్నెస్‌బర్గ్‌లోని ఒక శాకాహార భోజనశాలలో గాంధీకి పరిచయమై, ఆ తరువాత ఆప్తమిత్రుడు అయిన ఆల్బెర్ట్ వెస్ట్ అనే ఒక ఇంగ్లీష్ జాతీయుడి గురించి ఉమ సముచిత ప్రాధాన్యంతో రాశారు. ఇండియన్ ఒపీనియన్ నిర్వహణలోను, ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌ను ఒక స్వతస్సిద్ధ, సమకాలీన సామాజిక సమూహంగా రూపొందించడంలో కీలక పాత్ర వహించారు. దైనందిన కార్యకలాపాలలో ఒకటిగా గాంధీ ప్రవేశపెట్టిన సర్వ మత ప్రార్థనల గురించి వెస్ట్ ఇలా వ్యాఖ్యానించారు: 'హిందువులు, ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు భక్తిగీతాలు ఆలపించి, తమ మత గ్రంథాలలోని ఉపదేశాలను వివిధ భాషలలో చదివేవారు. ఇది సార్వజనీన సామూహిక ఆరాధనకు అద్వితీయ ఉదాహరణ. ఈ ప్రార్థనా సమావేశంలో ఏ నిర్దిష్ట మతానికి ఇతర మతాల కంటే కించిత్ ఎక్కువ ప్రాధాన్యం లభించదు. సత్యం, ప్రేమను భగవంతుని సర్వవ్యాపక గుణ విశేషాలుగా అంగీకరించడమే ఆ ఉమ్మడి ప్రార్థనలు'.

1914లో గాంధీ భారత్‌కు తిరిగి వచ్చేసిన తరువాత ఫీనిక్స్ ఆశ్రమాన్ని కొనసాగించేందుకు వెస్ట్ చాలా పాటు పడ్డారు. ఫీనిక్స్ పునరుద్ధరణకై 1917లో గాంధీ తన రెండవ కుమారుడు మణిలాల్‌ను దక్షిణాఫ్రికాకు పంపించారు. ఉమా ధూపేలియా ఇలా రాశారు: 'జీవితంలో ఒక సమున్నత లక్ష్యాన్ని కనుగొనేందుకు, దాని పరిపూర్తికి అంకితమయ్యేందుకు ఫీనిక్స్ మణిలాల్‌కు ఒక అవకాశాన్ని కల్పించింది'. 1919 డిసెంబర్‌లో మణిలాల్ తన తండ్రికి రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొన్నారు: 'ఇప్పుడు భారత్‌కు రావడం ఒక సౌఖ్యదాయక విషయంగా నేను భావించడం లేదు. ఇక్కడే నేను మరింత మనశ్శాంతితో పనిచేసుకుంటూ జీవించదలుచుకున్నాను. కనుక ఇక్కడే ఉండిపోయి ఇండియన్ ఒపీనియన్‌ను నిర్వహిస్తూ అధ్యయన వ్యాపకాలలో మునిగిపోవాలని నిర్ణయించుకున్నాను. అయితే నేను భారత్‌కు రావాలని మీరు అభిలషిస్తే దాన్ని నెరవేర్చేందుకు సంసిద్ధంగా ఉన్నాను'.

ఫీనిక్స్ ఫామ్ బాధ్యతలు చేపట్టిన తరువాత దాని నిర్వహణ వ్యయాలకు తోడ్పడేందుకు గాను చెరకు, మొక్కజొన్న పంటల సాగును మణిలాల్ ప్రారంభించారు. మహారాష్ట్రలోని అకోలాకు చెందిన సుశీలా మష్రువాలాను 1927లో మణిలాల్ వివాహం చేసుకున్నారు. వారిది ఆదర్శ దాంపత్యం. ఇరువురూ ఉత్తమ జీవన సహచరులు. ఫీనిక్స్ ఫామ్ నిర్వహణలోను, ఇండియన్ ఒపీనియన్‌ను నడపడంలోను సుశీల కీలకపాత్ర వహించారు. 'సతీమణిగా, మాతృమూర్తిగా, పత్రిక ముద్రాపకురాలుగా ఆమె తన పాత్రలను ఎంతో నైపుణ్యంతో సమతుల్యపరిచారు' అని ఉమా వ్యాఖ్యానించారు. మణిలాల్–సుశీల మనవరాలే ఉమా ధూపేలియా. అయితే ఈ పుస్తకంలోను, వేరే రచనలలోను ఆమె వ్యాఖ్యలు, అభిప్రాయాలు కుటుంబ ప్రేమను కాకుండా వృత్తి నిబద్ధ చరిత్రకారుడి దృక్కోణాన్నే ప్రతిబింబిస్తాయి.

గాంధీ సంపాదకత్వంలో వలే, ఆయన కుమారుడి సారథ్యంలో కూడా ఇండియన్ ఒపీనియన్ దక్షిణాఫ్రికా భారతీయుల వ్యవహారాలు, భారత్‌లో ప్రధాన పరిణామాలకు సంబంధించిన వార్తలు, వ్యాఖ్యల కలగలుపుగా ఉండేది. అయితే ముద్రణా వ్యయాలు పెరిగిపోవడం, చందాదారులు తగ్గిపోవడంతో పత్రికను కొనసాగించడం తలకు మించిన భారమై పోయింది. 1938లో మణిలాల్ తన స్నేహితుడు బాబర్ చావ్దాకు ఇలా రాశారు: 'ఇండియన్ ఒపీనియన్'ను కొనసాగించేందుకుకై తలా 25 పౌండ్ల చొప్పున ఆర్థిక సహాయమందించాలని 200 మంది దక్షిణాఫ్రికా భారతీయులకు విజ్ఞప్తి చేశాను. ఈ సహాయమందకపోతే ఇండియన్ ఒపీనియన్ కొనసాగవలసిన అవసరం లేదని నేను భావించకతప్పదు. అదే జరిగితే పత్రికను మూసివేసి భారత్‌కు తిరిగి వెళ్లిపోతాను'. సెప్టెంబర్ 1942లో క్విట్ ఇండియా ఉద్యమం, బ్రిటిష్ పాలకులు దానిని అణచివేసిన తీరుతెన్నులపై ఒక ప్రత్యేక సంచికను ప్రచురించడానికి మణిలాల్ పూనుకున్నారు. పత్రిక కవర్‌పై సముచిత బొమ్మను సృజించగల చిత్రకారుడిని సూచించమని చావ్దాను ఆయన అడిగారు. బొమ్మ ఎలా ఉండాలో కూడా మణిలాల్ సూచించారు: చిత్ర నేపథ్యంలో భారతదేశ రేఖాపటం ఉండాలి. దానిలో భారతమాత శృంఖలాలలో ఉన్నట్టు చూపించాలి. కుడివైపు బ్రిటన్ రేఖాపటం ఉండాలి. దాని నుంచి ప్రజ్వరిల్లుతున్న మంటలు భారత్‌ను చుట్టుముట్టుతున్నట్టు చూపించాలి. ఆ మంటలపై సామ్రాజ్యవాదం అని రాసి ఉండాలి. ఆకాశం నుంచి ఐదుగురు కీర్తిశేషులు అయిన దేశభక్తులు బాల్‌గంగాధర్ తిలక్, దాదాభాయి నౌరోజీ, రవీంద్రనాథ్ టాగోర్, అబ్బాస్ త్యాబ్జీ, మహదేవ్ దేశాయిలు ప్రస్తుతం కారాగారంలో ఉన్న దేశభక్తులపై పువ్వులు జల్లుతుండడాన్ని దృశ్యమానం చేయాలి'.

1948లో దక్షిణాఫ్రికాలో నేషనల్ పార్టీ అధికారంలోకి వచ్చింది. జాతి వివక్ష విధానాన్ని మరింతగా ప్రోత్సహించింది, కఠినంగా అమలుపరిచింది. ఆగస్టు 1951లో మణిలాల్ జాతి వివక్షను తీవ్రంగా ఆక్షేపిస్తూ ప్రధానమంత్రి డి.ఎఫ్. మలాన్‌కు ఇలా రాశారు: 'మీ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి చర్యా యూరోపియనేతరులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. యూరోపియనేతరుల పట్ల మీ ప్రభుత్వ విద్వేషానికి చిహ్నాలుగా ఆ చర్యలు కనిపిస్తున్నాయి.. అపార్థీడ్ (జాతి వివక్ష) విధానం ఈ దేశ యూరోపియనేతర పౌరుల ఆర్థిక, రాజకీయ హక్కులను కాలరాచివేయడమే కాకుండా వారు భగవంతుడి సంతానంగా తమ వ్యక్తిత్వాన్ని, ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని పరిపూర్ణంగా వికసింప చేసుకునే అవకాశాలను నిరాకరిస్తుంది. రాజకీయాలలోకి రాక ముందు క్రైస్తవ మతాచార్యుడుగా ఉన్న మీరు భగవంతుని బోధనల నేపథ్యంలో మీ ప్రభుత్వ విధానాలను పునః పరిశీలించి సముచిత నిర్ణయం తీసుకోవాలి'. రెండు సంవత్సరాల అనంతరం జాతి వివక్షకు వ్యతిరేకంగా ఒక పౌర ప్రతిఘటన ఉద్యమంలో పాల్గొన్నందుకు అరెస్టయిన మణిలాల్ నెల రోజులకు పైగా కారాగారవాసం చేశారు.

మణిలాల్ 1956లో మరణించారు. సుశీల మరో ఐదు సంవత్సరాల పాటు ఇండియన్ ఒపీనియన్‌ను కొనసాగించి ఆగస్టు 1961లో ఆ పత్రిక ప్రచురణను శాశ్వతంగా నిలిపివేశారు. తదుపరి సంవత్సరాలలో ఆమె కుమార్తె ఎలా, అల్లుడు మేవా అత్తగారితో పాటు ఫీనిక్స్ ఫామ్‌లోనే ఉండేవారు. ఈ ఇరువురూ జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలంగా ఉండేవారు. నిత్యం పోలీసు వేధింపులకు గురవుతుండేవారు. మణిలాల్, సుశీల రాసిన లేఖలలో ఆనాడు దక్షిణాఫ్రికాలోని భారతీయుల వ్యవహారాలలో ప్రధానపాత్ర వహించిన ఉదారవాద రాజనీతిజ్ఞుడు విఎస్ శ్రీనివాసశాస్త్రి, ప్రభవిస్తున్న యువ కమ్యూనిస్టు డాక్టర్ యూసుఫ్ దాదా గురించి ఆసక్తికరమైన ప్రస్తావనలు ఉన్నాయి. భార్యాభర్తలిరువురు ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించిన ఒక ప్రముఖుడు నవలా రచయిత అలన్ పేటన్. తన స్నేహితుడు మణిలాల్ మరణానంతరం ఫీనిక్స్ ఫామ్ నిర్వహణలో సుశీలకు కీలక సహాయసహకారాలను ఆయన సమకూర్చారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గాంధీ నెలకొల్పిన ఐదు ఆశ్రమాలలో ఫీనిక్స్ ఫామ్ మొదటిది. ఆ తరువాత దక్షిణాఫ్రికాలోనే టాల్‌స్టాయ్ ఫామ్; భారత్‌కు తిరిగివచ్చిన తరువాత అహ్మదాబాద్‌లో కొచ్రాబ్, సబర్మతి; మహారాష్ట్రలోని వార్ధా సమీపంలో సేవాగ్రామ్ ఆశ్రమాన్ని ఆయన వ్యవస్థాపించారు. ఫీనిక్స్ ఫామ్ మిగతా అన్ని ఆశ్రమాలకు ఒరవడి అయింది.

1985లో ఫీనిక్స్ ఫామ్ పరిసరాలలో తీవ్ర హింసాకాండ చోటుచేసుకున్నది. పోలీసుల చేతుల్లో ఒక నల్లజాతి ఉద్యమకారుడు మరణించడమే ఆ హింసాకాండకు దారి తీసింది. దీంతో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ వాసులు అక్కడి నుంచి వెళ్లిపోవడం ప్రారంభమయింది. ఫీనిక్స్‌లోని గాంధీ గృహం కిటికీలను ధ్వంసం చేశారని, ఆయన జీవితానికి సంబంధించిన ఫోటోలు అన్నిటినీ బయటకు విసిరివేసి వాటిని తొక్కివేసి పూర్తిగా రూపుమాపారని ఒక పత్రికా వార్త వెల్లడించింది. ఒకప్పుడు పాడిపంటలతో, నాగరిక విలువలను ఔదలదాల్చిన సంస్కారవంతులతో వర్ధిల్లిన ఫీనిక్స్ ఫామ్ కబ్జాదారుల పాలయింది. ఫీనిక్స్ విధ్వంసం సుశీలను సహజంగానే అమితంగా కృంగదీసింది. 1988లో ఆమె మరణించారు. ఇరవై సంవత్సరాల అనంతరం ఆమె కుమార్తె ఎలా (దక్షిణాఫ్రికా బహుళ జాతుల తొలి పార్లమెంటు సభ్యురాలు) నన్ను తన కారులో ఫీనిక్స్ ఫామ్‌కు తీసుకువెళ్లారు. గాంధీ వ్యవస్థాపించిన వంద ఎకరాలకు పైగా ఫీనిక్స్ ఫామ్ నేను సందర్శించిన నాటికి కేవలం మూడు ఎకరాల స్థిరాస్తిగా మిగిలిపోయి ఉన్నది. దక్షిణాఫ్రికాలో గాంధీ జీవితానికి సంబంధించిన ఫోటోలు, ఇతర వివరాలతో అక్కడ ఒక మ్యూజియం ఉన్నది. ఒకప్పటి వైభవాన్ని కోల్పోయినప్పటికీ ఆ మ్యూజియం ఇప్పటికీ సందర్శకులకు స్ఫూర్తిదాయకంగానే ఉన్నది.

గాంధీ నెలకొల్పిన ఐదు ఆశ్రమాలలో ఫీనిక్స్ ఫామ్ మొదటిది. ఆ తరువాత దక్షిణాఫ్రికాలోనే టాల్‌స్టాయ్ ఫామ్; భారత్‌కు తిరిగివచ్చిన తరువాత అహ్మదాబాద్‌లో కొచ్రాబ్, సబర్మతి; మహారాష్ట్రలోని వార్ధా సమీపంలో సేవాగ్రామ్ ఆశ్రమాన్ని ఆయన వ్యవస్థాపించారు. ఫీనిక్స్ ఫామ్ మిగతా అన్ని ఆశ్రమాలకు ఒరవడి అయింది. సర్వ మతాల, సకల జాతుల, సమస్త కులాల ప్రజల పరస్పర సహజీవనానికి ఆ ఆశ్రమాలు అన్నీ ఆలవాలంగా ఉండేవి. గాంధీ ఆశ్రమాలలో, మేధోశ్రమకు సమున్నత విలువ ఇచ్చినట్టుగానే భౌతిక శ్రమకూ ప్రాముఖ్యత ఉండేది. ఫీనిక్స్ ఆశ్రమంలోనే గాంధీ తన తొలి వార్తాపత్రిక ఇండియన్ ఒపీనియన్‌ను ముద్రించేవారు. గాంధీ ఆశ్రమాలకు ఫీనిక్స్ ఎలా ఒరవడి అయిందో భారత్‌లో ఆయన సమస్త పాత్రికేయ వ్యాసంగాలకు ఇండియన్ ఒపీనియన్ అలా ఒక మార్గదర్శిగా ఉండేది. ఫీనిక్స్ ఆశ్రమం లేనిపక్షంలో మనకు మహాత్ముడు ఉండేవారే కాదు. ఉమా ధూపేలియా తన పుస్తకంలో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ సమున్నత చరిత్రకు మళ్లీ ఒక స్ఫూర్తిదాయక సజీవత్వం కల్పించారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ప్రభుత్వాలు మారినా అదే పోలీసు క్రౌర్యం!

గత ప్రభుత్వ పాలకుల హయాంలో పోలీసు శాఖ ప్రజాకంటకంగా మారిపోయింది. అందుకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పోలీసు శాఖను స్వయంగా తన ఆధీనంలో ఉంచుకున్నారని ప్రజలు భావించారు. కాని క్షేత్రస్థాయిలో ఈ పది నెలల కాలంలో పోలీసుల పనితీరు వీసమెత్తు మారలేదు. ఎవరు మారినా, ఏది మారినా పోలీసు వ్యవస్థ మాత్రం మారదని ఈ పది నెలల కాలంలో క్షేత్రస్థాయిలో వరుసగా జరుగుతున్న ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

ఈ ఏడాది అక్టోబర్ 13న నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో ముగ్గురు యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి శిరోముండనం చేయించి పంపారు. చట్టాలను బేఖాతరు చేసి, సంపన్నులను సంతుష్టపరచేందుకు అమాయకులను అవమానపరచిన లింగాల పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్‌కు అందుకు దండన ఏమిటో తెలుసా– కేవలం అక్కడి నుంచి హెడ్ క్వార్టర్‌కు అనుసంధానించడం! ఆయన చేసిన అనాగరిక శిరోముండన నేరానికి ఈ బదిలీ చర్య సరిపోతుందా!

అక్టోబరు 13న లింగాలకు చెందిన వినీత్ (20), అఖిల్ (18), నిఖిల్ (18) బైక్‌పై పెట్రోలు బంకుకు వెళ్ళి రూ.20 పెట్రోల్ పోయాలని బంక్ ఆపరేటర్‌ను కోరారు. ఆపరేటర్ హేళన చేస్తూ పెట్రోలు పోయనన్నాడు. ఆ తర్వాత వచ్చిన బైక్‌లో పెట్రోలు పోశాడు. ఈ నిర్లక్ష్య ధోరణి ఘర్షణకు దారితీసింది. పెట్రోల్ బంక్ ఆపరేటర్ యువకులను బూతులు తిట్టాడు. యువకులు ఆపరేటర్‌పై చేయి చేసుకున్నారు. రంగప్రవేశం చేసిన పోలీసులు యువకులను వారి ఇళ్ళ నుంచి అక్టోబర్ 13న పట్టుకుపోయారు. నిందితులకు 41ఎ ప్రకారం నోటీసులు ఇచ్చి పిలవాలనే జ్ఞానం పోలీసులకు ఉన్నా ఇలా ఎందుకు వ్యవహరించారు? ఎందుకంటే నిందితులు సామాజికంగా కింది కులాలకు చెందినవారు కాబట్టి, ఆ పెట్రోలు బంకు సంపన్న వర్గాలకు చెందినది కాబట్టి. 'నా పెట్రోలు బంకు ఉద్యోగిపైన కింద కులాలకు చెందిన యువకులు చేయి చేసుకునే ధైర్యం చేస్తారా' అని దీన్ని పరువుకు సంబంధించిన విషయంగా భావించిన యజమాని పోలీసులను ఉసిగొల్పాడు. అఖిల్ కుటుంబం షెడ్యూల్డు తెగల ఎరుకల జాతికి చెందినది. నిఖిల్, వినీత్ కుటుంబాలు కొన్నేళ్ళ క్రితం ఇక్కడికి వలస వచ్చి ఎరుకల కులంతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకొని షెడ్యూల్డు తెగలుగా మారిపోయారు. కింది కులాలంటే పోలీసులకు లెక్కలేనితనం ఎక్కువ.

యువకులు ముగ్గురిని మూడు రోజులు స్టేషన్‌లో నిర్బంధించారు. కేవలం రాత్రిపూట మాత్రమే ఇంటికి పంపించేవారు. ఈ మూడు రోజుల నిర్బంధం వారిని మరింత అవమానానికి గురి చేసింది. అయినా సరే ముగ్గురూ వెళ్ళి పెట్రోల్ బంకు ఉద్యోగికి క్షమాపణలు చెప్పుకున్నారు. దీంతోనైనా పోలీసులు తగ్గలేదు. మూడు రోజులు నిర్బంధించి వారిచేత స్టేషన్‌లో వారు ఎన్నడూ చేయని వివిధ రకాల పనులు చేయించారు. ప్రత్యేకంగా తెప్పించిన రబ్బరు బెల్టుతో విపరీతంగా చితకబాదారు. అన్నం పెట్టక అర్ధాకలితో అలమటింపజేశారు. చివరికి మూడవ రోజు స్టేషన్‌కు మంగలిని పిలిపించి ముగ్గురికీ గుండు గీయించారు. అప్పుడు గాని పోలీసుల ఆకలి చల్లారలేదు.

నిందితులను 24 గంటలకు మించి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించరాదని, దెబ్బలు కొట్టరాదని, చిత్రహింసలకు గురిచేయరాదని, థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని పౌర హక్కుల సంఘం ప్రశ్నించినప్పుడల్లా పోలీసులు చెబుతున్న సమాధానం "రెండు అంటిస్తే తప్ప నేరం ఒప్పుకోరని!" ఇది ఏ కాలం నాటి న్యాయం!

లింగాల సమాజానికి ముఖం చూపలేక, అవమానం భరించలేక అఖిల్, నిఖిల్ హైదరాబాద్‌కు పారిపోయారు. వినీత్ అవమానం తట్టుకోలేక ఈ ప్రపంచం నుంచే నిష్క్రమించాలనుకున్నాడు. ఈ నిర్ణయం తీసుకోవడానికి మూడు రోజులు మానసిక క్షోభను అనుభవించాడు. చివరికి అక్టోబర్ 18న గదిలోనే ఉరి వేసుకున్నాడు. శబ్దం విన్న తల్లిదండ్రులు తలుపులు బద్దలు కొట్టి ఉరితాడుకు వేళాడుతున్న వినీత్‌ను కిందికి దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ముక్కులోంచి రక్తం వచ్చింది. మెడ వెనక ఎముక విరిగింది. వినీత్ తల్లి 'నా కొడుకు చనిపోతే లింగాల సబ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యత వహించాలి' అని మీడియాతో మాట్లాడింది. మొత్తానికి నాగర్‌కర్నూలు డాక్టర్లు వినీత్‌ను బ్రతికించగలిగారు. ఈలోగా సదరు సబ్ ఇన్స్‌పెక్టర్‌ను వనపర్తి హెడ్‌క్వార్టర్‌కు బదలాయించారు. అయినా గానీ వినీత్ తల్లిదండ్రులను కలిసి నయానా భయానా దారిలోకి తెచ్చుకుని, 'నా కొడుకు ఎస్ఐ వేధింపులతో ఆత్మహత్య ప్రయత్నం చేసుకోలేదు. ఆత్మహత్య ప్రయత్నానికి తామే కారణం' అని మీడియాకు చెప్పించాడు. అదే విషయం పౌరహక్కుల సంఘానికి కూడా చెప్పారు. అయితే వినీత్ మాత్రం పోలీసులు చేసిన అవమానం వల్లనే ఆత్మహత్యా ప్రయత్నం చేశానని నిర్భయంగా వెల్లడించాడు. నేను ఈ ఊరిలో ఉండలేను, హైదరాబాద్ వెళ్ళిపోయి డిగ్రీ పూర్తి చేస్తానని ఆ మార్గం చూపించడని పౌరహక్కుల సంఘాన్ని ప్రాధేయపడ్డాడు. వినీత్‌ను బతికించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది. పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్ఐని కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైన ఉంది. సామాజికంగా, ఆర్థికంగా, బలహీనులైనవారిని కాటేయడానికి కాచుకుని కూర్చున్న సర్పాల్లా ప్రవర్తిస్తున్నారు పోలీసులు. వీరి కోరలు పీకాల్సింది అయితే ప్రభుత్వాలు, కాకపోతే ప్రజలే. గుండు కొట్టించే, మూత్రాలు తాగించే సంస్కృతి నుంచి పోలీసులు బయటపడాలి.



సామాజికంగా, ఆర్థికంగా, బలహీనులైనవారిని కాటేయడానికి కాచుకుని కూర్చున్న సర్పాల్లా ప్రవర్తిస్తున్నారు పోలీసులు. వీరి కోరలు పీకాల్సింది అయితే ప్రభుత్వాలు, కాకపోతే ప్రజలే. గుండు కొట్టించే, మూత్రాలు తాగించే సంస్కృతిని పోలీసులు విడనాడాలి.

తెలంగాణలో పోలీసు శాఖ ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నప్పటికిని సవాళ్ళు ఎదురౌతూనే వున్నాయి. తెలంగాణలో కాంగ్రెసు ప్రభుత్వం కొలువైన మూడు రోజులకే నల్గొండ జిల్లా పాలెం తాండ గిరిజన తెగకు చెందిన నేనావత్ సూర్యనాయక్‌ను భూవివాదం కేసులో చింతపల్లి పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి కొట్టి చంపారు. పౌరహక్కుల సంఘం సీసీ టీవీ ఫుటేజ్ చూపించమని నిలదీస్తే అవి పనిచేయక చాలా కాలం అయిందన్నారు.

2024 ఆగస్టు 30న రాత్రి 8:30 గంటలకు షాద్‌నగర్ పోలీసులు ఇండ్లల్లో పని చేసుకొని బ్రతికే దళిత కులానికి చెందిన సునీతను పట్టుకుపోయి రాత్రి 2 గంటల వరకు చిత్రహింసలకు గురి చేశారు. బంగారం దొంగతనం కేసు ఒప్పుకొమ్మని చితకబాదారు. రక్తస్రావం జరిగి సునీత విలవిలా కొట్టుకుంది. ఒక దళిత మహిళను ఇలా మగ పోలీసులు రాత్రిపూట హింసించి పైశాచిక ఆనందం పొందారు. 2024 అక్టోబరు 11న గద్వాల జిల్లా బిజ్వారం గ్రామానికి చెందిన పని పిల్ల రాజేశ్వరి (16)ని మల్దకల్ పోలీసులు అరెస్టు చేసి పట్టుకపోతే అవమానాన్ని భరించలేక మరుసటి రోజు పురుగుల మందు తాగి చనిపోయింది.

పోలీసులు మైనర్ బాలబాలికల పట్ల ఎంత సున్నితంగా వ్యవహరించాలో తెలుసుకోలేకపోతున్నారు. అందరి పట్ల ఒకే దండన నీతిని అనుసరిస్తున్నారు. ఇలాంటి ఘటనలను నిలువరించాలంటే ప్రజలు చైతన్యం పెంచుకొని హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేయాలి. రాజ్యాంగం 21వ అధికరణ ద్వారా సంక్రమించిన గౌరవప్రదంగా జీవించే హక్కు కోసం ఉద్యమించాలి.

■ లక్ష్మణ్ గడ్డం
అధ్యక్షులు, పౌర హక్కుల సంఘం

ఫీజుల వసూలు నిలిపివేత

- 'ఉచిత శిక్షణకు ఫీజు వసూలు' కథనానికి స్పందన
- ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్ల విద్యార్థులకు ఫీజు వాపస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

6



సదాస్మరామి



సిక్కుల మతగురువు గురునానక్ జయంతి ఘనంగా జరిగింది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన ఉత్సవాలకు సిక్కులు భారీగా హాజరయ్యారు. గురునానక్ బోధనలను స్మరించుకున్నారు.

ఆమ్దానీపై ఆలోచనేది?



అప్పులున్నా ఆదాయం పెంచుకోలేని బల్దియా

- బాకీ రూ.6 వేల కోట్లు.. కిస్తీలకే నెలకు రూ.100 కోట్లు
- వనరులున్నా ఉపయోగించుకోలేని దైన్యం
- ఎస్టేట్ విభాగం నుంచి నామమాత్రపు రెవెన్యూ
- ఖాళీగా వాణిజ్య భవనాలు.. లీజు ముగిసిన భూములు
- ట్రేడ్ లైసెన్స్, ప్రకటనల విభాగాలదీ అదే దుస్థితి
- బల్దియాకు భారంగా మారుతున్న ఆర్థిక నిర్వహణ

మనకో భవనం ఉంటే ఖాళీగా ఉంచకుండా కిరాయికిస్తాం. వచ్చే ఆదాయంతో అప్పులు తీరుస్తాం లేదా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తాం.

బల్దియా అలా కాదు. సొంత భవనాలు ఖాళీగా ఉన్నా, మార్కెట్ సముదాయాల్లో దుకాణాలు పడావు పడినా పట్టించుకోవడం లేదు. నెత్తిన అప్పుల కుప్ప ఉన్నా సొంత వనరులను ఉపయోగించుకోలేని దైన్యస్థితిలో ఉంది. మరోవైపు అప్పుల భారం పెరగడంతోపాటు కిస్తీలు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దుర్భర పరిస్థితి. చివరకు రహదారులు, పారిశుధ్య నిర్వహణకూ చేతిలో చిల్లిగవ్వ లేదు. అయినా ఆదాయం పెంచుకునే ఆలోచనలు చేయడం లేదు.

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సొంతంగా భవనాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆదాయం పెంచుకునేందుకు దృష్టి సారించడం లేదు. ట్రేడ్‌లైసెన్స్‌ల జారీ, రెన్యూవల్స్‌ను పట్టించుకోవడం లేదు. ఆస్తి పన్ను పెంచకుండా సంస్థ ఆదాయం పెంచే అవకాశాన్ని విస్మరించి.. నిధుల కోసం ప్రభుత్వం వైపు చూస్తోంది. అప్పులు ఇస్తారేమోనని బ్యాంకుల దిక్కు చూస్తోంది. భవన నిర్మాణ అనుమతుల రుసుము గతంతో పోలిస్తే తగ్గగా.. ఆస్తిపన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఇప్పటివరకు రూ.1000 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయినా సంస్థ ఆర్థిక వనరులను వినియోగించుకోవడంపై అధికారులు ఎక్కడా లేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బల్దియాకు ఇప్పటికే రూ.6 వేల కోట్లకుపైగా అప్పులు ఉండగా, వాయిదాల రూపంలో నెలకు రూ.100 కోట్లు చెల్లిస్తోంది. సరిపడా ఆదాయం రాకపోవడంతో రోజువారి ఖర్చులు, ఉద్యోగుల వేతనాలు, రుణ వాయిదాలు చెల్లించేందుకు కటకటలాడుతోంది.

ఆదాయం వచ్చే అవకాశమున్నా..

గ్రేటర్‌లోని 19 ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీకి చెందిన వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటిలో 761 దుకాణాలు ఉండగా, ఆన్‌లైన్ వేలం ద్వారా కేటాయిస్తున్నారు. ఏడాది సమయానికి ఒప్పందం కుదుర్చుకుంటూ యేటా నిర్ణీత మొత్తం రుసుము పెంచుతూ లీజు గడువును పొడిగిస్తున్నారు. 761 దుకాణాల్లో ప్రస్తుతం 525 కేటాయించగా 119 ఖాళీగా ఉన్నాయి. బుద్ధభవన్, ఇతర ప్రాంతాల్లోని 95 దుకాణాల స్థలాన్ని ఈవీడీఎం, లేక్స్ విభాగం కోసం జీహెచ్‌ఎంసీ వినియోగించుకుంటోంది. బేగంబజార్‌లోని

మిగతా 6వ పేజీలో..

స్థలాల లీజు విషయంలోనూ..

వివిధ అవసరాల నిమిత్తం గతంలో పలు సంస్థలకు బల్దియాకు చెందిన భూములను లీజుకిచ్చారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ), దోమలగూడలోని ఓ స్టడీ సర్కిల్ భవనాలు జీహెచ్‌ఎంసీ స్థలాల్లోనే ఉన్నాయి. ఎఫ్‌ఎన్‌సీసీ లీజు గడువు ముగియగా.. కొన్నాళ్ల క్రితం పొడిగించారు. మూడు దశాబ్దాల క్రితం నామమాత్రపు అద్దెతో స్థలం లీజుకివ్వగా.. పొడిగింపు సమయంలోనూ అంతగా రుసుము పెంచలేదని సమాచారం. ఉన్నతస్థాయి ఒత్తిళ్లతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దోమలగూడలోని స్టడీ సర్కిల్ భూమి విషయంలోనూ అదే జరిగింది. 72 ప్రాంతాల్లో స్థలాలు లీజుకివ్వగా, సగానికిపైగా గడువు ముగిసినవి ఉన్నప్పటికీ.. స్థలాలను స్వాధీనం చేసుకొని కొత్తగా వేలం నిర్వహించడం ద్వారా ఆదాయం పెరిగే అవకాశమున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రూ.కోట్లు వచ్చే వీలున్నా..

నగరంలో లక్షల సంఖ్యలో వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. కర్రీ పాయింట్ల నుంచి స్టార్ ఆస్పత్రుల వరకు, కిరాణ దుకాణం నుంచి మాల్ వరకు ఏ వ్యాపారం చేసినా ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరి. కానీ జీహెచ్‌ఎంసీ జారీచేసిన ట్రేడ్ లైసెన్స్‌లు 1.30 లక్షలలోపు మాత్రమే. వీటి ద్వారా ఏటా వస్తున్న ఆదాయం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు. కోటికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్‌లో అన్ని కేటగిరీలు కలిపి 5 లక్షలకుపైగా దుకాణాలున్నట్లు అంచనా. వాటిలో ట్రేడ్‌లైసెన్స్ ఉన్నవి మాత్రం 25 శాతం మాత్రమే. అన్ని దుకాణాలకు ట్రేడ్‌లైసెన్స్ జారీ చేస్తే ఆదాయం రూ.150 నుంచి 200 కోట్లకు పెరిగే అవకాశం ఉన్నా బల్దియా అధికారులు ఎందుకో పట్టించుకోవడం లేదు. ప్రకటనల విభాగం ద్వారా ప్రస్తుతం రూ.50 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. గతంలో ప్రకటనల విభాగం బాధ్యతలు నిర్వర్తించిన ఓ అధికారి సంస్కరణల పేరిట సంస్థ ఆదాయానికి గండికొట్టారు. ఏజెన్సీలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్న ఆయన రూ.కోట్లు జేబులో వేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. రూ.150 కోట్ల ఆదాయం వచ్చే అవకాశమున్నా, అవకతవకలు, అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యంతో ఆఖరికి రూ.50 కోట్లు మాత్రమే వస్తున్నాయని కౌన్సిల్ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. ప్రకటనల బోర్డులను తమకు అప్పగిస్తే సంస్థకు రూ.150 కోట్లు ఇస్తామని సవాల్ విసిరారు. దీంతో కొత్త ప్రకటనల పాలసీ తీసుకొస్తామని ఎప్పుడో ప్రకటించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఓ సంస్థ దశాబ్దానికిపైగా నిర్ణీత మొత్తం చెల్లించకుండానే ప్రకటనల బోర్డులను వినియోగించుకుంటోంది. సంస్థకు రూ.కోట్ల నష్టం జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ స్పందించకపోవడం గమనార్హం.

సర్వేను అడ్డుకుంటే ఖబడ్దార్

- కఠిన చర్యలు తీసుకుంటాం : మంత్రి పొన్నం హెచ్చరిక
- 30 శాతం సర్వే పూర్తయిందని వెల్లడి



కంటోన్మెంట్ సిక్‌విలేజీలో హాకీగ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, అధికారులు

సికింద్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలను తొలగించడానికి, రుగ్మతలను రూపుమాపడానికి ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను అడ్డుకునేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ సిక్‌విలేజీలోని హాకీ గ్రౌండ్‌ను మినీ స్టేడియంగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి శుక్రవారం మంత్రి పొన్నం గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వేలో బ్యాంకు ఖాతా నంబర్ అడగడం లేదని, ఎవరైనా అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కులం పేరు చెప్పడం ఇష్టం లేకపోతే 999 ఆప్షన్ ఉన్నదని, సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ఇప్పటివరకు 30 శాతం సర్వే పూర్తయ్యిందని, సమగ్ర సర్వే విజయవంతానికి

మిగతా 6వ పేజీలో..

బడికి సొంత గూడేది ?

- ఇప్పటికీ కమ్యూనిటీహాళ్లలోనే సర్కారు స్కూళ్లు
- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు కరువు
- అరకొర గదుల్లో టీచర్లు, విద్యార్థుల అవస్థలు
- మరోవైపు ప్రతినెలా ప్రభుత్వంపై కిరాయి భారం

8



సర్వేపై 'పౌర్ణమి' ఎఫెక్ట్

- 30 శాతానికిపైగా ఎన్యూమరేటర్ల గైర్హాజరు

6

కాంతులు శోభిల్లి.. భక్తులు ప్రణమిల్లి



కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంలో..

జూబ్లీహిల్స్‌లో..

కూకట్‌పల్లి శివాలయంలో అభిషేకం చేస్తున్న మహిళ

పరమశివుడికి ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నగర వ్యాప్తంగా ఆలయాలు భక్తజనసంద్రమయ్యాయి. కార్తీక దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. భక్తులు దీపాలు వెలిగించి శివకేశవులకు మొక్కులు చెల్లించుకున్నారు.

బర్త్‌డే పార్టీలో యువకుడి హత్య?

8

ప్రాణం తీసిన వేగం

- డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకుల దుర్మరణం

ఎక్కడుందో పట్టేయొచ్చు..

- వాటర్‌బోర్డులో వాహనాల ట్రాకింగ్
- ట్యాంకర్లు, ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు, సిల్ట్ కార్టింగ్ వాహనాలకు ఏవీటీఎస్

8

హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్ల సేవలు

- త్వరలో ట్రాఫిక్ నియంత్రణ విధుల్లోకి.. ● ప్రయోగాత్మక అమలుకు కసరత్తు



హైదరాబాద్ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో వాహనాల నియంత్రణ విధులు నిర్వహించేందుకు ట్రాన్స్‌జెండర్లను నియమించడంపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గతంలో నిర్ణయించిన విధంగా తొలిదశలో రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వీరిని నియమించాలని సూచించారు. సిగ్నల్ జంపింగ్, ఓవర్‌స్పీడ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వెళ్లే వారిని నిరోధించేందుకు హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో నిర్వహించే ట్రాఫిక్ ఉల్లంఘనల స్పెషల్‌డ్రైవ్, డ్రంకెన్ డ్రైవ్‌లోనూ వారి సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వారికి హోంగార్డుల తరహాలో జీతభత్యాలను సమకూర్చేలా విధివిధానాలు రూపొందించాలని, ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను రూపొందించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ప్రయోగాత్మకంగా నిర్ణయాన్ని అమలు చేసేందుకు

మిగతా 6వ పేజీలో..

ఫీజుల వసూలు నిలిపివేత

- ‘ఉచిత శిక్షణకు ఫీజు వసూలు’ కథనానికి స్పందన
- ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్ల విద్యార్థులకు ఫీజు వాపస్

మంగళ్‌హాట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్ల విద్యార్థుల నుంచి ఫీజుల వసూలు నిలిచిపోయింది. అలాగే, ఇప్పటివరకు వసూలు చేసిన ఫీజులను తిరిగి విద్యార్థులకు ఇచ్చేయాలని ప్రభుత్వం ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను ఆదేశించింది. ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లలో విద్యార్థులకు పుస్తకాలు, గౌనులు, ఇంగ్లిష్, కంప్యూటర్ ఫీజుల పేరుతో అడ్మిషన్ సమయంలోనే డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఈనెల 12న ‘ఆంధ్రజ్యోతి’లో‘ఉచిత శిక్షణకు ఫీజు వసూలు’ అన్న శీర్షికన వచ్చిన కథనానికి ప్రభుత్వం స్పందించి విచారణ చేపట్టింది. ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం, బోధన్ ఏరియా ఆస్పత్రి, కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి పరిధిలోని నర్సింగ్ స్కూళ్లలో విచారణ చేపట్టగా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. దీంతో వెంటనే డబ్బులు వసూలు నిలిపేయాలని, ఇప్పటివరకు వసూలు చేసిన ఫీజులను తిరిగి విద్యార్థులకు ఇచ్చేయాలని ఆదేశిస్తూ ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, నర్సింగ్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు అందాయి. తమపక్షాన నిలిచిన ‘ఆంధ్రజ్యోతి’కి నర్సింగ్ విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేపై ‘పౌర్ణమి’ ఎఫెక్ట్

- 30 శాతానికిపైగా ఎన్యూమరేటర్ల గైర్హాజరు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కార్తీక పౌర్ణమి ప్రభావం పడింది. పండుగ నేపథ్యంలో దాదాపు 30 శాతం మంది ఎన్యూమరేటర్లు శుక్రవారం విధులకు రాలేదని జీహెచ్ఎంసీ వర్గాలు పేర్కొన్నాయి. మహా నగరంలో సర్వే ప్రారంభించిన ప్పటి నుంచి ప్రతిరోజు 1.30 లక్షల నుంచి 1.45 లక్షల కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు. అయితే పౌర్ణమి ప్రత్యేక పూజల కారణంగా శుక్రవారం లక్షకు పైగా ఇళ్ల నుంచి సమాచారం తీసుకున్నారు. వాస్తవంగా గురునానక్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవుదినం. అయితే ఎన్యూమరేటర్లలో మెజార్టీశాతం మహిళలు ఉన్నారు. అలాగే ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివరాలు సేకరిస్తున్నారు. కాగా, కార్తీకమాసంలో పౌర్ణమి రోజున చాలామంది ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించినప్పటికీ.. విధులకు హాజరుకాని పరిస్థితి నెలకొంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సర్వేకు విరామం ప్రకటించాలని ఉద్యోగ సంఘాలు కోరినా ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేకపోవడంతో విధులకు వచ్చిన ఎన్యూమరేటర్లతో సర్వే నిర్వహించారు. ఆదివారం కూడా సర్వే కొనసాగుతుందని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు.



సర్కిల్ కార్యాలయంలో భద్రపరిచిన సర్వే పత్రాల బాక్సులు

సర్వే పత్రాలు భద్రంగా..

ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వే పత్రాలను ఏ రోజుకారోజు సర్కిల్ కార్యాలయంలో అందజేసిన తర్వాత ట్రంక్ బాక్సుల్లో భద్రపరుస్తున్నారు. సర్వే చేసిన ఫారాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులు ఆదేశిస్తున్నారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఇప్పటివరకు 27.74 శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు.

ఆమ్దానీపై ఆలోచనేది ?

(5వ పేజీ తరువాయి)

చేపల మార్కెట్ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ దుకాణాలు కేటాయించలేదు. కోఠి వాణిజ్య సముదాయంలోని దుకాణాల కేటాయింపుపై ప్రజావాణిలో తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే నాలుగో వంతు అద్దె రాకున్నా జీహెచ్ఎంసీ అధికారులు దుకాణాలు కేటాయిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లోని మునిసిపల్ మార్కెట్లలో 1800లకుపైగా దుకాణాలుండగా, వీటి కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులున్నాయి. సర్కిల్ స్థాయిలో కేటాయింపు జరుగుతుండడం.. కేంద్ర కార్యాలయంలోని ఎస్టేట్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది.

సర్వే వివరాలిచ్చిన హెచ్ఎండీఏ కమిషనర్

ఖైరతాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలో భాగంగా శుక్రవారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్వే ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ కుటుంబ వివరాలను సిబ్బంది సేకరించారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సర్కిల్ 18 ఉపకమిషనర్ ప్రశాంతి, ఎన్యూమరేటర్ వివరాలు సేకరించి ఆయనతో సంతకం చేయించారు. అందరూ సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు.



సర్వే వివరాల ఫారం అందజేస్తున్న హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్లు

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని సీఎం పోలీసు అధికారులను ఆదేశించారు.

అధికారుల కసరత్తు

ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ విధుల్లోకి తీసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. వారు ఎలాంటి విధులు నిర్వహించాలి? నియమ నిబంధనలు ఏమిటి ? జీతభత్యాలు, ట్రాఫిక్ విధుల్లో వారి ప్రమేయం ఎంత మేరకు ఉండాలి? విద్యార్హతలు, శిక్షణ, ఇతర అంశాలపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. నగరంలో మొత్తం ఎంతమంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు ? వారిని ఎంపిక చేయడానికి ఎలాంటి అర్హతలను పరిగణనలోకి తీసుకోవాలి? ముందుగా పైలట్ ప్రాజెక్టుగా ఎంతమందిని తీసుకొని ట్రాఫిక్‌లో శిక్షణ ఇవ్వాలి? ఇలా అనేక అంశాలపై పోలీసులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అన్ని కోణాల్లో సమాలోచనలు చేసి, నియమనిబంధనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 3 వేల మంది వరకు ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. మార్గదర్శకాలు రూపొందించిన తర్వాత ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

సర్వేను అడ్డుకుంటే ఖబడ్దార్

(5వ పేజీ తరువాయి)

కులసంఘాలు సహకరించాలని కోరారు.

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో మార్పులు ఉండవు : కంటోన్మెంట్ మీదుగా చేపడుతున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో ఎలాంటి మార్పులు ఉండవని, ప్రతిపాదించిన మేరకు రోడ్ల విస్తరణ జరుగుతుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు ఒకలా, మల్కాజిగిరి ఎంపీగా మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రోడ్ల విస్తరణను కుదించాలని, నష్టపరిహారం విషయంలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం తగదని హితవుపలికారు. సిక్‌విలేజీ హాకీ గ్రౌండ్‌ను మినీస్టేడియంగా అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ సిక్‌విలేజీ హాకీగ్రౌండ్‌ను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించడంపై సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్ సీఈవో మధుకర్‌నాయక్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నాయకులు ముప్పిడి మధుకర్, శ్యామ్ సన్‌రాజు, అల్లాడి గౌరీశంకర్, బల్వంత్‌రెడ్డి, సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధిదీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లోని చాలా బస్తీల్లో వీధిదీపాలు వెలగడం లేదు. ప్రధాన రహదారుల్లో కూడా అంధకారం నెలకొంది.

జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తా

వీధిదీపాలు మార్చాలని సూచిస్తే కొత్త లైట్లు లేవని సమాధానం వస్తుంది. అధికారులు జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఉండడం వల్ల మా మాట వినడం లేదు. సమస్యను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేటట్లు చూస్తాను.

● కె.రవికుమార్, డిప్యూటీ కమిషనర్

నెలల తరబడి వీధిదీపాలు వెలగడం లేదని ఆయా కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డును కలిపే రేడియల్ రోడ్డు-2, కాటేదాన్ నుంచి గగన్‌పహడ్ వెళ్లే మార్గంలోని పాత కర్నూల్ రోడ్డులో చాలా వరకు వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బుద్వేల్ శ్రీ శివసాయికాలనీ, రాజేంద్రనగర్‌బస్తీ, నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో కూడ వీధిదీపాలు వెలగక అంధకారం నెలకొంది. అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


శ్రీ శివసాయికాలనీలో వెలగని వీధిదీపం

ఘనంగా గురునానక్ దేవ్‌జీ జయంతి

అఫ్జల్‌గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సిక్కుల మత గురువు గురునానక్‌దేవ్‌జీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన విశాల్ దివస్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. విశాల్ దివస్‌కు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో సిక్కులు తరలివచ్చారు. గురునానక్ జయంతి ఉత్సవ విశాల్ దివస్‌లో గుర్బానీ కీర్తనలను భక్తిశ్రద్ధలతో ఆలపించారు. రంగురంగుల పువ్వులతో అలంకరించబడిన వేదికపై సిక్కులపవిత్ర గ్రంథం ఏర్పాటు చేశారు. పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు చెందిన బాయ్ లక్వేందర్‌సింగ్, భాయ్ అమ్రిత్‌సింగ్‌జీ, చరణ్‌జీత్‌సింగ్, జగ్‌దేవ్‌సింగ్, హర్విందర్ సింగ్ కీర్తనలు ఆలపించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సిక్కులు పవిత్ర గ్రంథాన్ని దర్శించుకున్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురుగ్రంథ్ సాహెబ్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ప్రబంధక్ కమిటీ ప్రతినిధులు ఎస్.బల్‌దేవ్ సింగ్ బగ్గా, సత్యవేందర్ సింగ్, జస్పాల్‌సింగ్, జోగేందర్‌సింగ్ ముగ్రాల్, ఎస్.జగన్మోహన్‌సింగ్, హరిప్రీత్‌సింగ్ పాల్గొన్నారు.


భక్తిగీతాలను ఆలపిస్తున్న సిక్కులు

బాలల సాంస్కృతికోత్సవం


ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రశంసాపత్రం ఇస్తున్న కేవీ రమణాచారి

అఫ్జల్‌గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తులో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన బాలల సాంస్కృతికోత్సవం అరుదైన దృశ్యాలను ఆవిష్కరించింది. ఏకపాత్రాభియనం, గీతాలాపనలు, వ్యాసరచన, పుస్తక సమీక్షా రచన, వక్తృత్వ పోటీలతో పరిషత్తు ప్రాంగణం ప్రతిధ్వనించింది. ఈ పోటీలలో తెలుగు రాష్ట్రాలలోని వివిధ పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవానికి విచ్చేసిన విద్యార్థులతో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరం కిటకిటలాడింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పద్మభూషణ్ డాక్టర్ కేవి వరప్రసాదరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి పాల్గొన్నారు. డాక్టర్ వరప్రసాద రెడ్డి మాట్లాడుతూ యాంత్రికత పెరిగిపోతున్న ఈ కాలంలో ఆలోచనలు కలిగించే కార్యక్రమాల ద్వారా బాలల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ బాలల వ్యక్తిత్వ వికాసానికి కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలకు విశేష స్పందన వస్తున్నదన్నారు. డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ 80 ఏళ్ల చరిత్ర కలిగిన తెలంగాణ సారస్వత పరిషత్తు భావి రచయితలను, కళాకారులను రూపొందించే కార్యక్రమాలు చేపడుతున్నదని కొనియాడారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కృష్ణమోహన్, డాక్టర్ సుమిత్రాపార్థసారధి, డాక్టర్ జె.విజయ్‌కుమార్, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు లభించాయి. పాటల పోటీలో 8వ తరగతికి చెందిన ఎన్.నరేశ్, చిత్రలేఖనంలో డి.విగ్నేష్, కథల పోటీలో జి.యశ్విత బహుమతులు గెలుచుకున్నారు.

రాంబాగ్‌లో దంగల్ పోటీలు ప్రారంభం


దంగల్ పోటీలను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నిర్వాహకులు రాజు పహిల్వాన్, మల్లారెడ్డి

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానంలో శుక్రవారం సాయంత్రం దంగల్(కుస్తీ) పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ నిర్వాహకులు గొరిగె రాజు పహిల్వాన్, నారగూడెం మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత దేహ దారుఢ్యాన్ని పెంచుకునేందుకు కుస్తీ పోటీలు దోహదపడతాయన్నారు. యువత సన్మార్గంలో నడుచుకుంటూ సమాజానికి మంచి చేసే వారిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యదర్శి ఎం.కొమురయ్య, రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్‌రెడ్డి, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకట్రామిరెడ్డి, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, నాయకులు షాబాద విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, ఎం.బాల సుబ్రమణ్యం, ఎస్.జయానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శం

● జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి


సర్వేను పరిశీలిస్తున్న కుమారస్వామి

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శం అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి వల్లే కులగణన సాధ్యమైందని, దీనికి ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలంతా తమ వివరాలను ఇవ్వాలని కోరారు. కులం గురించి వివరాలను ఇచ్చి భవిష్యత్ తరాల బతుకులు మార్చాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయియాదవ్, రాజేష్‌యాదవ్, రమణ, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపూర్వ స్పందన

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్వేకు రాజేంద్రనగర్ సర్కిల్‌లో అపూర్వ స్పందన లభిస్తుందని డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ అన్నారు. హసన్‌నగర్‌లో సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు పూర్తి వివరాలు ఇవ్వాలని ప్రజలకు సూచించారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నార్సింగ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీకి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ మణికొండ గ్రామానికి చెందిన రామకృష్ణకు రూ.44 వేలు, చిత్రపురికాలనీకి చెందిన రామ్మోహన్‌కు రూ.44 వేలు, పుప్పాల్‌గూడ ప్రాంతానికి చెందిన యాదమ్మకు రూ.44 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అతిథులు

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

రవీంద్రభారతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎదుటి వారిని ఇబ్బంది పెట్టకుండా ఉండడమే రియల్ కైండ్‌నెస్ అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ బుర్రా వెంకటేశం అన్నారు. రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో వరల్డ్ కైండ్‌నెస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన పలువురికి విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అన్ని సంస్థలు, వ్యక్తులు సమాజ హితం కోసం పనిచేయాలని అన్నారు. జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జీవీఎస్ రాజుగుప్తా, రేణుకా అగర్వాల్, శంకర్, రేవతి పుట్ట, చందన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో డాక్టర్ రియాజ్

ఘనంగా 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మంగళ్‌హాట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలను గతంలోకంటే ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.


గిడుగు రుద్రరాజును కలిసిన రాజేశ్‌కుమార్, తదితరులు

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

మదీన, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజును కలిసి హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముజీబుల్లా షరీఫ్, కె.రవిరాజ్, బోయ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేస్తే పతనమే'

రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకురాకుండా మోసం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ పతనం ఖాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, ఎంఎస్‌పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ హెచ్చరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం శుక్రవారం బుద్వేల్‌లోని అరుంధతీ సంక్షేమ సంఘం ఆవరణలో పి.నర్సింహ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకూ ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై.అశోక్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ, సీనియర్ నాయకులు మద్దిలేటి మాదిగ, క్యాసారం శంకర్‌రావు మాదిగ, ఎంఎస్‌పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్ మాదిగ, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాదిగ పాల్గొన్నారు.

19న ఇందిరాగాంధీ జయంతి

రవీంద్రభారతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కళాదర్బార్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఈనెల 19న ఎలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకులు పొత్తూరి రంగారావు, వేణు, రవికుమార్, జ్యోతిర్మయి, షానవాజ్ తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఇందిరాగాంధీ జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తామని వారు పేర్కొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకుపోయిన కారు

నార్సింగ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్పారేడియల్ రోడ్డులో ఆర్మీ ఫుట్‌ఓవర్ వంతెన వద్ద కారు మిలటరీ ఏరియా ప్రాంతంలోని చెట్లపొదల్లోకి దూసుకుపోయింది. వేగంగా వచ్చిన కారు చెట్టును ఢీకొట్టడంతో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అయ్యాయి. దీంతో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కేసు విచారిస్తున్నామని నార్సింగ్ పోలీసులు తెలిపారు.


చెట్టును ఢీకొట్టిన కారు

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు


జంగల్ విఠోబా ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

గోషామహల్/చాంద్రాయణగుట్ట/రాజేంద్రనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీ జంగల్ విఠోబా ఆలయం శ్రీ విఠలేశ్వర బాలభక్త సమాజ్ ఆలయ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్, అధ్యక్షుడు వి.కిషన్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, బీజేపీ కార్పొరేటర్లు లాల్‌సింగ్, రాకేశ్ జైస్వాల్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు రామరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. లలితాబాగ్ మహ్మద్‌నగర్‌లోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయాన్ని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు. సిద్దులగుట్ట శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, సులిగె దేవేందర్, లావణ్య దంపతులు దర్శించుకున్నారు.


కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఉప్పుగూడ మహాకాళి అమ్మవారు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tr5oYRK లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'మాజీ ఎమ్మెల్యే జ్యోతి సేవలు చిరస్మరణీయం'

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి పేదలకు అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ లాయర్స్ ఫోరం కార్యదర్శి కాసుల వినోద్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగానూ, ప్రజా ప్రతినిధిగానూ జ్యోతి ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ ఛైర్మన్ కట్టెల సుభాష్ మాట్లాడుతూ అఖిల భారత మహిళా ఎమ్మెల్యేల కన్వీనర్‌గా జ్యోతి చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని అనేక ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, మున్నూరుకాపు ప్రతినిధులు పాల్గొన్నారు.


భూదాన ఉద్యమనేత ఆచార్య వినోబాబావే వర్ధంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ మల్లారెడ్డి, కార్యదర్శి మనీలాల్ షా, కార్యదర్శి విజయవర్ధన్‌నాయుడు, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● గోషామహల్, ఆంధ్రజ్యోతి


గిరిజన, ఆదివాసి పోరాటయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని గాంధీభవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆదివాసి రాష్ట్ర కో-ఆర్డినేటర్ గణేశ్ రాథోడ్, రాష్ట్ర కన్వీనర్ కిషన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లం భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌నాయక్, శంకర్ నాయక్, కృష్ణానాయక్, శ్రీనివాస్ నాయక్, న్యాయవాది బూటాసింగ్ రాథోడ్ పాల్గొన్నారు

● చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

బడికి సొంతగూడేది?

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు కరువయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నా.. సర్కారు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులను పట్టించుకునే వారే కరువయ్యారు. విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో నిధులు విడుదల విషయంపై ఎవరూ చొరవ చూపించకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించక పోవడంతో విద్యార్థులు అద్దె గదులు, కమ్యూనిటీ హాళ్లలో ఇబ్బందులు పడుతూ పాఠాలు నేర్చుకుంటున్న దుస్థితి నెలకొంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలోని సర్కారు బడుల నిర్వహణ అధ్వానంగా మారింది. గదుల కొరతతో కొన్నిచోట్ల ప్రాథమిక, ఉన్నత తరగతులను విభజించి ఉదయం, మధ్యాహ్నం పూట షిఫ్ట్ పద్ధతిన నిర్వహిస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో నేటికీ కమ్యూనిటీ హాళ్లలోనే నడుపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రస్తుతం 691 పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,12,480 మంది విద్యార్థులు చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.


ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న పాఠశాల

కమ్యూనిటీ హాళ్లలో 68 స్కూళ్లు

జిల్లాలోని 691 స్కూళ్లలో 400 చోట్ల సొంత భవనాలున్నాయి. 68 పాఠశాలలు కమ్యూనిటీ హాళ్లు, మరో 40 వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 183 బడులు అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. అద్దె ఇళ్లలోని బడులకు నెలవారీ కిరాయి సుమారు రూ. 16 లక్షల వరకు చెల్లిస్తున్నారు. కిరాయి ఇళ్లు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్న స్కూళ్లను పక్కా భవనాల్లోకి మార్చాలని కొన్నేళ్లుగా స్థానిక ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నా.. ఫలితం లేదు. పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల సమయంలో నూతన నిర్మాణాలు చేపడతామని.. హామీలిస్తున్న ప్రజాప్రతినిధులు తర్వాత పట్టించుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

చొరవ చూపేవారేరి?

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు, అధికారులు.. అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో నడుస్తున్న వాటికి మోక్షం కలిగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సర్కారు స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే చూస్తున్నారే తప్ప.. నూతన పాఠశాలలను నిర్మించేందుకు చొరవ చూపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన మన ఊరు-మన బడి, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో.. ఉన్న పాఠశాలలకు అరకొరగా మరమ్మతులు చేశారని, పక్కా స్కూల్ భవనాలను నిర్మించలేదని తెలిపారు. ప్రభుత్వానికి అద్దె భారాన్ని తగ్గించడంతోపాటు పిల్లలకు సొంత పాఠశాల అనే నమ్మకం కలిగించేందుకు కొత్త భవనాలను కట్టాలని కోరుతున్నారు. ప్రధానంగా కమ్యూనిటీ హాళ్లు, షిఫ్ట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఉపశమనం కలిగించాలన్నారు.

సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో నడుస్తున్న కమ్యూనిటీ హాళ్లలోని స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, లైట్లు సరిగా లేవు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులు, వీధి వ్యాపారులు గదుల్లోని సెల్ఫ్‌లు, సజ్జెలపై వస్తువులను పెడుతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

రాత్రివేళల్లో ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు కాకపోవడంతో తమకు స్వేచ్ఛ లేకుండా పోయిందని చెబుతున్నారు. షేక్‌పేట్, నాంపల్లి, ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్, గోల్కొండ, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కమ్యూనిటీ హాళ్లలో స్కూళ్లు నడుస్తుండడంతో తల్లిదండ్రులు.. పిల్లలను ఆ పాఠశాలలకు పంపించేందుకు ఆసక్తి చూపించడం లేదు.

ఓటీఎస్‌పై ప్రచారం చేయండి

● అధికారులకు జలమండలి ఎండీ సూచన

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జలమండలి అమలు చేస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్)పై సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ శుక్రవారం డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో జూమ్ మీటింగ్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. ఓటీఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి డివిజన్‌లోని టాప్-10 వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయాలని జనరల్ మేనేజర్లకు సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటీఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించి రెగ్యులర్ మీటర్ రీడర్లకు, కలెక్షన్ బృందాలతో కలిసి బిల్లులు వసూలయ్యేలా చూడాలన్నారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. న్యాయపరమైన సమస్యలతో దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులను గుర్తించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని సీజీఎంలకు సూచించారు. ఓటీఎస్ పథకంపై సందేహాలుంటే జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని వినియోగదారులకు చెప్పాలన్నారు. సమీక్షలో జలమండలి ఈఎన్‌సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్‌కుమార్, ఆపరేషన్స్-2 డైరెక్టర్ స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.


శస్త్రచికిత్స వివరాలను వెల్లడిస్తున్న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

గుండెకు అరుదైన శస్త్రచికిత్స

● వాల్వ్ మార్చి రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండె మార్పిడి చేయాల్సిన రోగికి క్లిష్టమైన ఏరోటిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను మెడికవర్ వైద్యులు విజయవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడారు. సర్జరీ వివరాలను శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బిహార్‌కు చెందిన ఓంప్రకాశ్ ప్రసాద్(59) గుండె సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో బేగంపేట మెడికవర్ ఆస్పత్రి హృద్రోగ నిపుణుడు డాక్టర్ సుధీర్‌ను సంప్రదించారు. గుండె సమస్య చాలా క్లిష్టంగా ఉందని, బతకడానికి 10 శాతం మాత్రమే అవకాశం ఉందని నిర్ధారించారు. ఏరోటిక్ వాల్వ్ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స సమయంలో గుండె సాగిపోవడం, వాల్వ్ పూర్తిగా దెబ్బతినడం, మయోకార్డియం(గుండె పరికరాలు) తక్కువగా పనిచేయడం వంటి పరిస్థితులు కనిపించినప్పటికీ అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్స పూర్తిచేశామని డాక్టర్ సాకేత్ వివరించారు. 72 గంటల తరువాత గుండె పనితీరు మెరుగుపడడంతో మందుల వాడకాన్ని తగ్గించామని, రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేశామని తెలిపారు. సర్జరీలో డాక్టర్లు సాకేత్, మానస, రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ అభిలాష్ పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా హరికిరణ్ బాధ్యతల స్వీకరణ


మంత్రి జూపల్లి కృష్ణారావుకు మొక్క అందజేస్తున్న హరికిరణ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా నియమితులైన చెవ్వూరు హరికిరణ్ అబ్కారీ భవన్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏఈఎస్ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం హరికిరణ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలోని తన చాంబర్‌లో డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్నట్లు తొలి సంతకం చేశారు. 2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఏపీలో నంబరు వన్, ఆలిండియా స్థాయిలో 18వ ర్యాంకర్‌గా గుర్తింపు పొందారు. శిక్షణ అనంతరం కడప (వైఎస్సార్) జిల్లా, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్‌గా, అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్‌గా పనిచేశారు. ఏపీ నుంచి తెలంగాణకు వచ్చిన ఐఏఎస్ క్యాడర్‌లో మొదటిసారి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ డైరెక్టర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రి, సురేష్, శశిధర్‌రెడ్డి, ఓవర్సీస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహాం, కాశీనాథ్, డిప్యూటీ కమిషనర్ దశరథ్, డీసీ హెడ్ క్వార్టర్స్ రఘురాం, అసిస్టెంట్ కమిషనర్‌లు చంద్రయ్య, శీలం శ్రీనివాస్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్. కిషన్, ప్రవీణ్, శ్రీధర్, ఇతర డీఎస్‌లు, ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్స్ ప్రదీప్‌రావు, జీవన్‌కిరణ్ హరికిరణ్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హరికిరణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావును సచివాలయంలో ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

శంషాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంషాబాద్ మండల పరిధిలోని పెద్దతూప్రలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16వ ఈషా గ్రామోత్సవంలో భాగంగా శనివారం నుంచి రెండు రోజులపాటు పోటీలు జరుగుతాయని, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదు

● పేదల ఇళ్లను కూల్చితే ఊరుకోం
● నేటి నుంచి బాధితులతో కలిసి బీజేపీ నేతల బస
● రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, ఇష్టారాజ్యంగా పేదల ఇళ్లను కూల్చివేస్తే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి హెచ్చరించారు. శుక్రవారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృతతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూసీ సుందరీకరణను అడ్డుకుంటే బుల్డోజర్లతో తొక్కిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఈ నెల 16 నుంచి మూసీ పరివాహక 22 ప్రాంతాలలో బీజేపీ నేతలు బాధితులతో కలిసి నిద్రిస్తున్నారని, సీఎంకే దమ్ముంటే బుల్డోజర్లతో మమ్ములను తొక్కించాలని సవాల్ విసిరారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 నుంచి 17వ తేదీ ఉదయం 9 గంటల వరకు అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని తులసీరామ్ నగర్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కమలానగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, శాస్త్రినగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్, అంబేడ్కర్‌నగర్‌లో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ మూసీ బాధితులతో కలిసి బస చేస్తారని పేర్కొన్నారు. మిగత 18 ప్రాంతాలలో కూడా బీజేపీ నేతలు బస చేస్తారని తెలిపారు. మంత్రులు దక్షిణ కొరియా వెళ్లారు.. దేశంలో ఉన్న సబర్మతిని ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఓబీసీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్‌లో చట్టవ్యతిరేక వస్తువులంటూ బెదిరింపు

● యువకుడి నుంచి రూ.6.90 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీహెచ్ఎల్ కొరియర్ సర్వీసు పేరుతో ముంబై నుంచి చైనాకు వెళ్తున్న పార్శిల్‌లో చట్టవ్యతిరేక వస్తువులు దొరికాయంటూ నగరానికి చెందిన యువకుడిని సైబర్ కేటుగాళ్లు బెదిరించి రూ. 6.90 లక్షలు కాజేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 28 ఏళ్ల యువకుడికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. తన పేరుతో ఉన్న పార్శిల్‌లో మాదక ద్రవ్యాలు ఉండటంతో క్రైమ్ బ్రాంచి పోలీసులు కేసు నమోదు చేశారని నమ్మించారు. కాల్‌ను క్రైమ్ బ్రాంచి పోలీసులకు బదిలీ చేశామని.. స్కైప్‌కాల్‌లో మాట్లాడాలని ఆదేశించారు. పోలీస్ యూనిఫాంలో ఉన్న వ్యక్తులు మాట్లాడారు. నరేష్‌గోయల్‌కు చెందిన కోట్ల రూపాయల జెట్ ఎయిర్‌వేస్ మనీల్యాండరింగ్ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలున్నాయని, విచారించి అరెస్టు చేస్తామని బెదిరించారు. తాను పార్శిల్ పంపలేదని అతడు చెప్పినా వినిపించుకోలేదు. బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును వెంటనే ఆర్‌బీఐకి బదిలీ చేయాలని, మనీ ల్యాండరింగ్‌లో ప్రమేయం లేదని తేలితే తిరిగి జమ చేస్తామని నమ్మించారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయమని, బయటకు చెబితే ఏడేళ్ల జైలు శిక్ష తప్పదని బెదిరించారు. బాధితుడి తల్లి, సోదరి ఫొటోలతో పాటు.. గ్యాలరీ చూపించాలంటూ ఫొటోలను చూసి ఆరా తీశారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 6.90 లక్షలు నిందితులు చెప్పిన ఖాతాలోకి జమ చేశాడు. ఆ తర్వాత ఎవరూ స్పందించకపోవడం, డబ్బులు తిరిగి తన ఖాతాలోకి బదిలీ కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్ఎంజీ వ్యాగన్లలో ఎలక్ట్రిక్ ఆటోల రవాణా

● బాలానగర్ స్టేషన్ నుంచి న్యూఢిల్లీకి
● సరుకు రవాణాలో హైదరాబాద్ డివిజన్ కృషికి జీఎం ప్రశంసలు


ఎన్ఎంజీ వ్యాగన్‌లో ఎలక్ట్రిక్ ఆటోను లోడ్ చేస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ ఆటోలను రవాణా చేసేందుకు దక్షిణమధ్యరైల్వే ఎన్ఎంజీ (న్యూ మోడిఫైడ్ గూడ్స్)వ్యాగన్లను రూపొందించింది. బాలనగర్ స్టేషన్ నుంచి 25 వ్యాగన్లలో తొలిసారి 200 ఆటోలను ఢిల్లీ సమీపంలోని బిజ్వాసన్ స్టేషన్‌కు రవాణా చేశారు. ఇందుకుగాను దక్షిణమధ్యరైల్వేకు రూ.17.50 లక్షల ఆదాయం సమకూరింది. ఎలక్ట్రిక్ ఆటోల లోడింగ్ ప్రక్రియను హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, సీనియర్ డీజీఎం అనిరుధ్ పామర్, ఆపరేషనల్ మేనేజర్ విద్యాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ.. సరుకు రవాణాను మెరుగుపరచడానికి దక్షిణమధ్యరైల్వే అనేక కార్యక్రమాలను చేపడుతోందని, వినియోగదారులను ఆకర్షించేందుకు విస్తృతమైన మార్కెటింగ్ ప్రయత్నాలను చేపడుతున్నామన్నారు. జడ్చర్ల సమీపంలోని రాజ్‌పూర్ కేఈటీవో మోటార్స్ ప్లాంట్ విజ్ఞప్తి మేరకు ఎలక్ట్రిక్ ఆటోలను రవాణాను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రయాణికుల కోచ్‌లను ఎన్ఎంజీ వ్యాగన్లుగా మార్చి వాటిని కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లు, స్కూటర్లు తదితర తేలికపాటి వాహనాలను రవాణా చేయడానికి ఉపయోగించామన్నారు. సరుకు రవాణాను పెంపొందించడంలో హైదరాబాద్ డివిజన్ చేస్తున్న కృషిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

‘లీగల్’ ఎగ్జిబిషన్ అద్భుతం

● హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రాధాన్యత పెంచేలా, న్యాయవ్యవస్థ పనితీరును కళ్లకు కట్టినట్టుగా వివరించేలా ఏర్పాటు చేసిన లీగల్ ఎగ్జిబిషన్ అద్భుతమని తెలంగాణ హైకోర్టు జడ్జి, జస్టిస్ మాధవీదేవి అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని నారాయణగూడలోని కేశవ మెమోరియల్ లా కాలేజీ యాజమాన్యం లీగల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో న్యాయవ్యవస్థను చక్కగా వివరించారని చెప్పారు. ప్రత్యేకంగా క్రిమినల్ కేసుల్లో న్యాయం ఎలా పొందవచ్చనే విషయాన్ని బాగా తెలియజేశారన్నారు. ప్రాక్టికల్‌గా చూడడం ద్వారా చాలా నేర్చుకునే అవకాశం ఉంటుందని, లా విద్యార్థులతోపాటు ఇతరులు కూడా ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తే బాగుంటుందన్నారు. జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి సైతం ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నోవాటెల్ ఎరీనాలో.. దల్జీత్ సింగ్ దిల్ జూమ్ షో

● వేలాదిగా తరలివచ్చిన ప్రేక్షకులు

శంషాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాపులర్ సింగర్ దల్జీత్ సింగ్ దిల్ జూం షోను నోవాటెల్ హోటల్ ఎరీనాలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. దల్జీత్‌సింగ్ పాటలకు యువత కేరింతలు కొడుతూ స్టెప్పులు వేశారు. షోకు దాదాపు 20 వేలమంది ప్రేక్షకులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. షో మూడున్నర గంటలపాటు సాగింది. విమాన ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌జీఐఏ, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారుల నోటీసులు

అనుమతి లేకుండా షో నిర్వహిస్తున్నారని, భారీ డీజే సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయడంపై నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. షోకు చిన్న పిల్లలను అనుమతించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

21.45 కిలోల గంజాయి పట్టివేత

● వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్ట్ చేసిన నిందితుడు (కూర్చున్న వ్యక్తి)


హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిశా తదితర ప్రాంతాల నుంచి నగరానికి గంజాయి సరఫరా అవుతుందని సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఒడిశా నుంచి హైదారాబాద్‌కు రైల్లో గంజాయి రవాణా అవుతుందని సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ టీమ్ మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో నిఘా పెట్టింది. ఎస్‌కే అహ్మద్ అలీ(రాజమండ్రి)ని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 17.22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ధూల్‌పేటకు చెందిన రాహుల్‌సింగ్‌కు అందజేయడానికి వస్తున్నట్లు అంగీకరించాడు.

మరో కేసులో.

అప్పర్ ధూల్‌పేట్ హజారీ హోటల్ సమీపంలో ఎస్‌టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఉదయం నలుగురు నిందితుల వద్ద 4.23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా.. మరో ఎనిమిది మందికి గంజాయి అమ్మకాలతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. ఎడిగ గణేష్, రాహుల్ సింగ్, అంకిత్, లడ్డూ సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్, చరణ్, శంకర్, అమన్ సింగ్, ఆదర్శసింగ్, ముఖేష్ సింగ్, ఎస్‌కే అహ్మద్, సుమరాజ్ గులారీ పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

ఎక్కడుందో పట్టేయొచ్చు

● వాటర్‌బోర్డులో వాహనాల ట్రాకింగ్
● ట్యాంకర్లు, ఎయిర్‌టెక్ మిషన్లు, సిల్ట్ కార్టింగ్ వాహనాలకు ఏవీటీఎస్
● రూ.72 లక్షలతో ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం



హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్లు, ఎయిర్‌టెక్ మిషన్లు, సిల్ట్ కార్టింగ్ వాహనాలు దారితప్పుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జలమండలి చర్యలకు ఉపక్రమించింది. అద్దె ప్రాతిపదికన పనిచేస్తున్న ఈ వాహనాలకు ఆటోమేటిక్ వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్(ఏవీటీఎస్) పరికరాలను బిగించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతినెలా బిల్లులు చెల్లిస్తున్నా విధి నిర్వహణలో పారదర్శకత ఉండడం లేదని అధికారులు గుర్తించారు. కొన్ని ఎయిర్‌టెక్ మిషన్లు, సిల్ట్‌కార్టింగ్ వాహనాలు ప్రైవేటు పనుల్లో నిమగ్నమవుతూ వాటర్‌బోర్డు నుంచి వేలాది రూపాయలు తీసుకుంటున్నాయి. ట్యాంకర్లు, ఎయిర్‌టెక్ విషన్లు, సిల్ట్ కార్టింగ్ వాహనాలకు రూ.72 లక్షలతో ఏవీటీఎస్‌ను ఏర్పాటు చేయడానికి బోర్డు టెండర్లు ఆహ్వానించింది. దీనివల్ల వాహనం ఏ సమయంలో ఎక్కడుందో ఆన్‌లైన్‌లో పర్యవేక్షించొచ్చు. రెండు నెలల్లో అద్దె ప్రతిపాదికన పనిచేసే అన్ని వాహనాలకు ఏఈవీటీఎస్‌ను అమర్చేలా ప్రణాళిక రూపొందించారు.

రోజుల తరబడి గ్యారేజీల్లో..

గ్రేటర్ పరిధిలో నిత్యం వెయ్యికిపైగా సివరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తుతున్నాయి. బస్తీలు, కాలనీల్లో సివరేజ్ సమస్యలను పరిష్కరించడానికి ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు 270, సిల్ట్ కార్టింగ్ వాహనాలు 160 ఉన్నాయి. లీజు ప్రకారం ఆయా వాహనాలకు అద్దెతోపాటు వాహన డ్రైవర్, ఇద్దరు కార్మికులకు కూడా బోర్డు వేతనాలిస్తోంది. ప్రతినెలా ఒక్కో వాహనానికి రూ.1.20 లక్షల నుంచి రూ .2.50లక్షలకు పైగా చెల్లిస్తోంది. ఎయిర్‌టెక్ మిషన్లు అధికంగా పలువురు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, పలుకుబడి కలిగిన రాజకీయ నేతలవేనన్నది బహిరంగ రహస్యమే. కనీసం నాలుగు నుంచి పదివరకు వివిధ ఏజెన్సీల పేరుతో నిర్వహిస్తున్నారు. చాలావరకు వాహనాలు మరమ్మతు పేరుతో గ్యారేజీల్లో ఉంచుతూ అద్దె తీసుకుంటున్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం

ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు, సిల్ట్ కార్టింగ్ వాహనాలను పర్యవేక్షించే వర్క్ ఇన్‌స్పెక్టర్లలో కొందరు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వాటర్‌బోర్డుకు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించకుండా ప్రైవేటు పనులు చేయిస్తున్నారు. తాము సూచించిన ప్రాంతాల్లో పనులు చేయాలని, లేకుంటే బిల్లుల్లో కోత విధిస్తామని బెదిరిస్తున్నట్లు తెలిసింది

పక్కదారి పట్టకుండా ప్రత్యేక చర్యలు

ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు ఖరారు చేసిన ప్రాంతాల్లోనే సివరేజ్ నిర్వహణ చేపట్టాల్సి ఉంది. గతంలో ప్రతిరోజూ కనీసం 500 మీటర్ల మేర పనిచేయాలని నిబంధన ఉండగా.. ఆ తర్వాత తొలగించారు. ఖరారు చేసిన ప్రాంతాల్లో ఎక్కడ మ్యాన్‌హోల్ పొంగినా పనివేళల్లో నిరంతరం పనిచేయాలి. వాటర్ బోర్డు అధికారుల ఆదేశాలు లేదా కాల్‌సెంటర్ ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లాలి. కానీ కొన్ని వాహనాలు రోడ్డెక్కడం లేదు. మరికొన్ని వాహనాలు రోడ్డుపైకి వచ్చినా వాటర్‌బోర్డు పనుల కంటే ప్రైవేటు పనులకు ఉపయోగిస్తున్నారు. హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నుంచి వేలల్లో డబ్బులు తీసుకొని పనులు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

తాగునీటి ట్యాంకర్లది మరో కథ

తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్లను కొందరు యజమానులు పక్కదారి పట్టిస్తున్నారు. స్నేహితులు, సన్నిహితులతో డొమెస్టిక్ ట్యాంకర్లను బుక్ చేసి కమర్షియల్‌లో విక్రయిస్తూ బోర్డు ఆదాయానికి గండి కొడుతున్నారు. ట్యాంకర్లకు గతంలో జీపీఎస్ అమర్చగా.. యజమానులు తొలగించారు. బుకింగ్ చేసిన ట్యాంకర్ ఎప్పటివరకు వస్తుందో ఆన్‌లైన్‌లో వినియోగదారులు, అధికారులు పర్యవేక్షించేలా ఏవీటీఎస్ దోహదపడనుంది.

బర్త్‌డే పార్టీలో హత్య?


● అల్కాపూర్‌లో యువకుడి మృతి


రోహిత్‌కుమార్ సింగ్(ఫైల్)

నార్సింగ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్కాపూర్‌లో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం.. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఓ యువకుడు(25) రక్తపు మడుగులో ఉన్నాడని శుక్రవారం తెల్లవారు జామున పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి పేరు రోహిత్ కుమార్‌సింగ్ అని, బాలానగర్‌కు చెందిన వాడని విచారణలో తేలింది. బలమైన ఆయుధంతో దాడిచేయడంతోనే యువకుడు చనిపోయాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అతడు అల్కాపూర్ ఎందుకు వచ్చాడు, ఎవరు హత్య చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా బర్త్‌డే పార్టీ జరిగిందని, ఘర్షణ చెలరేగడంతో అతడిని కొట్టి చంపారని ప్రచారం జరుగుతోంది.

ప్రాణం తీసిన వేగం

● డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు యువకుల మృతి


దేవ్‌కుమార్ స్వామి(ఫైల్)


వెంకటస్వామి (ఫైల్)

రాయదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారు జామున గాజులరామారం జీడిమెట్లకు చెందిన వెంకటస్వామి(30), విశాఖపట్నంకు చెందిన పిల్లి దేవ్ కుమార్‌స్వామి(25) బైక్‌పై ట్రిపుల్ ఐటీ సర్కిల్ నుంచి విప్రో సర్కిల్‌కు వేగంగా వెళ్తున్నారు. బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతిలోని ప్రతి ఆకు, పువ్వు, కాయ మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది. కానీ చాలా సార్లు మనం మన చుట్టూ ఉన్న ఆకులలోని ఆరోగ్య లక్షణాలను పట్టించుకోం. అలాంటి కొన్ని ఆకుల ద్వారా చేసే రుచికరమైన కూరలు మీ కోసం...

ఆకులతో అదిరే రుచులు



చామదుంపల పత్రి కూర

కావాల్సిన పదార్థాలు

చామగడ్డలు- 250 గ్రాములు, బిల్వపత్రి- ఒక కప్పుడు, నూనె- 3 స్పూనులు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక అరకప్పు, పసుపు- అర చెంచా, పచ్చి మిర్చి ముక్కలు- నాలుగు చెంచాలు, కారం- ఒక స్పూను, కరివేపాకు- ఒక రెబ్బ, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, సన్నగా తరిగిన పుదీనా- తగినంత, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, దాల్చిన చెక్క- కొద్దిగా, జీలకర్ర- ఒక స్పూను, చింతపండు పులుసు- మూడు స్పూనులు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- చామదుంపలను ఉడికించి.. చల్లారిన తర్వాత పైతొక్క తీసి పెట్టుకోవాలి
- బిల్వపత్రం ఆకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి.
- ఉల్లిపాయముక్కలు, దాల్చిన చెక్క, జీలకర్రలను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి
- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దానిలో కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి దోరగా వేయించాలి. దోరగా వేగిన తర్వాత పసుపు వేయాలి. ఆ తర్వాత ముందుగా తయారుచేసుకున్న ఉల్లిపాయ ముద్దను వేసి పచ్చివాసన పోయే దాకా వేయించాలి. ఆ తర్వాత చింతపండు పులుసు వేయాలి.
- ఈ మిశ్రమం ఉడికిన తర్వాత దానిలో ఉడికించిన చామదుంపలు, బిల్వపత్రిలను వేసి మూత పెట్టి ఐదుని మిషాలు ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత ఉప్పు వేసి బాగా కలపాలి. పైన పుదీనా, కొత్తిమీరను జల్లాలి.

జాగ్రత్తలు

- బిల్వపత్రి త్వరగా ఉడికిపోతుంది. అందువల్ల ఎక్కువ సేపు ఉడికించాల్సిన అవసరం లేదు.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయకపోయినా మంచి రుచి వస్తుంది.
- చామదుంపలు పెద్దగా ఉండకూడదు. చిన్నగా, గుండ్రంగా ఉన్న చామదుంపలను ఎంపిక చేసుకోవాలి. చామ దుంపలను ఎక్కువగా ఉడికిస్తే ముద్దగా అయిపోతాయి. అందువల్ల ఎక్కువగా ఉడికించకూడదు.

చెన్నంగి ఆకు కంద పులావ్



కావాల్సిన పదార్థాలు

చెన్నంగి ఆకు- ఒక కప్పు, కందగడ్డ ముక్కలు- ఒక కప్పు, బాస్మతి బియ్యం- మూడు కప్పులు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, బిర్యానీ దినుసులు (లవంగం, విరజాజి మొగ్గ, బిర్యానీ ఆకు, ఏలకులు)- పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, పెరుగు- ఒక కప్పు, నూనె- ఆరు స్పూనులు, నెయ్యి- ఆరు స్పూనులు, పచ్చిమిర్చి పేస్ట్- రెండు స్పూనులు, పసుపు- అర స్పూను, జీడిపప్పు- నాలుగు స్పూనులు, కిస్‌మిస్- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత, నీరు- తగినంత

తయారీ విధానం

- బాస్మతి బియ్యాన్ని బాగా కడిగి నీళ్లలో 15 నిమిషాలు నాననివ్వాలి.
- కందగడ్డ ముక్కలను ఉడికించి చల్లారనివ్వాలి. ఆ తర్వాత ఒక మూకుడులో మూడు స్పూన్ల నెయ్యి వేసి కందగడ్డ ముక్కలను వేయించాలి. విగిలిన నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి వేయించాలి. వీటిని ఒక పళ్లెంలో చల్లారనివ్వాలి.
- ఆ తర్వాత అదే మూకుడులో నూనెను వేసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయముక్కలు, అల్లం- వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేగనివ్వాలి. ఆ తర్వాత బిర్యానీ దినుసులు, పచ్చి మిర్చి పేస్ట్, పసుపు వేసి వేయించాలి. ఉప్పు కూడా వేయాలి.
- ఆ తర్వాత బాస్మతి బియ్యం, కందగడ్డ ముక్కలు వేసి మూత పెట్టి సన్నని సెగపై ఉడకనివ్వాలి.
- బియ్యం ఉడికిన తర్వాత దానిలో పెరుగు వేసి కలపాలి. ఈ సమయంలో చెన్నంగి ఆకులు వేసి మరి కొంత సేపు ఉడకనివ్వాలి.
- ఇలా ఉడికిన అన్నంలో మూడు చెంచాల నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి దింపేయాలి.

జాగ్రత్తలు

- ఉడికించిన కంద ముక్కలను దోరగా వేయించాలి. దీనివల్ల పై పొర కరకరలాడుతూ ఉంటుంది. లోపల మెత్తగా ఉంటుంది.
- సాధారణంగా ఒక కప్పు బాస్మతి బియ్యానికి ఒకటిన్నర నీళ్లు పోస్తే సరిపోతుంది. బాస్మతి బియ్యాన్ని ఎక్కువ సేపు ఉడకనివ్వకూడదు. ఎక్కువ ఉడికితే ముద్దగా అయిపోతుంది.
- కొందరు సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించి.. వాటిని చివరలో కలుపుతారు. దీనివల్ల పులావ్‌కు అదనపు రుచి వస్తుంది.



వాము ఆకు బంగాళ దుంపల కూర



కావాల్సిన పదార్థాలు

బంగాళదుంప ముక్కలు- 250 గ్రాములు, బాగా కడిగిన వాము ఆకు- ఒక కప్పుడు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూనులు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- ఒక రెబ్బ, జీలకర్ర- ఒక స్పూను, ఆవాలు- ఒక స్పూను, వెల్లుల్లి రెబ్బలు- మూడు, అల్లం పేస్ట్- ఒక స్పూను, నూనె- నాలుగు స్పూనులు, పసుపు- ఒక స్పూను, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత.

తయారీ విధానం

- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడి ఎక్కిన తర్వాత ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి వేసి వేయించాలి.
- ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం పేస్ట్ వేయాలి. ఇవన్నీ బాగా వేగిన తర్వాత బంగాళ దుంప ముక్కలను వేసి మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి.
- బంగాళ దుంప ముక్కలు కొద్దిగా మగ్గిన తర్వాత వాము ఆకులు, ఉప్పు, కొత్తిమీర వేసి కలిపి దింపేయాలి.

జాగ్రత్తలు

- వాము ఆకులు తాజాగా ఉంటే కూర ఘుమఘుమలాడుతుంది.
- కొందరు ఈ కూరలో పచ్చిమిర్చిని పేస్ట్ చేసి కూడా కలుపుతారు. కారం ఎక్కువ కావాలనుకొనేవారు పచ్చిమిర్చి పేస్ట్‌ను బంగాళదుంప ముక్కలతో పాటు వేయాలి.
- వాము ఆకులను ముందు వేయకూడదు. చివరలోనే వేయాలి.



చెఫ్: వి.నగేష్
వివాహ భోజనంబు
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488

గింజల్లో రాజా రాజ్‌మా

"రాజమాషో గురుర్భూరిశకృద్ రూక్షోతివాతలః
కషాయానురసః స్వాదురవృష్య శ్లేష్మపిత్తజిత్"

అంటాడు శాస్త్రకారుడు. ఈ శ్లోకంలో రాజమాష అనే పేరున్న గింజ వల్ల కలిగే ప్రయోజనాలను వర్ణించాడు. రాజ మాష అంటే పెద్ద మినపగింజ అని అర్థం. అదే జనవ్యవహారంలో రాజ్‌మా అయ్యింది. ఇది మినపగింజ కన్నా పెద్దగా- మూత్రపిండాల ఆకారంలో ఉంటుంది కాబట్టి- దీనిని ఇంగ్లీషులో కిడ్నీబీన్ అని కూడా అంటారు.

ఏ అవయవ ఆకారంలో ఉన్న ద్రవ్యాలు- ఆ అవయవాన్ని బలసంపన్నం చేస్తాయనేది ఒక సహజ సూత్రం. హృదయం ఆకారంలో ఉండే మామిడిపండు హృదయానికి మేలు చేస్తుంది. మెదడు ఆకారంలో ఉండే అక్రూట్స్ మెదడుని బల సంపన్నం చేస్తాయి. ఇదే విధంగా రాజ్‌మా మూత్రాశయ వ్యవస్థను శుభ్రపరిచి.. మూత్రపిండాలపై అదనపు భారం పడకుండా అడ్డుకుంటుంది. అంతే కాదు.. మూత్ర పిండాల్లో రాళ్లను వెళ్లగొట్టే స్వభావం కూడా దీనికి ఉంటుంది. ఇంతే కాదు. రాజ్‌మా వల్ల అనేక ప్రయోజాలు ఉన్నాయి. ఇది కండరాల బలాన్ని పెంచుతుంది. చెడ్డకొవ్వును తొలగిస్తుంది. దీనిలో ఉండే అధిక పీచుపదార్థం కారణంగా సులభంగా జీర్ణమవుతుంది. చెడ్డకొవ్వు పెరగకుండా కూడా కాపాడుతుంది. దీనిలో కేలరీలు తక్కువ . అందువల్ల స్థూలకాయులు దీనిని నిస్సంకోచంగా తినవచ్చు. దీనిలో విటమిన్ కె అదనంగా లభిస్తూ ఉంటుంది. ఇక కొన్ని ద్రవ్యాలకు ద్వంద్వ ప్రవృత్తి ఉంటుంది. ఒక మంచి ఒక చెడుకలగలసి ఉంటాయి. చెడుని తట్టుకోగల శరీర దారుఢ్యం ఉన్నవారికి, బలమైన జీర్ణ శక్తి ఉన్నవారికి రాజ్‌మా ఉత్తమంగా పనిచేస్తుంది. జీర్ణశక్తి మధ్యస్థంగా ఉన్నవారికి దీని గుణాలు మధ్యస్థంగానే అందుతాయి. జఠరాగ్ని అల్పంగా వారికి దీని వలన ఇబ్బందులు సిద్ధిస్తాయి. అంతే కాదు. భోజనకుతూహలం గ్రంథంలో ఈ రాజమాష గుణాలను 'స్వాదురవృష్యం' అని వర్ణించారు. అంటే ఇది రుచికరమే కానీ లైంగిక శక్తిని నశింపచేస్తుందని అని అర్థం. అంటే రాజ్‌మాను అతిగా కాకుండా పరిమితంగా తింటేనే మంచిదని అర్థం.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

> రాజ్‌మాను నానబెట్టి ముద్దగా చేసి మొటిమలకు పట్టిస్తే అవి తగ్గిపోతాయి. చర్మం మృదువుగా తయారవుతుంది. చర్మవ్యాధుల నివారణకు కూడా రాజ్‌మా పనిచేస్తుంది.



రకరకాల వంటల్లో...

రాజ్‌మాను ఉత్తరభారతదేశంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పచ్చిగింజలను కనీసం 8 గంటలు నానబెట్టి అప్పుడు మాత్రమే తినాలి. లేకపోతే అజీర్ణ సమస్యలు రావచ్చు. అంతే కాదు. రాజ్‌మాను ఇతర ఆకుకూరలు, కూరగాయలతో కలిపి తింటేనే ఎక్కువ రుచికరంగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రాజ్‌మాను బాగా నానబెట్టి.. పెసరపప్పుతో కలిపి వడలు వేస్తారు. దీని వల్ల పెసరపప్పులోను, రాజ్‌మాలోను ఉంటే లక్షణాలన్నీ లభిస్తాయి. మరి కొన్ని ప్రాంతాల్లో రాజ్‌మాను మంటపై కాల్చి తింటారు. మరి కొందరు నానబెట్టి వేయించి తింటారు. ఈ మధ్యకాలంలో కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, రాజ్‌మా, ఎండు మిరపకాయలను వేయించి.. దానిలో సైంధవ లవణాన్ని వేసి పొడి చేస్తున్నారు. దీనిని కంది పొడికి బదులుగా తినవచ్చు.


ప్రత్యేకించి పిల్లల కోసం

మార్కెట్లో దొరికే సౌందర్య ఉత్పత్తులన్నీ పెద్దల కోసం ఉద్దేశించినవి. అయితే పిల్లల కోసం ఎలాంటి ఉత్పత్తులను ఎంచుకోవాలి? వాటిని ఏ మోతాదులో వాడుకోవాలి?

పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో పిల్లలను కూడా అందంగా ముస్తాబు చేయాలనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో పెద్దలు ఉపయోగించే సౌందర్య సాధనాలనే పిల్లలకూ ఉపయోగిస్తూ ఉంటాం. అయితే వాటిలో పిల్లలకు హాని కలిగించేవీ ఉంటాయి. కాబట్టి అప్రమత్తంగా వ్యవహరించాలి.

ఇవి వద్దు

- కోల్, కాజల్, సుర్మా, సింధూర్‌లలో భారీ లోహాలు, సీసం ఉంటాయి. కాబట్టి వాటిని పిల్లలకు వాడకూడదు. వీటికి బదులుగా కర్పూరంతో తయారయ్యే కాటుక ఉత్తమం.
- నెయిల్ పాలిష్‌లో ఉండే ఫార్మాల్డిహైడ్, టోలీన్ లాంటి రసాయనాలు పిల్లలకు హాని కలిగిస్తాయి. కాబట్టి అలాంటి కొన్ని రసాయనాలను వాడలేదని నిర్ధారించే వివరాల కోసం లేబుళ్లను వెతకాలి. '5 ఫ్రీ, 7 ఫ్రీ, 9 ఫ్రీ' లేబుళ్లతో కూడిన నెయిల్ పాలిష్ ఎంచుకోవాలి.
- లిప్‌స్టిక్‌లకు బదులుగా పిల్లలకు లిప్‌గ్లాస్ వాడుకోవచ్చు.



ఇంట్లోనే ఇలా...

పిల్లలకు ఎటువంటి చర్మ సమస్యలూ రాకుండా ఉండాలంటే సౌందర్య ఉత్పత్తులను ఇంట్లోనే తయారుచేసుకోవాలి.

- **లిప్‌స్టిక్:** తాజా కొబ్బరినూనె, బీట్‌రూట్ రసాలను కలిపి లిప్‌స్టిక్‌గా వాడుకోవచ్చు. దీన్నే బ్లష్‌గా ఉపయోగించుకోవచ్చు.
- మైనం, షియా బటర్ లేదా కోకో బటర్, కొబ్బరినూనెలకు, అదనపు రసాయనాలు, రంగులూ జోడించని ఆహారపు రంగులు లేదా బీట్‌రూట్ పొడిని కలుపుకోవచ్చు. అందుకోసం మైనం, వెన్న, కొబ్బరినూనెను గిన్నెలో వేసి, చిన్న మంట మీద వేడి చేయాలి. కరిగిన తర్వాత స్టవ్ మీద నుంచి దింపి, రంగును కలుపుకోవాలి. చల్లారిన తర్వాత నిల్వ చేసుకోవాలి.
- **కాజల్:** సంప్రదాయ పద్ధతిలో మసి, కర్పూరాలతో తయారుచేసుకున్న కాటుక సురక్షితమైనది.
- **ఐ షాడో, ఫేస్ పౌడర్:** బీట్‌రూట్ ముక్కలను ఎండబెట్టి పొడి చేసుకుని, షియా బటర్ కలుపుకుని వాడుకోవచ్చు. కోకో పౌడర్ కూడా ఐ షాడోగా పనికొస్తుంది.
- **ఐ లైనర్:** యాక్టివేటెడ్ చార్కోల్ ముద్దగా మారే వరకూ, దాన్లో చుక్కలు చుక్కలుగా డిస్టిల్డ్ వాటర్ కలుపుతూ ఉండాలి. కావలసిన చిక్కదనం వచ్చాక, డబ్బాలో నిల్వ చేసుకోవాలి.



అందం... అభినయం మాత్రమే సరిపోదు. తనను తాను నిరూపించుకొనేందుకు సరైన అవకాశం కూడా రావాలి. అందుకే చేతికి వచ్చిన ఏ ప్రాజెక్ట్‌నూ వదులుకోలేదు. ప్రతినాయకుడితో జోడీ కట్టి... తెరంగేట్రం చేసింది. నటిగా మంచి మార్కులు వేయించుకుని... ఆపై కథానాయికగానూ అలరిస్తోంది. పాత్రకు తగ్గట్టుగా శరీరాకృతిని సిద్ధం చేసుకొనే అతికొద్దిమంది తారల్లో ఒకరు... హుమా కురేషి. నలభైకి దగ్గరలో ఉన్నా... ఆమెలో ఇంకా అలనాటి మెరుపులే. అందుకు ఆరోగ్యకరమైన అలవాట్లే కారణం అంటుంది హుమా.

ఉరకలేసే ఉత్సాహం

పన్నెండేళ్ల కెరీర్‌లో దాదాపు ముప్పై చిత్రాల్లో నటించింది హుమా. వీటిల్లో కొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. గత ఏడాది చివరల్లో వచ్చిన 'తార్లా'లో తార్లా దలాల్‌గా అభిమానులను ఆకట్టుకున్న ఆమె... విభిన్నమైన పాత్రలతో పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఢిల్లీలో పుట్టి పెరిగిన హుమా... అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసింది. 'గార్గీ కాలేజీ'లో హిస్టరీతో డిగ్రీ చదివింది. ఆమె తండ్రి సలీమ్ కురేషీ 'సలీమ్స్' గ్రూప్ రెస్టారెంట్లకు అధిపతి. తల్లి అమీనా గృహిణి. హుమాకు ముగ్గురు సోదరులు. నటుడు సాకిబ్ సలీమ్ వారిలో ఒకరు. నటనపై ఉన్న మక్కువతో హుమా డిగ్రీ అవ్వగానే... 'యాక్ట్ 1' థియేటర్ గ్రూప్‌లో చేరింది. కొన్ని నాటకాల్లో భాగమైంది. ఎన్‌కే శర్మ ఆమెకు గురువు. మార్గదర్శకుడు. ఆయన ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి డాక్యుమెంటరీలు రూపొందించింది.

ఢిల్లీ నుంచి ముంబయికి...

సినిమాల్లో అవకాశాల కోసం తొలిసారి ముంబయికి వచ్చింది హుమా. అదికూడా అనుకోకుండా..! "ముంబయికి రావాలనే ఆలోచనే నాకు అప్పటివరకు లేదు. అసలు సినీ నటి కావాలని కూడా కోరుకోలేదు. నటన మీద మక్కువతో థియేటర్ గ్రూప్‌తో కలిశాను అంతే. అయితే 'జంక్షన్' అనే చిత్రం ఆడిషన్స్ కోసం నా స్నేహితురాలు ముంబయికి రమ్మంది. 'వెళితే బావుంటుంది కదా' అనుకున్నాను. అలా అనుకోకుండా ముంబయికి వచ్చి ఆడిషన్స్ ఇచ్చాను. అన్నీ అయిపోయాయి... కానీ ఆ ప్రాజెక్టు అంతటితోనే ఆగిపోయింది. అదే సమయంలో 'హిందుస్తాన్ యునిలివర్' కంపెనీకి ప్రచారకర్తగా రెండేళ్ల ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా శామ్‌సంగ్ మొబైల్ యాడ్‌లో ఆమిర్ ఖాన్‌తో, నెరోలాక్ ప్రకటనలో షారూక్ ఖాన్‌తో కలిసి నటించే అద్భుత అవకాశం లభించింది" అంటూ ఓ సందర్భంలో నాటి రోజులు గుర్తు చేసుకుంది హుమా.

అనురాగ్ చూసి...

మొబైల్ యాడ్‌లో హుమా అభినయానికి ఫిదా అయిన దర్శకుడు అనురాగ్ కశ్యప్... తన చిత్రాల్లో అవకాశం ఇస్తానని చెప్పాడు. 'అప్పుడు నేను అస్సలు నమ్మలేదు. ఎందుకంటే పరిశ్రమలో ఇలాంటి వాగ్దానాలు తరచూ వింటూనే ఉంటాం. కనుక అనురాగ్ ఇచ్చే అవకాశం కోసం ఎప్పుడెప్పుడా అని ఉత్సుకతతో ఎదురుచూడలేదు' అంటున్న హుమాకు ఆ తరువాత ఊహించని విధంగా తన మూడు ప్రాజెక్టుల్లో అవకాశం ఇచ్చాడు అనురాగ్. 2012లో విడుదలైన 'గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్'లో సహాయనటి పాత్ర ఇచ్చాడు అతడు. ప్రతినాయకుడిగా నటించిన నవాజుద్దీన్ సిద్దికీకి జోడీగా హుమా నటించింది. అది మంచి గుర్తింపు తీసుకువచ్చింది. వాస్తవానికి ఆమె అజిత్ 'బిల్లా2'లో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కావాల్సింది. ఏడొందల మందిని వడపోశాక హుమాను ఎంపిక చేసుకున్నాడు దర్శకుడు. కానీ ఆ చిత్రం షూటింగ్ ఆలస్యం కావడంతో, అప్పటికే ఒప్పుకున్న ఇతర ప్రాజెక్టుల కోసం నిర్మొహమాటంగా బయటకు వచ్చేసింది. అందుకు తానేమీ బాధపడలేదన్న హుమాకు, 'గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్' వరుస అవకాశాలు వచ్చాయి. 'డి డే, బదలాపూర్, హైవే, జాలీ ఎల్ఎల్‌బీ, తార్లా' తదితర చిత్రాల్లో కథానాయిక ప్రాధాన్యమున్న పాత్రలు పోషించింది. తమిళంలో కూడా పలు చిత్రాల్లో నటించిన ఆమె... వృత్తిగత జీవితంలోనే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ ఎంతో క్రమశిక్షణ పాటిస్తుంది. ముఖ్యంగా వ్యాయామాలు, ఆహార నియమాల విషయంలో కచ్చితంగా ఉంటుంది.

వ్యాయామాలు ఇలా...

పరిశ్రమలోకి వచ్చిన కొత్తల్లో బొద్దుగా ఉన్న హుమాను చూసి కొందరు ఆట పట్టించేవారట. దాన్ని సవాలుగా తీసుకుని కొద్ది నెలల్లోనే నాజూకు శరీరంతో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే జిమ్‌లో గంటలు గంటలు గడపడం ఆమెకు నచ్చదు. శారీరక దారుఢ్యం, ఆరోగ్యంగా ఉండడానికే ఆమె ప్రాధాన్యం.



ఇదీ ఆహారం...

హుమా రోజువారీ ఆహారంలో ఏమేం ఉండాలనేది ఆమె శరీర తత్వాన్ని బట్టి రూపొందించారు న్యూట్రిషనిస్ట్ రాధిక కర్లే. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకు ప్రాధాన్యమిస్తుంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా రోజుకు మూడు లీటర్ల నీళ్లు తాగుతుంది.

ఉదయం: ప్రొబయోటిక్ యోగర్ట్ లేదా బాదం పాలతో ఓట్‌మీల్, ఒక యాపిల్, రెండు కర్జూరా.

భోజనానికి ముందు: ఒక దానిమ్మ పండు

మధ్యాహ్నం భోజనం: పావు కప్పు గ్రీక్ యోగర్ట్‌తో ఒక కప్పు పచ్చి కూరగాయలు, కప్పు ఉడకబెట్టిన కూరగాయలు, వంద గ్రాముల బాయిల్డ్/ గ్రిల్డ్ చికెన్.

సాయంత్రం: వ్యాయామానికి ముందు ఒక అరటిపండు. తరువాత మూడు ఉడకబెట్టిన ఎగ్‌వైట్స్.

రాత్రి భోజనం: ఇంట్లో చేసిన వెజిటబుల్ సూప్, కప్పు ఉడకబెట్టిన కూరగాయలు, వంద గ్రాములు బాయిల్డ్ చికెన్/ చేప.

- హుమా దినచర్య యోగాతో మొదలవుతుంది. క్లిష్టమైన ఏరియల్ యోగాను నిత్యం సాధన చేస్తుంది.
- యోగా తరువాత స్క్వాట్స్, ట్విస్ట్ సిట్‌అప్స్, పుషప్స్
- నడుము సన్నబడటానికి, దృఢంగా మారడానికి హులా హూప్‌తో వ్యాయామం
- వారంలో నాలుగు రోజులు రన్నింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో సెషన్.

కాల్షియం కావాలా!

శరీరానికి అత్యవసరమైన ఖనిజం కాల్షియం. ఇది ఎముకలు, దంతాలు, గోళ్లను బలంగా ఉంచుతుంది. కండరాల సంకోచం, నరాల పనితీరుకు సహకరిస్తుంది. ఇలా ఎన్నో ప్రయోజనాలను అందించే కాల్షియం పూర్తి స్థాయిలో శరీరానికి అందాలంటే ఎటువంటి ఆహారం తీసుకోవాలో చూద్దాం!

తాజా కూరగాయలు: దాదాపు అన్ని ఆకు కూరలు, కూరగాయల్లో ఎంతో కొంత కాల్షియం ఉంటుంది. కాలానుగుణంగా లభించే తాజా కూరగాయలను ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం లభిస్తుంది.

నారింజ: ఇందులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. రోజుకు కనీసం ఒక నారింజనైనా తింటూవుంటే ఎముకల మధ్య ఉండే కార్టిలేజ్ గట్టిపడుతుంది. కీళ్ల వాతం రాకుండా ఉంటుంది.

బ్రకోలీ: ఇందులో కాల్షియంతోపాటు కె విటమిన్ కూడా ఉంటుంది. బ్రకోలీని వారానికి రెండుసార్లు తింటే ఎముకల్లో సాంద్రతను తగ్గించే వ్యాధులు రాకుండా ఉంటాయి. కీళ్ల అరుగుదలను నివారిస్తుంది.



నువ్వులు: నువ్వులను కూరల్లో, సలాడ్స్‌లో, స్వీట్లలో భాగంగా చేర్చి తింటూవుంటే శరీరంలో కాల్షియం లోపం అనేదే ఉండదు. బెల్లంతో కలిపి చేసే నువ్వుండలు పిల్లలకు మంచి పౌష్టికాహారం. ప్రతిరోజూ ఒక చెంచా మోతాదులో నువ్వులు తినడం మంచిది.

బాదాం: ప్రతిరోజూ బాదాంలను మంచి నీళ్లలో నానబెట్టి తింటూ ఉంటే శరీరానికి కావాల్సిన కాల్షియం మోతాదు మొత్తం అందుతుంది. కాబట్టి మిగిలిన ఆహార పదార్థాలు తీసుకొనేటప్పుడు వాటి నుంచి లభించే కాల్షియం పరిమాణాన్ని గమనించుకోవాలి.

చియా గింజలు: వీటిలో కూడా కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. వీటిని నీటిలో వేయగానే బాగా ఉబ్బి రుచికరంగా మారతాయి. ఓట్స్, పెరుగు, స్మూతీస్, యోగర్ట్‌తో చేర్చి చియా గింజలను తీసుకోవచ్చు.

సోయా: పాలలో కాల్షియం ఉంటుందని అందరికీ తెలుసు. కానీ పాలు, పాల పదార్థాలు తీసుకోవడం ఇష్టం లేనివారికి సోయా పాలు, సోయా టోఫు మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు.

'డాకు మహారాజ్'గా బాలకృష్ణ



నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం పేరు 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకొని, సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. శుక్రవారం ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించి, టీజర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి 'డాకు మహారాజ్' అనే టైటిల్‌ని పెట్టారు. టైటిల్‌కి తగ్గట్టుగానే టీజర్ అద్భుతంగా ఉంది. 'ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది. మరణాన్ని వణికించిన మహారాజుది' అంటూ 'డాకు మహారాజ్'గా బాలకృష్ణను పరిచయం చేసిన తీరు అదిరిపోయింది. మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో గుర్రంపై బాలకృష్ణ ఎంట్రీ ఇచ్చారు. టీజర్‌లోని ప్రతి ఫ్రేమ్‌లో భారీతనం కనిపిస్తుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తమన్ నేపథ్య సంగీతం టీజర్‌ని మరోస్థాయికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ 'టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. మీరు చూసిన టీజర్‌లో డూపులు లేరు. బాలకృష్ణనే నిజంగా చేశారు. గుర్రం ఎక్కింది ఆయనే, నడిపింది ఆయనే, యుద్ధానికి వచ్చేది కూడా ఆయనే. మీరు చూసినవన్నీ ఒరిజినల్ షాట్స్, తమన్ అద్భుతమైన సంగీతం అందించారు' అని అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'బాలకృష్ణని చాలా కొత్తగా చూపించాలని నేనూ, దర్శకుడు బాబీ ముందు నుంచి అనుకుంటున్నాం. టీజర్‌లో మీరు చూసింది చాలా చిన్నది. సినిమాలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి' అని అన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'బాబీ చాలా గొప్ప సినిమా తీశారు. బాలయ్యతో ఇది నా ఐదో సినిమా. ఆయనతో పని చేయడం సంతోషంగా ఉంది' అని అన్నారు. 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

మ్యూజిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా

- తమన్



సంగీత దర్శకుడు తమన్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గా 'పుష్ప-2' బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనుల్ని పూర్తి చేశారు. ప్రస్తుతం 'ఓజీ, రాజాసాబ్, గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్' వంటి చిత్రాలతో తమన్ ఫుల్ బిజీగా ఉన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలు...

- ఒకప్పుడు రొటీన్ చిత్రాలు వచ్చేవి. కానీ ఇప్పుడు డిఫరెంట్ కథలు, రకరకాల కాన్సెప్ట్‌లు వస్తున్నాయి. కాబట్టి డిఫరెంట్ మ్యూజిక్ ఇస్తున్నాను. 'తెలుసు కదా', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' ఇలా దేనికవే డిఫరెంట్‌గా ఉన్నాయి.
- 'డాకు మహారాజ్' చిత్రంలో మూడు పాటలే ఉంటాయి. 'గేమ్ ఛేంజర్'లో ఏడు పాటలు ఉంటాయి. ఏడు సంవత్సరాల తర్వాత శంకర్ ఒక ప్రాపర్ కమర్షియల్ మూవీ చేస్తున్నారు. 15 రోజుల్లో 'పుష్ప-2' సినిమా కంప్లీట్ చేయమన్నారు. అది సాధ్యం కాదు. అందుకే నాకున్న టైమ్‌లో ఫస్ట్ హాఫ్‌ను దాదాపుగా కంప్లీట్ చేశాను.
- ఏ.ఆర్.రెహ్మాన్ స్థాయికి వెళ్లాలి అనేది నా కల. 'బాయ్స్' టైమ్‌లో డైరెక్టర్ శంకర్ నాలో యాక్టర్‌ని చూశారు. నేను మంచి మ్యూజిక్ డైరెక్టర్‌ని అని గుర్తించేందుకు ఇన్నేళ్లు పట్టింది. ఒకప్పుడు మూస ధోరణిలో ఉన్న సినిమాలకు కంటే న్యూగా మ్యూజిక్ ఇస్తూ వచ్చాను. ఆ టైమ్‌లో కాపీ క్యాట్, కాపీ గోట్ అని ట్రోల్ చేశారు. మళ్లీ అలాంటి చిత్రాలను సెలెక్ట్ చేసుకోవడం లేదు.
- మ్యూజిక్ స్కూల్ నిర్మించాలని నా కోరిక. మూడేళ్లలో వరల్డ్‌క్లాస్ స్కూల్‌ని హైదరాబాద్‌లో కడతాను. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా సంగీతం నేర్పించాలని అనుకుంటున్నాను. మ్యూజిక్ ఉన్న చోట క్రైమ్ రేట్ తక్కువగా ఉంటుంది. నేను క్రికెట్ ఆడి వస్తే... వెంటనే ఓ ట్యూన్ వస్తుంది. క్రికెట్ ఆడటంలో నాకు చాలా ఆనందం ఉంది.

సూర్య కెరీర్‌లో అత్యధిక వసూళ్లు




- నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా

దర్శకుడు శివ, హీరో సూర్య కాంబినేషన్‌లో తెరకెక్కిన మూవీ 'కంగువ'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా మంచి ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ నేపథ్యంలో 'కంగువ' సక్సెస్ గురించి చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మీడియాతో మాట్లాడుతూ 'మేము పడిన మూడేళ్ల కష్టానికి ఫలితంగా ప్రేక్షకులు ఘన విజయాన్ని అందించారు. మంచి చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల టేస్ట్ మరోసారి వెల్లడైంది. 'తమిళ్' కంటే తెలుగులో 'కంగువ'కు కలెక్షన్స్ వస్తున్నాయి. ఇప్పటి వరకు సూర్య సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'కంగువ' నిలుస్తుంది. 'కంగువ-2' సినిమాలో దీపిక పదుకొనేను హీరోయిన్‌గా తీసుకుంటున్నామనే వార్తలో నిజం లేదు. ఇంకా ఆ మూవీ వర్క్ స్టార్ట్ చేయలేదు. సూర్య చేసిన డిఫరెంట్ రోల్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది" అని అన్నారు

అభ్యుదయ వాది.. ఎందరికో మార్గదర్శి!

తాతినేని ప్రకాశరావు శత జయంతి సంవత్సరం పూర్తి



తెలుగు సినిమా స్వర్ణయుగానికి చెందిన దర్శకుల్లో ఒకరు, ఉత్తమాభిరుచితో విజయవంతమైన చిత్రాలను అందించిన వ్యక్తి తాతినేని ప్రకాశరావు. కృష్ణాజిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో 1924 నవంబర్ 16న జన్మించిన ప్రకాశరావు ప్రజానాట్యమండలి కళాకారుడు. అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. నికార్సయిన కమ్యూనిస్ట్. సినిమాల ద్వారా తన భావాలను ప్రజలకు చెప్పాలనీ, వారిని చైతన్యవంతుల్ని చేయాలనే ఉద్దేశంతో 1947లో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎల్వీ ప్రసాద్ దగ్గర శిష్యుడిగా చేరి 'ద్రోహి', 'మనదేశం' చిత్రాలకు పని చేశారు. ఆ తర్వాత విజయా సంస్థలోని దర్శకత్వ శాఖలో చేరారు. 'పాతాళభైరవి', 'పెళ్లి చేసి చూడు' చిత్రాలకు పని చేశారు. 'పెళ్లి చేసి చూడు' చిత్రానికి పని చేస్తున్న సమయంలోనే 'పల్లెటూరు' (1952) చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. ఇక అప్పటి నుంచి 30 ఏళ్ల పాటు దర్శకుడిగా, నిర్మాతగా ప్రకాశరావు సినీజీవితం విజయవంతంగా సాగింది. రాశి కంటే వాసికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ 30 ఏళ్ల కాలంలో కేవలం 30 చిత్రాలు మాత్రమే రూపొందించగలిగారు ప్రకాశరావు. ఇందులో తెలుగు చిత్రాలే కాదు తమిళ, హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. కుటుంబ సంబంధాలకు, ఆ నాటి సమాజంలోని సమస్యలకు అద్దం పట్టిన చిత్రాలనే ఎక్కువగా ఆయన రూపొందించారు. అందుకే ఆయన సామాన్య ప్రేక్షకుడికి దగ్గర కాగలిగారు. తను అనుకున్న లక్ష్యం సాధించగలిగారు. ప్రకాశరావు దర్శకత్వం వహించిన చిత్రాలు అధిక శాతం విజయం సాధించడం గమనార్హం. శనివారంతో ప్రకాశరావు శత జయంతి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఆయన సినీ జీవిత చిత్రంలోని కొన్ని రీళ్లు..

- తాతినేని ప్రకాశరావు దర్శకత్వం వహించిన రెండో చిత్రం 'పిచ్చిపుల్లయ్య'. ఇది నిర్మాతగా ఎన్టీఆర్‌కు తొలి సినిమా కావడం విశేషం. మాస్ హీరోగా ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తి విభిన్నంగా ఉండే పల్లెటూరి రైతు పాత్రను ఎన్టీఆర్ ఇందులో పోషించడం విశేషం.
- ఆ రోజుల్లోనే ఆయన మల్టీస్టారర్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. - ఎన్టీఆర్, ఏయన్నార్ కలసి నటించిన రెండు చిత్రాలు 'చరణదాసి', 'పరివర్తన' తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో రూపుదిద్దుకున్నాయి. 'చరణదాసి' చిత్రంలోని ఓ స్వప్న సన్నివేశంలో ఎన్టీఆర్ శ్రీరాముడిగా, అంజలీదేవి సీతగా కనిపిస్తారు. ఎన్టీఆర్ తొలిసారిగా శ్రీరాముడి గెటప్ వేసుకుంది ఈ చిత్రంలోనే. అలాగే 'పరివర్తన' చిత్రంలో ఏయన్నార్ హీరో అయితే, విలన్‌గా ఎన్టీఆర్ నటించడం మరో విశేషం. ఇందులో అక్కినేనికి చెల్లెలిగా, ఎన్టీఆర్‌కు భార్యగా సావిత్రి నటించారు.
- హిందీలో దాదాపు పది చిత్రాలకు దర్శకత్వం వహించారు ప్రకాశరావు. తెలుగు, తమిళ సినిమాల జోలికి పోకుండా ఆయన ఎనిమిదేళ్ల పాటు హిందీ చిత్రాల మీదే దృష్టి పెట్టడం గమనార్హం.
- ముగ్గురు ముఖ్యమంత్రులు ఎమ్జీఆర్, ఎన్టీఆర్, జయలలితలను డైరెక్ట్ చేసిన ఘనత తాతినేని ప్రకాశరావుదే.
- ఎన్టీఆర్‌ను 'బావగారు' అని పిలిచేవారు ప్రకాశరావు. ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు మద్దతు పలికారు. తెలుగుదేశం పార్టీకి కోశాధికారిగా వ్యవహరించిన ప్రకాశరావు ఒక దశలో ఎన్టీఆర్‌తో విభేదించి, ఆయనకు వెన్నుపోటు పొడిచిన నాదెళ్ల భాస్కరరావుకు మద్దతు పలకడం ఆసక్తికర పరిణామం.
- ప్రకాశరావు తనయుడు ప్రసాద్ కూడా దర్శకుడై తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు. ప్రసాద్ కుమారుడు సత్య కూడా దర్శకుడిగా మారడం గమనార్హం. ఇలా ఒకే కుటుంబంలో మూడు తరాలకు చెందిన వాళ్లు దర్శకులు కావడం అరుదైన విషయమే.

రాజీ కోసం ప్రయత్నించండి

చెన్నై కోర్టు సూచన



తన భార్య ఆర్తి నుంచి విడాకులు కోరుతూ తమిళ హీరో జయం రవి దాఖలు చేసిన విడాకుల పిటిషన్ శుక్రవారం చెన్నై ఫ్యామిలీ కోర్టులో విచారణకు వచ్చింది. ఆ సమయంలో కోర్టుకు జయం రవి నేరుగా హాజరు కాగా, ఆర్తి మాత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులోకి వచ్చారు. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన న్యాయస్థానం.. రాజీ కోసం మరోసారి ఇద్దరూ కలిసి మాట్లాడుకోవాలని, ఇందుకోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయించాలని సూచించింది. అంతేగాక కచ్చితంగా విడిపోవాలని నిర్ణయించుకుంటే అందుకు స్పష్టమైన కారణం చూపాలని పేర్కొంది.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

రానా సెలబ్రిటీ షో



సెలబ్రిటీల జీవితాల్లో ఎవరికీ తెలియని కోణాలను ఆవిష్కరించే వెబ్ సిరీస్ 'ద రానా దగ్గుబాటి షో' ఈనెల 23 నుంచి ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. రామానాయుడు స్టూడియోలో శుక్రవారం ఈ 'షో'కు సంబంధించిన ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. స్పిరిట్ మీడియా బేనర్‌పై రానా నిర్మించి హోస్ట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఈ షో ఎనిమిది ఎపిసోడ్లు ఉంటుంది. 240 దేశాల్లో ప్రైమ్ వీడియో ద్వారా స్ట్రీమింగ్ అవుతుంది. ఇది పూర్తిగా అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ సిరీస్' అని తెలిపారు.

బిజినెస్

పెళ్లిళ్ల ఖర్చులకు రుణాలు

మ్యాట్రిమోని.కామ్

చెన్నై: పెళ్లిళ్లు కుదర్చడమే కాదు. ఆ పెళ్లిళ్లకు అయ్యే ఖర్చులకూ రుణాలు ఇస్తామంటోంది ప్రముఖ మ్యాచ్‌మేకింగ్ సేవల సంస్థ మ్యాట్రిమోని.కామ్. ఇందుకోసం ఏకంగా వెడ్డింగ్‌లోన్స్.కామ్ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించింది. ఈ రుణాల కోసం ఐడీఎఫ్‌సీ, టాటా క్యాపిటల్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. తమ ద్వారా రుణాలు తీసుకునే జంటలకు వెడ్డింగ్ ప్లానింగ్, బడ్జెట్, వీలైనంత తక్కువ ఖర్చుతో పెళ్లి తంతు ముగిసేందుకు అవసరమైన సేవలు, వారి ఆర్థిక భద్రతకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా ఇస్తామని కంపెనీ సీఈఓ జానకీరామన్ తెలిపారు.

యూనిఫై అసెట్ మేనేజ్‌మెంట్‌కు సెబీ ఆమోదం

చెన్నై: యూనిఫై క్యాపిటల్ పూర్తి అనుబంధ విభాగమైన యూనిఫై అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్.. మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నుంచి అమోదం తెలిపింది. పోర్ట్‌ఫోలియో మేనేజర్‌గా 2001లో ప్రస్థానాన్ని ప్రారంభించిన యూనిఫై క్యాపిటల్ ఈ అక్టోబరు 31 నాటికి ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియోల్లో మొత్తం రూ.27,000 కోట్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది.

మరింత తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబై: ఈనెల 8తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు మరో 647.7 కోట్ల డాలర్లు తగ్గి 67,565.3 కోట్ల డాలర్లకు పడిపోయినట్లు ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 267.5 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. సెప్టెంబరు చివర్లో 70,488.5 కోట్ల డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసిన ఫారెక్స్ నిల్వలు.. గత కొన్ని వారాలుగా మళ్లీ తగ్గుతూ వచ్చాయి.

మార్కెట్ దారెటు..?

ఇప్పటికే 10 శాతం పతనమైన సూచీలు .. మున్ముందు మరింత క్షీణించేనా..?

మళ్లీ పుంజుకునే సమయం వచ్చేసిందా..?



మన స్టాక్ మార్కెట్ పతనం ఎందాకా..? ప్రస్తుతం ఈక్విటీ మదుపరుల మదిని తొలచి వేస్తున్న ప్రశ్న ఇదే. ఎందుకంటే, రెండు నెలల క్రితం వరకు అలుపెరుగని పరుగులో రోజుకో రికార్డు సృష్టించిన సెన్సెక్స్, నిఫ్టీ.. అనూహ్యంగా తిరోగమన బాట పట్టాయి. ఎంత వేగంగా ఎగబాకాయో.. అంతే త్వరగా జారుకుంటున్నాయి. సూచీలకు పట్టు దొరికేదెప్పుడు...? మళ్లీ ఎగిసేదెప్పుడు..? అని ఇన్వెస్టర్లు నిశితంగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

మార్కెట్ మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చు. ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు ప్రస్తుత స్థాయిలో కొనసాగితే ఈ ఏడాది చివరినాటికి నిఫ్టీ మరో 10 శాతం మేర క్షీణించే ప్రమాదం ఉంది.
- జై బాల, క్యాష్‌దికాఓస్.కామ్

ముంబై: ఈ ఏడాది సెప్టెంబరు 27న నమోదైన సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే, స్టాక్ మార్కెట్ సూచీలు ఇప్పటికే 10 శాతానికి పైగా క్షీణించాయి. సెన్సెక్స్ 8,400 పాయింట్లు కోల్పోయి 77,580 వద్దకు, నిఫ్టీ 2,750 పాయింట్లు నష్టపోయి 23,532 వద్దకు జారుకున్నాయి. అంతేకాదు, దాదాపు రూ.50 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది. ఇందుకు కారణాలనేకం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, మార్కెట్లో చాలా కంపెనీల షేర్ల ధరలు సహేతుక స్థాయిని మించిపోవడం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత 6 వారాలుగా మన మార్కెట్లో పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడుతుండటం వంటి పరిణామాలు సూచీలను కుప్పకూల్చాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపర్చే అంశాలేమీ లేకపోవడంతో సూచీల పతనం ఇప్పట్లో ఆగకపోవచ్చని కొందరు ఈక్విటీ నిపుణులు అభిప్రాయపడగా.. మార్కెట్ ఇప్పటికే 10% దిద్దుబాటుకు లోనైనందున గతంలో లాగే వాల్యూ బైయింగ్‌తో సూచీలు మళ్లీ అప్‌టర్న్ తీసుకునే అవకాశాల్లేకపోలేవన్న అంచనాలూ వ్యక్తమవుతున్నాయి.

ఎందుకంటే.. 2022 సెప్టెంబరు, 2023 మార్చిలోనూ నిఫ్టీ 10% పతనమై మళ్లీ వెంటనే పుంజుకుంది. ప్రస్తుతం నిఫ్టీ 23,500 స్థాయిలో ట్రేడవుతోంది. ఈ స్థాయిలో నిలదొక్కుకోగలిగితే గనక సూచీ మళ్లీ ర్యాలీ తీయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ 23,500 స్థాయినీ కోల్పోతే, సూచీ క్రమంగా 23,000-22,500 స్థాయిల వరకు జారుకోవచ్చన్న అంచనాలున్నాయి.

మళ్లీ భారత్ పైకి సీఎల్ఎస్ఏ దృష్టి

అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. తన దృష్టిని చైనా నుంచి తిరిగి భారత్ పైకి మళ్లించింది. చైనాలో పెట్టుబడులను తగ్గించుకుని, భారత మార్కెట్లో పెట్టుబడుల కేటాయింపును 20 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో చైనా వాణిజ్యపరమైన సవాళ్లు ఎదుర్కోవచ్చన్న అంచనాల నేపథ్యంలో తన దృష్టిని భారత్ వైపు మళ్లించినట్లు తాజా నివేదికలో పేర్కొంది. గత నెల తొలివారంలో చైనా ఆర్థిక వ్యవస్థకు, స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేందుకు భారీ ఉద్దీపన చర్యలు ప్రకటించింది. దాంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను భారత మార్కెట్ నుంచి చైనాకు తరలించారు. సీఎల్ఎస్ఏ సైతం భారత మార్కెట్ కేటాయింపులను 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించి, చైనా మార్కెట్ కేటాయింపులను 5 శాతానికి పెంచింది. కానీ, ట్రంప్ విజయం అనంతరం సీఎల్ఎస్ఏ మళ్లీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.

అక్టోబరు నుంచి ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు మన మార్కెట్ నుంచి రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. మున్ముందు మరిన్ని పెట్టుబడులను తరలించే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనూ సీఎల్ఎస్ఏ తన వైఖరిని మార్చుకోవడం గమనార్హం. చైనా ఇప్పటికే ప్రతి ద్రవ్యోల్బణం, యువతలో పెరుగుతున్న నిరుద్యోగత, స్థిరాస్తి రంగంలో సంక్షోభం వంటి సమస్యలు ఎదుర్కొంటోందని.. ఇందుకు తోడు ట్రంప్ 2.0 పాలనలో చైనా ఎగుమతులపై ఆంక్షలు పెరిగే అవకాశాలున్నాయని ఈ బ్రోకరేజీ సంస్థ భావిస్తోంది. ఇక భారత్ విషయానికొస్తే, ట్రంప్ వాణిజ్య విధానాలు పెద్దగా ప్రభావం చూపేందుకు అవకాశాల్లేని మార్కెట్లలో భారత్ ఒకటని సీఎల్ఎస్ఏ భావిస్తోంది. అంతేకాదు, డాలర్ క్రమంగా పుంజుకుంటున్న తరుణంలో ముడి చమురు ధరలు స్థిరంగా కొనసాగినంత వరకు భారత విదేశీ మారక నిల్వలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంటోంది.

స్వల్పకాలంపాటు సూచీలు మరింత క్షీణించే అవకాశాలున్నాయి. నిఫ్టీకి 23,000-22,500 స్థాయిలో గట్టి మద్దతు కన్పిస్తోంది. ఒకవేళ సూచీ ఏడాది చివరి నాటికి ఈ స్థాయికి జారితే దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లకు పాల్పడవచ్చు. ప్రస్తుతం తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులూ కొత్త ఏడాదిలో మళ్లీ భారత బాట పట్టవచ్చు.
- సునీల్ సుబ్రమణియమ్, మార్కెట్ నిపుణులు

మార్కెట్ ఇప్పటికే సహేతుక స్థాయికి దిగివచ్చిన నేపథ్యంలో సూచీలు మళ్లీ పుంజుకునేందుకు అవకాశాల్లేకపోలేవు. అయితే, భవిష్యత్ ర్యాలీలో మదుపరులు మెరుగైన వృద్ధి అవకాశాలున్న రంగాలు, కంపెనీల షేర్లను ఎంచుకోవడం మేలు.
- వీకే విజయ్ కుమార్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,760 ▲	69,450 ▲	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	91
కర్నూలు	90	నెల్లూరు	91
విశాఖపట్నం	103	అనంతపురం	91
గోదావరి	109		

వాహన రంగానికి పండగ కళ

అమ్మకాల్లో 12 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ రంగానికి పండగల సీజన్ బాగా కలిసొచ్చింది. 42 రోజుల పాటు సాగిన పండగల సీజన్‌లో ఆటోమొబైల్ కంపెనీలు 42,88,248 వాహనాలు విక్రయించాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో విక్రయించిన 38,37,040 యూనిట్లతో పోల్చితే అమ్మకాలు 12 శాతం పెరిగినట్లు భారత ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) తెలిపింది. ఇదే కాలంలో ప్రయాణికుల వాహనాల అమ్మకాలు 7 శాతం పెరిగి 5,63,059 యూనిట్ల నుంచి 6,03,009 యూనిట్లకు పెరిగాయి. ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్లు కూడా 14 శాతం పెరిగి 29,10.141 యూనిట్ల నుంచి 33,11,325 యూనిట్లకు చేరాయి.

మార్కెట్లో అందుబాటులో ఉన్న అసాధారణ డిస్కౌంట్లు, కొంతకాలం పాటు కొనసాగిన నిస్తేజం అనంతరం డిమాండులో పునరుజ్జీవం విక్రయాలు పెరగడానికి దోహదపడ్డాయని పేర్కొంది. ప్రధానంగా నవరాత్రి సమయంలో అధిక సంఖ్యలో వాహనాలు విక్రయించగలిగామని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. అకాల వర్షాలు సృష్టించిన అలజడి గనుక లేకపోయి ఉంటే తాము 45 లక్షల అమ్మకాల మైలురాయిని అధిగమించే వారమన్నారు. అయితే వాస్తవ ఇన్వెంటరీ గణాంకాలు ఈ నెలాఖరుకు తెలుస్తాయని ఫాడా తెలిపింది.

మెర్సిడెస్ కార్ల ధరలు 3% పెంపు

న్యూఢిల్లీ: పెరిగిన ఉత్పత్తి వ్యయాలు, నిర్వహణ వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిడుల కారణంగా తమ కార్ల ధరలు మూడు శాతం పెంచుతున్నట్లు జర్మన్ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ప్రకటించింది. వచ్చే జనవరి 1వ తేదీ నుంచి ఈ పెంపు వర్తిస్తుంది. ఈ ధరల పెంపుతో జీఎల్‌సీ మోడల్ కారు ధర రూ.2 లక్షలు కనిష్ఠంగా పెరుగుతుంది. మేబాక్ ఎస్ 860 లగ్జరీ లిమోసిన్ ధర గరిష్ఠంగా రూ.9 లక్షల మేరకు పెరుగుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. గత మూడు త్రైమాసికాలుగా ద్రవ్యోల్బణ ఒత్తిడులున్నప్పటికీ పెరిగిన నిర్వహణ వ్యయాలను తామే భరిస్తూ వచ్చామని, ఇప్పుడు ఆ భారం కస్టమర్లకు పంచక తప్పడంలేదని మెర్సిడెస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు.

ఆడి క్యూ7 బుకింగ్స్ షురూ: ఆడి ఇండియా.. సరికొత్త ఆడి క్యూ7 బుకింగ్స్‌ను ప్రారంభించింది. 3 లీటర్ వీ 6 టీఎఫ్ఎస్ఐ ఇంజన్‌తో కూడిన ఈ కారును ఈ నెల 28న మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఆడి ఇండియా వెబ్‌సైట్, మై ఆడి కనెక్ట్ యాప్ ద్వారా రూ.2 లక్షలు చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని ఆడి వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అదనపు సర్వీసులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శీతాకాల సర్వీసుల్లో భాగంగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నుంచి అదనపు సర్వీసులను ప్రకటించింది. దీంతో ఈ మూడు నగరాల నుంచి వారంలో నడిచే సర్వీసుల సంఖ్య 173 నుంచి 250కి పెరిగాయి. సీజన్ మొత్తం మీద ఈ నగరాల నుంచి సర్వీసుల సంఖ్య 45 శాతం పెరిగినట్టు కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అంకుర్ గార్గ్ చెప్పారు. కొత్తగా ప్రకటించిన సర్వీసుల్లో హైదరాబాద్-గ్వాలియర్ డైరెక్ట్ సర్వీస్, విశాఖపట్టణం-విజయవాడ సర్వీస్ ఉన్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు, కోచికి సర్వీసుల సంఖ్య పెంచారు. హైదరాబాద్ నుంచి 17 దేశీయ గమ్యాలు, సౌదీ అరేబియాలోని మూడు ప్రధాన విమానాశ్రయాలకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. అలాగే విజయవాడ నుంచి అంతర్జాతీయ గమ్యాలకు విమాన సర్వీసు నడుపుతున్న ఏకైక సంస్థ తమదేనని అంకుర్ గార్గ్ వెల్లడించారు.

రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు సెబీ ఝలక్

న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మరోసారి షాకిచ్చింది. రూ.26 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని 15 రోజుల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. లేకపోతే కంపెనీ ఆస్తులు, బ్యాంకు డిపాజిట్లను జప్తు చేస్తామని హెచ్చరించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల దారి మళ్లింపునకు సంబంధించి సెబీ గత నెలలో రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు రూ.25 కోట్ల జరిమానా విధించింది. కంపెనీ ఆ మొత్తాన్ని చెల్లించక పోవడంతో ఈ డిమాండ్ నోటీసు జారీ చేసింది.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● శనివారం 16 నవంబరు 2024

రోహిత్ మళ్లీ తండ్రయ్యాడు

ముంబై: భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తండ్రయ్యాడు. రోహిత్ భార్య రితిక సజ్దే శుక్రవారంనాడు మగ బిడ్డకు జన్మనిచ్చింది. రోహిత్ దంపతులకు ఇంతకు ముందు కూతురు ఉన్న సంగతి తెలిసిందే. భార్య ప్రసవ సమయం వల్ల జట్టుతోపాటు రోహిత్ ఆస్ట్రేలియా వెళ్లని సంగతి తెలిసిందే. దాంతో ఈనెల 22 నుంచి జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు రోహిత్ అందుబాటులో ఉండడని వార్తలొచ్చాయి. అయితే భార్య ప్రసవం కావడంతో ఇక రోహిత్ పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉండనున్నట్టు సమాచారం.

పట్నా పంజా

పీకేఎల్‌లో బెంగాల్ చిత్తు

నోయిడా: రైడింగ్ త్రయం దేవాంక్, అయాన్, సందీప్ చెలరేగడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో పట్నా పైరేట్స్ విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన పోరులో పట్నా 52-31 స్కోరు తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. దేవాంక్ 15, అయాన్ 11, సందీప్ 8 పాయింట్లు కొల్లగొట్టి పట్నాను గెలిపించారు. ఈ సీజన్‌లో దేవాంక్ ఓవరాల్‌గా తన పాయింట్ల సంఖ్యను 115కు పెంచుకోవడం విశేషం. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ 32-24తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది.

ఒకే క్యాలెండర్ ఏడాదిలో మూడు టీ20 శతకాలు బాదిన ఏకైక బ్యాటర్‌గా శాంసన్.

రెండు శాశ్వత సభ్య దేశాల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో రెండు సెంచరీలు నమోదవడం ఇదే తొలిసారి.

1

భారత్ తరపున టీ20ల్లో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం (210) నమోదు చేసిన తిలక్-శాంసన్

టీ20ల్లో రెండో అత్యధిక స్కోరు సాధించిన భారత్. ఈ ఏడాది అక్టోబరు 12న బంగ్లాదేశ్‌పై భారత్ అత్యధికంగా 297 పరుగుల స్కోరు చేసింది.

2

భారత్ తరపున రెండు వరుస టీ20 సెంచరీలు కొట్టిన రెండో బ్యాటర్‌గా తిలక్.

తమ టీ20ల్లో తొలి పది ఓవర్లలో రెండో అత్యధిక స్కోరు (129/1) సాధించిన భారత్. బంగ్లాదేశ్‌పై ఎక్కువ పరుగులు (152/1) చేసింది.



సంజూ శాంసన్ (56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 109 నాటౌట్)



తిలక్ వర్మ (47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సర్లతో 120 నాటౌట్)

అద్భుతం.. అపూర్వం. టీ20 మ్యాచ్‌లో ఒక సెంచరీయే అరుదనుకుంటే.. ఇక్కడ ఒకే ఇన్నింగ్స్‌లో రెండు నమోదయ్యాయి. ఓ వైపు తిలక్ వర్మ, మరో వైపు సంజూ శాంసన్ పూనకం వచ్చిన మాదిరి సఫారీ బౌలర్లపై విరుచుకుపడగా వాండరర్స్ మైదానంలో పరుగుల జడివానే కురిసింది. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై బౌండరీలు కొట్టడం ఇంత సులువా అన్నట్టుగా ఈ జోడీ చెలరేగింది. ఈ వీర బాదుడుతో తెలుగు తేజం తిలక్ వర్మ వరుసగా రెండో శతకం అందుకోగా.. శాంసన్ రెండు డకౌట్ల నుంచి తేరుకుని సిరీస్‌లో మరో సెంచరీతో దుమ్మురేపాడు. రెండో వికెట్‌కు 210 పరుగుల అజేయ భాగస్వామ్యంలో వీరు 19 సిక్సర్లు, 15 ఫోర్లు బాదడం విశేషం. అటు భారీ స్కోరును ఛేదించలేక దక్షిణాఫ్రికా సిరీస్‌ను సమర్పించుకుంది.

శతక తాండవం

తిలక్, శాంసన్ సెంచరీల మోత

3-1తో భారత్‌దే సిరీస్

నాలుగో టీ20లో 135 రన్స్‌తో దక్షిణాఫ్రికా చిత్తు

జొహన్నెస్‌బర్గ్: నాలుగు టీ20ల సిరీస్‌ను భారత్ అదిరిపోయే రీతిలో ముగించింది. యువ బ్యాటర్లు తిలక్ వర్మ (47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సర్లతో 120 నాటౌట్), సంజూ శాంసన్ (56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 109 నాటౌట్) అజేయ శతకాలతో మోత మోగించారు. అటు బౌలర్లు ఎప్పటిలాగే రాణించడంతో శుక్రవారం జరిగిన నాలుగో టీ20లో భారత్ 135 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 283 పరుగుల భారీ స్కోరు సాధించింది. అభిషేక్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 36) రాణించాడు. సిపామ్లకు ఏకైక వికెట్ దక్కింది. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 18.2 ఓవర్లలో 148 పరుగులకు కుప్పకూలింది. స్టబ్స్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 43), మిల్లర్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 36), జాన్సెన్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు మూడు, వరుణ్.. అక్షర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా.. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు.

పోరాటమే లేకుండా..

కళ్లముందు భారీ లక్ష్య ఛేదన ఉండడంతో సఫారీలు ఆరంభం నుంచే తడబడ్డారు. పేసర్లకు పిచ్ అనుకూలించడంతో చక్కటి స్వింగ్‌తో అర్ష్‌దీప్ చెలరేగాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్‌ను డకౌట్ చేయగా.. హార్దిక్ తర్వాతి ఓవర్‌లోనే రికెల్టన్ (1)పనిబట్టాడు. ఇక వరుస బంతుల్లో మార్‌క్రమ్ (8), క్లాసెన్ (0)లను అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో 10/4 స్కోరుతో సఫారీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయారు. ఆ తర్వాత స్టబ్స్, మిల్లర్ ఐదో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం అందించడం మినహా వీరి ఇన్నింగ్స్‌లో చెప్పుకోదగిందేమీ లేదు. 12వ ఓవర్‌లో మిల్లర్ 6,4,6తో బ్యాట్ ఝుళిపించి వరుణ్ చేతికి చిక్కగా.. తర్వాతి ఓవర్‌లోనే స్టబ్స్‌ను బిష్ణోయ్ అవుట్ చేయడంతో ఇక చేసేదేమీ లేకపోయింది. టెయిలెండర్లలో జాన్సెన్ భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు.

దుమ్మురేపిన తిలక్-శాంసన్

సిరీస్‌లో తొలిసారి టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. దీనికి తగ్గట్టుగానే ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఇన్నింగ్స్‌ను వాయువేగంతో ఆరంభించారు. ఆ తర్వాత తిలక్ వర్మ తానేం తక్కువ కాదన్నట్టు గత మ్యాచ్ ఫామ్‌ను ఈసారీ ప్రదర్శించాడు. దీంతో భారత్ స్కోరు ఆకాశమే హద్దుగా దూసుకెళ్లింది. ఆరంభంలో ఓపెనర్లు ప్రతీ బౌలర్‌ను వేటాడుతూ పరుగుల వరద పారించారు. తొలి ఓవర్‌లోనే అభిషేక్ క్యాచ్‌ను స్లిప్‌లో రీజా వదిలేశాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ అభిషేక్ ఐదో ఓవర్‌లో 6,6,4,6తో చెలరేగి 23 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో సిపామ్లకు చిక్కడంతో తొలి వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పవర్‌ప్లేలో దక్షిణాఫ్రికాపై టీమిండియాకు ఇది రెండో అత్యధిక స్కోరు. వన్‌డౌన్‌లో తిలక్ రాకతో సఫారీ బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. తొమ్మిదో ఓవర్‌లో అతను రెండు సిక్సర్లు బాదడంతో స్కోరు వంద పరుగులు దాటింది. అటు శాంసన్ సహజశైలిలో చెలరేగి పదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. తిలక్ సైతం ఇదే ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించడంతో 21 పరుగులు వచ్చాయి. పేసర్ సిపామ్లను లక్ష్యంగా చేసుకుని శాంసన్ రెండు, తిలక్ మరో సిక్సర్‌తో 20 పరుగులు రావడంతో 12వ ఓవర్‌లోనే జట్టు స్కోరు 160 దాటింది. ఇక మార్‌క్రమ్ ఓవర్‌లో అయితే తిలక్ వరుసగా 4,6,6,4తో 22 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ జోడీ ధాటికి ఆతిథ్య బౌలర్లకు ఎలా బంతులు వేయాలో కూడా అర్థం కాలేదు. ఇక, శాంసన్ 51 బంతుల్లో సిరీస్‌లో రెండో శతకం సాధించాడు. తన 95 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తిలక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర జాన్సెన్ వదిలేశాడు. దీంతో 40 బంతుల్లోనే తిలక్ కూడా వరుసగా రెండో సెంచరీని పూర్తి చేశాడు. 19వ ఓవర్‌లో తిలక్ 4,6,4తో దక్షిణాఫ్రికాలో అత్యధిక టీ20 స్కోరు (258)ను భారత్ దాటేసింది. ఆఖరి ఓవర్‌లో తిలక్ 4, శాంసన్ 6తో జట్టు 280+ స్కోరుతో అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (నాటౌట్) 109, అభిషేక్ (సి) క్లాసెన్ (బి) సిపామ్ల 36, తిలక్ (నాటౌట్) 120, ఎక్స్‌ట్రాలు: 18; **మొత్తం: 20 ఓవర్లలో 283/1; వికెట్ పతనం:** 1-73; **బౌలింగ్:** జాన్సెన్ 4-0-42-0; కొట్జీ 3-0-43-0; సిపామ్ల 4-0-58-1; సిమెలానె 3-0-47-0; కేశవ్ మహరాజ్ 3-0-42-0; మార్‌క్రమ్ 2-0-30-0; స్టబ్స్ 1-0-21-0.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 1, హెన్‌డ్రిక్స్ (బి) అర్ష్‌దీప్ 0, మార్‌క్రమ్ (సి) బిష్ణోయ్ (బి) అర్ష్‌దీప్ 8, స్టబ్స్ (ఎల్బీ) బిష్ణోయ్ 43, క్లాసెన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 0, మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 36, జెన్సన్ (నాటౌట్) 29, సిమెలానె (సి) బిష్ణోయ్ (బి) వరుణ్ 2, కొట్జీ (సి) శాంసన్ (బి) అక్షర్ 12, కేశవ్ (సి) తిలక్ (బి) అక్షర్ 6, సిపామ్ల (సి) అక్షర్ (బి) రమణ్‌దీప్ 3, ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 18.2 ఓవర్లలో 148 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-10, 4-10, 5-96, 6-96, 7-105, 8-131, 9-141, 10-148; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-20-3, హార్దిక్ 3-1-8-1, రమణ్‌దీప్ 3.2-0-42-1, వరుణ్ 4-0-42-2, రవి బిష్ణోయ్ 3-0-28-1, అక్షర్ 2-0-6-2.



అర్ష్‌దీప్ (3/20)

2 టీ20ల్లో వేగంగా (33 ఇన్నింగ్స్) మూడు శతకాలు సాధించిన రెండో బ్యాటర్‌గా శాంసన్. ఫిల్ సాల్ట్ (32 ఇన్నింగ్స్) ముందున్నాడు.

పాకిస్థాన్ పరువు పాయె!

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికల మీద భారత్‌పై దుష్ప్రచారం చేయడం.. ఆ క్రమంలో ప్రతీసారీ అభాసుపాలవడం.. ఇదీ పాకిస్థాన్ తీరు. అయినా ఆ దేశం మాత్రం తన వక్రబుద్ధిని మార్చుకోవడంలేదు. ఈసారి భారత్‌ను కవ్వించేందుకు చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఉపయోగించుకోవాలని చూసింది. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నమెంట్‌లో ఆడేందుకు పాకిస్థాన్ వెళ్లకూడదని భారత్ నిర్ణయించిన విషయం విదితమే. ఆ ఉక్రోషంతో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో టోర్నమెంట్ ట్రోఫీని ప్రదర్శించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయించింది. అయితే పీసీబీ చర్యను తీవ్రంగా ఆక్షేపించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) దృష్టికి తీసుకెళ్లింది. పాకిస్థాన్‌పై చర్యకు డిమాండ్ చేసింది. తక్షణమే స్పందించిన ఐసీసీ.. పీవోకేలో ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమాన్ని రద్దు చేసింది. దాంతో అంతర్జాతీయంగా పాకిస్థాన్ తన పరువు మరోసారి పోగొట్టుకుంది.

పీవోకేలో చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శనకు ఏర్పాట్లు

- భారత క్రికెట్ బోర్డు అభ్యంతరం
- ఐసీసీ దృష్టికి పీసీబీ కవ్వింపు చర్య
- స్పందించిన ఐసీసీ
- ట్రోఫీ ప్రదర్శన రద్దు



విషయమేమిటంటే..

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమివ్వాలి. అయితే 2008 నుంచి పాక్‌లో ఆడేందుకు నిరాకరిస్తున్న భారత జట్టు ఈసారి అదే పంథాను కొనసాగిస్తూ చాంపియన్స్ ట్రోఫీలో తలపడేందుకు ఆ దేశం వెళ్లబోమని స్పష్టంజేసింది. దీంతో టోర్నీని హైబ్రిడ్ విధానంలో అంటే..భారత్ ఆడే మ్యాచ్‌లను వేరే దేశంలో నిర్వహించాలని ఐసీసీ ప్రతిపాదించింది. కానీ పీసీబీ టోర్నీ ఆసాంతం తమ దేశంలోనే నిర్వహించాలని పట్టుబడుతోంది. ఫలితంగా..చాంపియన్స్ ట్రోఫీని దక్షిణాఫ్రికాకు మార్చాలని ఐసీసీ యోచిస్తోంది. ఈక్రమంలో టోర్నీపై ఐసీసీ ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. అలాగే గత సోమవారం లాహోర్‌లో ధూం..ధాంగా నిర్వహించాల్సిన టోర్నీ ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమాన్ని కూడా ఐసీసీ అనూహ్యంగా వాయిదా వేసింది. టోర్నీ షెడ్యూల్‌ను కూడా ఐసీసీ ప్రకటించలేదు. మరోవైపు.. ఐసీసీని సంప్రదించకుండా టోర్నీని తమ దేశంలోని పలు నగరాల్లో ప్రదర్శించే షెడ్యూల్ (నవంబరు 16-24)ను పీసీబీ ఏకపక్షంగా ఖరారు చేసింది. శనివారం లాహోర్‌లో ఈ కార్యక్రమం మొదలవ్వాల్సి ఉంది. తమ దేశంలోని వివిధ నగరాలతోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని స్కర్దు, ముర్రే, హుంజా, ముజఫరాబాద్‌లలో కూడా ట్రోఫీని ప్రదర్శించనున్నట్టు పీసీబీ వెల్లడించడం బీసీసీఐకి ఆగ్రహం తెప్పించింది. తమ దేశంలో ఆడేందుకు నిరాకరించడంతో కవ్వింపు చర్యల్లో భాగంగా పీసీబీ ఈ చర్య చేపట్టిందని బీసీసీఐ ఆక్షేపించింది. పాకిస్థాన్ చర్యను ఖండించిన బీసీసీఐ కార్యదర్శి జై షా.. ఐసీసీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. 'ఐసీసీ పెద్దలతో బీసీసీఐ కార్యదర్శి మాట్లాడారు. పాక్‌పై కఠిన చర్య తీసుకోవాలని గట్టిగా కోరారు. ఇస్లామాబాద్‌లో ట్రోఫీని ప్రదర్శించడంపై అభ్యంతరం లేదు. కానీ పీవోకేలో ప్రదర్శించనుండడంపైనే మా అభ్యంతరం' అని బీసీసీఐ అధికారి శుక్రవారం తెలిపారు. బీసీసీఐ ఆక్షేపణతో పీవోకేలో ట్రోఫీ ప్రదర్శనను ఐసీసీ రద్దు చేసింది. ఒకవేళ ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ వదులుకుంటే, టోర్నీని భారత్‌లో నిర్వహించేందుకూ ఐసీసీ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

ఎందుకు వెళ్లరో..రాత పూర్వకంగా ఇవ్వండి!

చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్‌కు భారత జట్టును ఎందుకు పంపడంలేదో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని బీసీసీఐని ఐసీసీ కోరినట్టు తెలిసింది. పాక్ వెళ్లబోమని ఐసీసీకి బీసీసీఐ ఇప్పటికే చెప్పేసింది. ఇదే విషయాన్ని పీసీబీకి ఐసీసీ చేరవేసింది. కానీ బీసీసీఐ నిర్ణయాన్ని తెలియజేసే లేఖను తమకు అందజేయాలని ఐసీసీని పీసీబీ అడిగిందట. దీంతో తమ నిర్ణయాన్ని రాత పూర్వకంగా తెలియజేయాలని బీసీసీఐకి ఐసీసీ సూచించినట్టు తెలిసింది.

ఐసీసీ టోర్నీల బహిష్కరణకు పాక్..?

భారత్ తమ దేశానికి రాని పక్షంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. భారత్ పాల్గొనే ఐసీసీ ఈవెంట్లతో పాటు భారత్ వేదికగా జరిగే ఏ టోర్నీలోనూ పాక్ పాల్గొనకూడదని పీసీబీ నిర్ణయించనున్నదట.

టోర్నీ నిర్వహణకు మూడు ప్రత్యామ్నాయాలు..

చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ సందిగ్ధంలో పడిన తరుణంలో.. పీసీబీ మాజీ చీఫ్ నజామ్ సేథీ మూడు ప్రత్యామ్నాయాలను ఐసీసీకి సూచించినట్టు తెలిసింది.

- మొదటిది హైబ్రిడ్ విధానంలో జరపడం. ఈ పద్ధతిలో భారత్ మ్యాచ్‌లను వేరే చోట నిర్వహిస్తారు. గతంలో సేథీ పీసీబీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆసియా కప్‌ను ఈ విధానంలో నిర్వహించారు. అప్పుడు భారత్ తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడింది.
- రెండోది.. టోర్నీని వేరే దేశానికి తరలించడం. అప్పుడు టోర్నీని బహిష్కరించడం, లేదంటే తరలించిన దేశంలో ఆడడం పాకిస్థాన్‌కు ఉండే ప్రత్యామ్నాయంగా సేథీ పేర్కొన్నారు. కానీ హైబ్రిడ్ పద్ధతిని తిరస్కరించిన పాక్ వేరే వేదికలో ఆడుతుందా అన్నది ప్రశ్న.
- ఇక..భావోద్వేగాలతో కాకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవడమే మేలని మూడో ప్రత్యామ్నాయంగా పాకిస్థాన్‌కు సేథీ సూచించారు.

రషీద్ డబుల్

- కరణ్ శతకం
- ఆంధ్ర 448/9
- హైదరాబాద్‌తో రంజీ



రషీద్ (203)

హైదరాబాద్ : టాపార్డర్ బ్యాటర్లు రషీద్ (203), కరణ్ షిండే (109) శతకాలతో కదం తొక్కడంతో హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర 147 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రషీద్, షిండే మూడో వికెట్‌కు 236 పరుగులు జోడించారు. దాంతో 168/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర ఆట ఆఖరికి 448/9 స్కోరుతో నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సరికి సందీప్ (33), లలిత్ మోహన్ (0) క్రీజులో ఉన్నారు. అనికేత్ నాలుగు, మిలింద్, రక్షణ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు. హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్‌లో 301 పరుగులు చేసింది.

రన్నరప్ ప్రజ్ఞానంద

హారికకు ఐదు, అర్జున్‌కు ఆరో స్థానం

టాటా స్టీల్ చెస్ విజేతలు కార్ల్‌సన్, గోర్యాచ్కినా



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్‌లో ఆరంభ రౌండ్లలో అదరగొట్టిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి చివరికొచ్చేసరికి నిరాశపరిచాడు. శుక్రవారం ముగిసిన ర్యాపిడ్ విభాగం ఓపెన్ కేటగిరిలో మొత్తం 9 రౌండ్లకు గాను 3.5 పాయింట్లు సాధించిన అర్జున్.. ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి విజేతగా నిలిచాడు. ఇక, భారత్‌కు చెందిన ప్రజ్ఞానంద, వెస్లీ సో (అమెరికా) చెరో 5.5 పాయింట్లతో సమంగా నిలిచినా.. సూపర్ టైబ్రేక్‌లో మెరుగైన స్కోరుతో ప్రజ్ఞానంద రెండోస్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. వెస్లీ మూడోస్థానంతో సరిపెట్టుకున్నాడు. మహిళల టైటిల్‌ను రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గోర్యాచ్కినా దక్కించుకుంది. గోర్యాచ్కినా మొత్తం 9 రౌండ్లకు 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నానా జాగ్నిజె (జార్జియా) 5.5 పాయింట్లతో రన్నరప్‌గా నిలవగా, భారత అమ్మాయి వంతికా అగర్వాల్ (5) మూడో స్థానం దక్కించుకుంది. ద్రోణవల్లి హారిక 4.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలవగా.. హంపి కేవలం 3 పాయింట్లతో ఆఖరిదైన పదో స్థానానికి పరిమితమైంది. దివ్యా దేశ్‌ముఖ్ (3.5), వైశాలి (3.5) ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచారు.

ఐపీఎల్ వేలం బరిలో 13 ఏళ్ల వైభవ్

మొత్తం 574 మంది క్రికెటర్లు

366 మంది భారతీయులు



న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలం జాబితా ఖరారైంది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే ఈ వేలంలో మొత్తం 574 మంది క్రికెటర్లు బరిలో నిలిచారు. టీమిండియా స్టార్లు రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్ 2 కోట్ల రూపాయల బేస్ ధరతో వేలానికే ప్రధాన ఆకర్షణ కానున్నారు. 13 ఏళ్ల భారత్ అండర్-19 క్రికెటర్, బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ వేలంలో నిలిచిన అతి చిన్న వయస్సు ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. రూ. 30 లక్షల బేస్ ధరతో అతడు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. వాస్తవంగా మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలంలో పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే బీసీసీఐ ఆ జాబితాను 574కి కుదించింది. వీరిలో 366 మంది భారత ఆటగాళ్లుకాగా 208 విదేశీ క్రికెటర్లున్నారు. పంత్ అత్యధిక ధర పలుకుతాడని అంచనా. పేసర్లు షమి, సిరాజ్, చాహల్, అవేశ్ ఖాన్ వేలంలో నిలిచిన ఇతర స్టార్ ఆటగాళ్లు. రూ. 2 కోట్ల ధరతో 81 మంది క్రికెటర్లు వేలానికి వస్తుండగా, 27 మంది రూ. 1.5 కోట్ల శ్రేణిలో ఉన్నారు. 18 మంది రూ. 1.25 కోట్లు, 23 మంది రూ. కోటి రేటుతో బరిలో దిగనున్నారు. రూ. 2 కోట్లతో ఇంగ్లండ్‌కు చెందిన బట్లర్, బ్రూక్, బెయిర్ స్టోతో అత్యధిక మొత్తంతో వేలంలో అడుగుపెడుతున్న విదేశీ క్రికెటర్ల జాబితాలో ఉన్నారు. జేమ్స్ అండర్సన్ రూ. 1.25 కోట్లతో తన పేరు నమోదు చేసుకోవడం గమనార్హం.

పదికి పది

ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు

హరియాణా పేసర్ అన్షుల్ అరుదైన రికార్డు



లాహ్లి(హరియాణా): హరియాణా జట్టు పేసర్ అన్షుల్ కాంబోజ్ అరుదైన రికార్డు సాధించాడు. కేరళతో రంజీ మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు పడగొట్టాడు. దీంతో రంజీ చరిత్రలో ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా 23 ఏళ్ల అన్షుల్ ఘనత వహించాడు. గతంలో బెంగాల్‌కు చెందిన ప్రేమాగ్షు చటర్జీ (1953లో అసోంపై), రాజస్థాన్ క్రికెటర్ ప్రదీప్ సుందరం (1985లో విదర్భపై) రంజీల్లో ఈ రికార్డు నెలకొల్పారు. ఓవరాల్‌గా ఫస్ట్ క్లాస్‌లో ఈ రికార్డు సాధించిన ఆరో భారత బౌలర్‌గా అన్షుల్ నిలిచాడు. కేరళతో పోరులో 30.1 ఓవర్లు వేసిన అన్షుల్.. 49 పరుగులు మాత్రమే సమర్పించుకొని 10 వికెట్లు తీశాడు. ఫలితంగా కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 291 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో హరియాణా శుక్రవారం ఆట ముగిసేసరికి 139/7 స్కోరు చేసింది. ఇక, ఇప్పటిదాకా 19 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన అన్షుల్ తాజా ప్రదర్శనతో కెరీర్‌లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

విజయంతో విడిపోయారు



ట్యూరిన్ (ఇటలీ): ప్రపంచ టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో విజయవంతమైన జోడీగా పేరు తెచ్చుకున్న భారత ఆటగాడు రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ఇకనుంచి వేర్వేరు భాగస్వాములతో కలిసి ఆడనున్నారు. ఈ ఇద్దరూ ఏటీపీ టూర్ ఫైనల్స్‌తో చివరి మ్యాచ్ ఆడారు. శుక్రవారం జరిగిన తమ గ్రూప్ ఆఖరి, మూడో మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 7-5, 6-7(6-8), 10-7తో జర్మనీ ద్వయం క్రావిట్జ్-టిమ్‌పై గెలిచింది. గతేడాది జనవరిలో జతకట్టిన బోపన్న, ఎబ్డెన్.. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పాటు 4 టూర్ లెవెల్ టైటిళ్లు గెలిచారు.

టెన్నిస్‌కు ప్రజ్నేష్ వీడ్కోలు



చెన్నై: భారత ఆటగాడు ప్రజ్నేష్ గుణేశ్వరన్ ప్రొఫెషనల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలికాడు. చెన్నైకి చెందిన 35 ఏళ్ల ప్రజ్నేష్ 2018 జకార్త ఆసియా క్రీడల్లో సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించాడు. కెరీర్‌లో అత్యుత్తమంగా 2019లో సింగిల్స్‌లో ప్రపంచ 75వ ర్యాంక్‌లో నిలిచాడు. ప్రజ్నేష్ నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ పోటీపడ్డా.. అన్నింటిలోనూ తొలిరౌండ్ దాటలేకపోయాడు. రెండు ఏటీపీ చాలెంజర్స్ సింగిల్స్ టైటిళ్లు నెగ్గిన అతను.. భారత్ నుంచి నెంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచాడు.

కేసీఆర్ బాటలోనే రేవంత్

» అబద్ధాలు, దోపిడీలు.. అదే పాలన: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): "మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడుస్తున్నారు. హుస్సేన్‌సాగర్ నీటిని కొబ్బరి నీళ్లలా చేస్తామని చెప్పిన కేసీఆర్.. ఏమీ చేయకుండానే ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు. డీపీఆర్ లేకుండానే మూసీ ప్రాజెక్టును పునరుజ్జీవం చేస్తామని ఇప్పుడు రేవంత్ అంటున్నారు. కేసీఆర్ హయాంలో ఉన్న నిరుద్యోగం, ధాన్యం కొనుగోళ్ల వంటి సమస్యలు ఇప్పుడు కూడా ఉన్నాయి. అబద్ధాలు చెప్పడం.. దోపిడీ చేయడం.. పాలన వైఫల్యం.. అంతా మక్కీకి మక్కీ అన్నట్లుగా కేసీఆర్ పాలనలాగే రేవంత్ పాలన సాగుతోంది. పోలీసు వ్యవస్థను కేసీఆర్ కుటుంబం దుర్వినియోగం చేస్తే.. ఇప్పుడు రేవంత్ కుటుంబం కూడా అదే చేస్తోంది" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టూరిజం ప్లాజాలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లను కూల్చవద్దంటే బుల్డోజర్లతో తొక్కిస్తామంటారా? అని మండిపడ్డారు. ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా ఇదేనా అని ధ్వజమెత్తారు. పేదల కోసం చావడానికైనా సిద్ధం అని తేల్చిచెప్పారు. మూసీ బాధితులకు ధైర్యం కల్పించేందుకు తామంతా శనివారం రాత్రి వారి ఇళ్లలో బస చేస్తామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం జరగాల్సిందేనని, కానీ, పేదల ఇళ్లు మాత్రం కూల్చివేయవద్దన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైందనడానికి లగచర్ల ఘటనే ఇదే నిదర్శనం అని విమర్శించారు. అమృత్ పథకం అమలులో అవకతవకలు జరిగితే దర్యాప్తు జరగాల్సిందేనన్నారు. దీనిపై, మాజీ మంత్రి కేటీఆర్, కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేసినట్లు జరిగిన ప్రచారంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ.. ఒక ప్రజాప్రతినిధిగా కలిసి ఉండవచ్చు అని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌ను బీజేపీ కాపాడుతోందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై మాట్లాడుతూ.. వారలా ఊహించుకోవడంలో తప్పేం లేదన్నారు.

మహారాష్ట్రలో గెలవబోయేది కాంగ్రెస్ కూటమే

» మంత్రి కోమటిరెడ్డి.. సుశీల్ కుమార్ షిండేతో భేటీ


మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండేతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రాబోతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయన.. మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండేతో శుక్రవారం సమావేశం అయ్యారు. తెలంగాణ పథకాలు మహారాష్ట్రలో కూడా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. షోలాపూర్ పార్లమెంటు సభ్యురాలు ప్రణతి షిండేతో కలిసి కోమటిరెడ్డి రెండు రోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కోమటిరెడ్డితో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ వివరాలు తెలిపిన ఎమ్మెల్సీ కవిత


వివరాలు నమోదు చేస్తున్న కవిత

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులగణన వివరాల సేకరణకుగాను రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత తన కుటుంబ వివరాలను తెలిపారు. శుక్రవారం సంబంధిత సిబ్బంది హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు కవిత తన భర్త అనిల్‌కుమార్‌తో కలిసి సంబంధిత ఫార్మాట్‌లో వివరాలు నమోదు చేశారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు పెరిగాయి

» అమిత్‌షా క్రిమినల్ హోంమంత్రి: సీపీఐ నారాయణ

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు పెరిగిపోయాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉండే రాష్ట్రాలను అందలం ఎక్కించి, వ్యతిరేకంగా ఉండేవారిని రాజకీయంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. అమిత్‌షా లాంటి క్రిమినల్ రాజకీయాల్లో హోంమంత్రిగా ఉండడం వలన దేశంలో నేరాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. శుక్రవారం ఏపీలోని ఏలూరు జిల్లాకు విచ్చేసిన ఆయన కొల్లేరు పరిరక్షణపై చర్చించారు. వైసీపీ 11 స్థానాలకు పరిమితం కావడంతో మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించాలని, లేదా రాజీనామా చేయాలని అన్నారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు ఎందుకు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు.

లగచర్ల ఘటనను తప్పుదోవ పట్టించొద్దు

» పేదల భూముల ఆక్రమణ తగదు.. తెలంగాణ వికాస సమితి

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ప్రజల ప్రతిఘటనను ప్రభుత్వం తప్పుదోవ పట్టించొద్దని, పేదల భూములను ఆక్రమించడం తగదని తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ వికాస సమితి వివిధ జిల్లాల బాధ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. భూ సేకరణ అనివార్యమైతే సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం చట్టబద్ధంగా రైతుల భూములను సేకరించాలని సూచించారు. అధికారులతో ప్రజలు దురుసుగా ప్రవర్తించడం దురదృష్టకరమన్న ఆయన లగచర్లలో యువకులు, ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

మూసీ, హన్ నదులకు సారూప్యం

» పునరుజ్జీవంతో మూసీ కూడా సుందరంగా మారుతుంది

» శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

హైదరాబాద్/వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ కాన్ఫరెన్స్ అసోసియేషన్ స్టడీ టూర్‌లో భాగంగా తెలంగాణ శాసన బృందం శుక్రవారం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని హన్, చియాంగ్‌చాన్ నదులను సందర్శించింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు ఆయా నదులను పునరుద్ధరించిన తీరును తెలుసుకున్నారు. సియోల్ నగరం మధ్య నుంచి ప్రవహించే హన్ నది గతంలో మురికి, కాలుష్యంతో ఉండేదని, ఈ నదిని 20 ఏళ్ల కిందట శుద్ధి చేసి, సుందరీకరించామని స్థానిక అధికారులు తెలిపారు. మౌలిక వసతులూ కల్పించడంతో పర్యాటక ప్రదేశంగా మారిందన్నారు. అదేవిధంగా చియాంగ్‌చాన్ నది వెంట కూడా మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పర్యాటకంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందిందని స్థానిక వ్యాపారులు, ప్రజలు చెప్పారు. ఈ సందర్భంగా సియోల్‌లోని హన్ నదికి, హైదరాబాద్‌లోని మూసీ నదికి పోలిక ఉందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన పునరుజ్జీవ ప్రాజెక్టు పూర్తయితే మూసీ కూడా పరిశుభ్రంగా, పర్యాటక ప్రదేశంగా మారుతుందని చెప్పారు.

డిసెంబరు 21న నిరుద్యోగులతో కృతజ్ఞతాసభ

» సీఎం రేవంత్‌కు ఆహ్వానం: చనగాని దయాకర్

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికానున్న సందర్భంగా డిసెంబరు 21న ఉస్మానియా వర్సిటీలో నిరుద్యోగులతో కృతజ్ఞతాసభ సభను ఏర్పాటు చేయనున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ వెల్లడించారు. ఈ సభలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, మేధావులు పాల్గొనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డినీ సభకు ఆహ్వానించనున్నామని శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన ఓ రైతు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాచకొండ అశోక్(35)కు రెండు ఎకరాల భూమి, రూ.లక్షన్నర వరకు అప్పులు ఉన్నాయి. వ్యవసాయంతోపాటు ఇస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వడ్ల కుప్ప చూసి వస్తానని రాత్రి 1.30 గంటలకు ఇంట్లో చెప్పి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. పొలం దగ్గర చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

'వక్ఫ్' బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదు

» వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఆమోదం

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి


గుర్రం మీద బీజేపీ ఆఫీసుకు వస్తున్న విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దేశాన్నే అమ్ముకుంటాయని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలతో కలిసి గుర్రాల మీద హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు తీర్పుని ఎంతటివారైనా శిరసావహించాల్సిందేనని అన్నారు. కానీ 1995లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. సుప్రీం తీర్పు ను మించి వక్ఫ్ ట్రిబ్యునల్‌కు, వక్ఫ్‌బోర్డుకు విశేష అధికారం కట్టబెట్టిందని, ఆ ట్రిబ్యునల్ ఆదేశాలను ఏ కోర్టు కూడా ప్రశ్నించకూడదని తెలిపారు. 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం.. ఎవరి ఆస్తినైనా తనదేనని వక్ఫ్ బోర్డు ప్రకటించుకోవచ్చునని, దానిని ఎవరైనా ప్రశ్నించాలంటే వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని వివరించారు. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకునే 107 ఏళ్లగా హైదరాబాద్‌లోని గుట్టల బేగంపేటలో నివాసముంటున్న వందలాది మందికి చెందిన 90 ఎకరాల ను లాక్కునేందుకు వక్ఫ్‌బోర్డు ప్రయత్నిస్తోందన్నారు. సదరు భూములను ఔరంగజేబు 300 ఏళ్ల క్రితం తమకు నోటి మాటగా బహుమతిగా ఇచ్చారని వక్ఫ్‌బోర్డు వాదిస్తోందని తెలిపారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకే కేంద్రం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చిందన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందడం ఖాయమని స్పష్టం చేశారు. అలాగే, కొందరు నాయకులు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రజలను మోసగిస్తున్నారంటూ పరోక్షంగా రాహుల్‌గాంధీని విమర్శించారు. గడ్డం పెంచుకుని రాజ్యాంగం అంటూ వారు చూపించే పుస్తకంలో తెల్ల కాగితాలు తప్పా ఏమీ ఉండదని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు.

మేము ఛత్రపతి శివాజీలం...

కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. పలువురు నేతలతో కలిసి వినూత్న రీతిలో వచ్చారు. కాషాయ పగిడీలు, ధోవతులు ధరించి కొందరు, కత్తులు పట్టుకుని సైనికుల్లా మరికొందరు, ఛత్రపతి శివాజీ వేషధారణలో ఉన్న ఓ వ్యక్తితో కలిసి గుర్రాలపై పార్టీ కార్యాలయానికి వచ్చారు. గుట్టల బేగంపేట భూములను ఔరంగజేబు ఆక్రమించుకుంటే వాటిని కాపాడేందుకు తాము ఛత్రపతి శివాజీ అవుతామని తెలిపేందుకు ఇలా వచ్చామని బీజేపీ నాయకులు తెలిపారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా నాడు కాంగ్రెస్ తెచ్చిన చట్టం గురించి దేశ ప్రజలకు తెలియజేయాలని వినూత్నరీతిలో పార్టీ కార్యాలయానికి వచ్చామని విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు.

రేవంత్ ఓ రాబందు

(మొదటిపేజీ తరువాయి)



అరెస్టయి సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల గ్రామస్థులను శుక్రవారం పలువురు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒకప్పుడు ఫార్మాసిటీ అంటేనే కాలుష్యం అని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో ఫార్మా విలేజ్‌ల పేరిట రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపించారు. రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల విలువ చేసే భూములను రూ.10 లక్షలకే అడిగితే రైతులకు ఆవేశం రాదా? అని ప్రశ్నించారు. జీవనాధారమైన భూమలను గుంజుకుంటుంటే నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని మండిపడ్డారు. లగచర్ల నిరసనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా ఉన్నారని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి ఎనుముల తిరుపతిరెడ్డి చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి సోదరుడు కావడమే ఆయన అర్హత అయిందని, కలెక్టర్లు, అధికారులు, పోలీసులు ఆయనకు మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. తిరుపతిరెడ్డి ఆదేశించిన వారందరినీ జైలుకు పంపించారని తెలిపారు. ఘటన జరిగిన రోజు ఆ గ్రామంలో లేనివారిని కూడా జైలుకు పంపించారని, వికారాబాద్ ఎస్పీ, కొడంగల్ సీఐ, ఎస్‌ఐలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులు చిత్రహింసలు పెట్టారు..

లగచర్ల వాసులను పోలీసులు తీవ్రవాదుల్లా పట్టుకొచ్చి చితకబాదారని, కాళ్లు, చేతులు కమిలిపోయేలా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని కేటీఆర్ తెలిపారు. పైగా.. కొట్టినట్లు చెబితే ఇంటి దగ్గర ఉన్న వాళ్లను చిత్రహింసలు పెడతామని హెచ్చరించడం హేయమైన చర్య అని అన్నారు. న్యాయపోరాటం చేసి బాధితులందరికీ బెయిలు ఇప్పిస్తామని చెప్పారు. ఈ రోజు కొడంగల్ మర్లబడ్డట్టే రేపు తెలంగాణ రాష్ట్రమంతా తిరగబడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వానికి పేదోళ్ల కన్నీటి ఉసురు తప్పక తాకుతుందని, అక్రమ కేసులు, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. "ఈ భూమి మీద ఎవరూ శాశ్వతంగా ఉండరు. నువ్వు చక్రవర్తివి.. నియంతవు కావు. నీ పదవి ఐదేళ్లు ఉంటుందని కూడా గ్యారంటీ లేదు. ఢిల్లీ కాంగ్రెస్ అనుకుంటే ఏడాది కూడా ఉండవు" అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తున్న అన్ని చోట్లా రైతులకు, ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, అనిల్ జాదవ్, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లగచర్లలో కాంగ్రెస్ కార్యకర్తలే తిరుగుబాటు చేశారు : బీఆర్‌ఎస్

ప్రభుత్వమే లగచర్ల రైతులను రెచ్చగొట్టి ఆందోళనకు దిగేలా చేసిందని బీఆర్‌ఎస్ నేతలు కేపీ వివేకానంద, ఎర్రోళ్ల శ్రీనివాస్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆరోపించారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం తన అల్లుడి కోసం కొడంగల్‌లో రైతుల భూములు లాక్కుంటున్నారని, లగచర్లలో తిరుగుబాటు చేసింది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనన్నారు. పార్టీలకు అతీతంగా భూములు ఇవ్వమని ప్రజలు అధికారులను ఎదిరిస్తే.. కుట్రపూరితంగా రేవంత్‌రెడ్డి ఆ అంశాన్ని బీఆర్‌ఎస్ వైపు మళ్లించారని తెలిపారు. లగచర్లలో 144 సెక్షన్ విధించి రేవంత్‌రెడ్డి, ఆయన అన్న తిరుపతిరెడ్డి కలిసి రజాకార్ పాలన సాగిస్తున్నారని, అయితే అక్కడి గిరిజనుల పక్షాన బీఆర్‌ఎస్ ఉంటుందన్నారు. రేవంత్‌రెడ్డి... కేటీఆర్, హరీశ్‌రావులపై బురద చల్లుతూ కేసీఆర్ నాయకత్వాన్ని బలహీనపర్చాలని కుట్ర చేస్తున్నారన్నారు. లగచర్లలో గిరిజన రైతులను అరెస్టు చేస్తే బండి సంజయ్ ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ కలిసి కేటీఆర్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు.

గురుకులాల నిర్వహణను గాలికొదిలేశారు: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గడచిన 11 నెలల్లో వివిధ కారణాలతో 36 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని తెలిపారు. నాణ్యత లేకపోతే జైలుకే అంటూ వేదికలెక్కి కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని, కానీ.. ప్రభుత్వం పట్టించుకుంటే విద్యార్థులు రోడ్డెక్కి ధర్నాలు ఎందుకు చేస్తారని శుక్రవారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ఆహార బిల్లులు, గురుకుల భవనాల అద్దె చెల్లించకపోవడంతో వాటికి తాళాలు వేస్తే 9నెలల బకాయిల్లో 3నెలల బిల్లులు చెల్లించారని గుర్తు చేశారు. మరోవైపు పత్తి, వరిధాన్యం కొనాలని ఆందోళన చేసినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో రైతన్నలు నష్టపోతున్నారని తెలిపారు. "11 నెలల పాలనలో సంక్షేమం మాయమైంది. అభివృద్ధి దూరమయింది. కాంగ్రెస్ తెచ్చిన మార్పు చూసి తెలంగాణ నివ్వెరపోతోంది. సరైన కాలం రాగానే కాటేసితీరాలని ఎదురు చూస్తోంది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

మార్చి లోపు ఉపాధి పనులు పూర్తికావాలి

» డిసెంబరులోపు అనుమతి పొందాలి

» ఆర్థిక సంవత్సరం ముగిశాక పనులు చేయొద్దు

» కేంద్రం మార్గదర్శకాలు.. అమలుకు కసరత్తు

హైదరాబాద్/పెద్దపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే నిర్మాణ పనులు సకాలంలో పూర్తికావడంలేదు. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో హడావుడిగా పనుల ప్రతిపాదన చేయడం, ఆ తర్వాత నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికాకపోవడం, బిల్లులు పెండింగ్‌లో ఉండడం మామూలైపోయింది. ఇకనుంచి ఇలాంటి సమస్యలు లేకుండా నిర్దేశించిన గడువు మార్చిలోపు పనులు పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఇటీవల కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహించిన మధ్యంతర సమీక్ష సమావేశంలో.. ఏటా మార్చి నెలలోపు మెటీరియల్ కాంపొనెంట్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇందుకోసం మార్గదర్శకాలను రూపొందించింది. ఈ మేరకు ఆర్థిక సంవత్సరం ముగిశాక పాత పనులు చేపట్టడం కుదరదు. ఉపాధి హామీ కింద చేపట్టే ఏ పనులైనా మార్చి నెలలోనే పూర్తయ్యేలా ఇప్పటినుంచే కార్యాచరణ మొదలుపెట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్‌ఆర్‌ఈజీఎస్ విభాగం, జిల్లాల అధికారులకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మెటీరియల్ కాంపొనెంట్ కింద వచ్చే నిధులను శాశ్వత నిర్మాణ పనులకు వినియోగించాలని సూచించింది. గతంలో మాదిరిగా ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో ప్రతిపాదనలు చేయకుండా.. డిసెంబరులోపు ఆయా పనులు చేపట్టేందుకు అనుమతి పొందాలని స్పష్టం చేసింది. మెటీరియల్ కాంపొనెంట్ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితర పనులకు డిసెంబరులోపు ప్రతిపాదించి.. మార్చి నెలాఖరులోగా పూర్తిచేసేలా కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టాలని కేంద్రం సూచించింది. రాష్ట్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 53.05 లక్షల జాబ్ కార్డులను జారీ చేయగా, వీటిపై 110.79 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఏడాదిలో తప్పనిసరిగా 100రోజుల పనిదినాలను కల్పించాలనే నిబంధన ఉంది.

సురేశ్ కోసం ముమ్మర వేట

లగచర్ల దాడిలో కీలక పాత్ర అతడిదే..

» దొరికితే కేసు కొలిక్కి వచ్చే అవకాశం

» కాస్త ఆలస్యమైనా.. పక్కా ఆధారాలతో ముందుకెళ్లేలా పోలీసుల వ్యూహం..

» పట్నం నరేందర్‌రెడ్డిని కస్టడీ కోరే చాన్స్

» పోలీసుల భద్రతా వైఫల్యంపై చర్యలకు రంగం సిద్ధం?

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్లలో అధికారులపై దాడికి రైతులు, ప్రజలను ఉసిగొల్పడంలో కీలకప్రాత పోషించిన సురేశ్ రాజ్ ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అధికారులపై దాడి అనంతరం అదృశ్యమైన సురేశ్, దేవదాస్, విజయ్, విఠల్, గోపాల్ నాయక్‌ల ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు 4 ప్రత్యేక బృందాలతో వెతుకుతున్న సంగతి తెలిసిందే. సురేశ్ రాజ్ ఆచూకీ లభిస్తే కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. అధికారులపై జరిగిన దాడిని రాజకీయ కుట్ర కోణంగానే నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగానే దర్యాప్తు కొనసాగిస్తున్నారు. న్యాయస్థానంలో కేసు నిలబడేలా శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. సరైన ఆధారాలు లేకుండా దూకుడుగా వెళ్లి భంగపడకుండా.. కొంత ఆలస్యమైనా.. పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లే విధంగా అదనపు డైరెక్టర్ జనరల్ మహేశ్ భగవత్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

నరేందర్‌రెడ్డిని కస్టడీ కోరే చాన్స్

కేసులో మాజీ ఎమ్మెల్యే ఏ-1గా పట్నం నరేందర్‌రెడ్డిని నమోదు చేసిన పోలీసులు.. కుట్రలో కీలక నేతలు ఎవరెవరున్నారనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. నరేందర్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను విశ్లేషిస్తే ముఖ్య సమాచార ం వెలుగులోకి వస్తుందని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నరేందర్‌రెడ్డికి, దాడిలో కీలక పాత్ర పోషించిన వారికి, ఇతర కీలక నేతలకు మధ్య కొనసాగిన వాట్సాప్ కాల్స్, చాటింగ్‌ల సమాచారాన్ని విశ్లేషించే పనిలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైందని తెలుస్తోంది. అలాగే నరేందర్‌రెడ్డిని పోలీసులు తమ కస్టడీకి కోరే అవకాశమున్నట్లు సమాచారం. కాగా, లగచర్ల ఘటనలో అధికారులపై దాడి చేశారని అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురు స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. శనివారం వీరిని కోర్టులో ప్రవేశపెట్టే అవకాశముంది.

పోలీసులపై శాఖాపరమైన చర్యలు?

లగచర్ల దాడి ఘటనపై నివేదిక తెప్పించుకున్న పోలీసు ఉన్నతాధికారులు.. కలెక్టర్, అధికారులపై దాడులను అడ్డుకోవడంలో పోలీసు, నిఘా విభాగం అధికారులు విఫలమయ్యారనే నిర్ధారణకు వచ్చారు. అధికారులకు భద్రత కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఎస్పై నుంచి ఉన్నత స్థాయి అధికారులపై చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు సమాచారం.

అధికారులపై దాడులు చేస్తే ఊరుకోం

ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ పాలన.. కొడంగల్‌లో పరిశ్రమ ఇష్టం లేకపోతే ఎక్కడైనా నిరసనలు తెలుపొచ్చు

» సిరిసిల్ల నేత కార్మికులకు త్వరలో మహిళా సంఘాల చీరల ఆర్డర్లు

» 20న సిరిసిల్ల జిల్లాలో సీఎం పర్యటన

» మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికారులపై దాడులు చేస్తే ఎంతమాత్రం సహించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. "ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలిస్తున్నాం. రాజకీయ పార్టీ ఏదైనా సరే విమర్శలను, ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అనుమతిస్తున్నాం. దాన్ని అవకాశంగా తీసుకొని అధికారులపై దాడులు చేస్తే ఊరుకోబోం" అని వ్యాఖ్యానించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి పొన్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్‌లో పరిశ్రమ పెట్టడం ఇష్టం లేకపోతే ఎక్కడైనా నిరసన తెలపవచ్చని, ఇందిరా పార్కు వద్ద ధర్నా, ర్యాలీ, దీక్షలు చేయవచ్చని అన్నారు. అధికారులపై దాడులు చేస్తే మాత్రం చట్టప్రకారంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్లన్నసాగర్, మిడ్ మానేరు బాధితులను గతంలో ఎన్ని ఇబ్బందులు పెట్టారో తనకు తెలుసని చెప్పారు. కొడంగల్‌లో కలెక్టర్‌పై దాడి విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కలెక్టర్‌పై దాడి చేసినవారిని అరెస్టు చేయకుండా ఏం చేయాలో ప్రభుత్వానికి కేంద్రమంత్రి సూచించాలన్నారు. అనంతరం.. సీఎం రేవంత్ ఈ నెల 20న రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సిరిసిల్లలో నేత కార్మికుల కోసం మనోధైర్య ర్యాలీ నిర్వహిస్తామని పొన్నం తెలిపారు. నేతన్నల సమస్యలు తెలుసుకోవడానికి ప్రభుత్వం తరఫున సిరిసిల్లలో ఒకరోజు గ్రీవెన్స్ సెల్(ఫిర్యాదుల స్వీకరణ) నిర్వహిస్తామన్నారు. నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, పలు పథకాలను అందుబాటులోకి తెచ్చి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. సీఎం 20న జిల్లాకు రానున్న నేపథ్యంలో అనేక కార్యక్రమాలు ముందుకు వస్తాయని భరోసా ఇచ్చారు. బతుకమ్మ చీరల స్థానంలో మహి ళా సంఘాలకు అందించే చీరల ఆర్డర్లు త్వరలోనే ఇస్తామన్నారు.

సీఎం కార్యక్రమంలో

ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

ఎల్బీ స్టేడియం నుంచి నిలోఫర్‌కు పంపగా చికిత్సకు నిరాకరణ

» వైద్య ఆరోగ్య కార్యదర్శి ఆదేశాలనూ లెక్కచేయని నిలోఫర్ అధికారులు

» ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స

మంగళ్‌హాట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వాంతులు, విరేచనాలతో నిలోఫర్ ఆస్పత్రికి తరలించిన ఇద్దరు విద్యార్థులకు చికిత్స చేసేందుకు అక్కడి అధికారులు నిరాకరించారు. కారణం.. ఆస్పత్రిలో పన్నెండేళ్ల లోపు పిల్లలకే వైద్యం చేస్తామని, బాధిత విద్యార్థుల వయసు 13 ఏళ్లు అని.. నిబంధనల ప్రకారం వారికి నిలోఫర్‌లో చికిత్స చేయడం కుదరదని తేల్చేశారు. బాధిత విద్యార్థులు సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొని అస్వస్థతకు గురి కావడం.. ఈ విషయం తెలిసినా నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు చికిత్సకు నిరాకరించడం గమనార్హం. బుధవారం నెహ్రూ జయంతి సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సమయంలో ఓ విద్యార్థి అస్వస్థతకు గురి కావడంతో స్టేడియంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతోందని వెంటనే ఆ విద్యార్థికి గ్లూకోస్ పెట్టేందుకు కాన్యులాను అమర్చి.. అంబులెన్సులో నిలోఫర్‌కు పంపించారు. నిలోఫర్‌లో చిన్నారి సహాయకులు ఓపీ చీటి కౌంటర్ వద్దకు వెళ్లి వివరాలు చెప్పగా.. బాధిత బాలుడికి 13 ఏళ్లు కాబట్టి ఇక్కడ చేర్చుకోవడం కుదరదని తేల్చిచెప్పారు. సీఎం కార్యక్రమం నుంచి తీసుకొచ్చామని చెప్పినా ఆస్పత్రిలో కేవలం 12 ఏళ్లలోపు వారిని మాత్రమే చేర్చుకుంటామని చెప్పి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. చేసేది లేక వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి స్వయంగా ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఆదేశించినప్పటికీ ప్రాథమిక చికిత్స కూడా చేయకుండా బాధిత విద్యార్థిని తిరిగి పంపించినట్లు చర్చ జరుగుతోంది. ఎల్బీ స్టేడియంలో కార్యక్రమానికి హాజరై, అస్వస్థతకు గురైన ఓ 13 ఏళ్ల బాలిక విషయంలోనూ ఇలానే జరిగింది. సాయంత్రం నుంచి వాంతులు, విరేచనాలు కావడంతో గురువారం ఉదయం నిలోఫర్‌కు తీసుకెళ్లారు. ఆమె వయసు 12 దాటిందని ముందు పట్టించుకోలేదు. అనంతరం ఓపీ చీటి ఇచ్చి ప్రాథమిక చికిత్స అందించి.. అనంతరం ఉస్మానియాకు వెళ్లాలని సూచించారు. చేసేది లేక ఆ బాలిక సైతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పినట్లు తెలిసింది.

తీవ్రంగా మందలించిన డీఎంఈ

అస్వస్థతకు గురైన విద్యార్థుల పట్ల నిలోఫర్ వైద్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహంతో ఉన్న డీఎంఈ వాణి గురువారం ఉదయం నిలోఫర్ ఆస్పత్రికి రాగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది పాత భవనం గేటును మూసి వేసి కనీసం గేటు తీసేందుకు ససేమిరా అన్నారు. ఆస్పత్రిలో గేట్లు మూసి వేయడం ఏమిటని డీఎంఈ స్వయంగా సెక్యూరిటీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు డీఎంఈ నిలోఫర్ అధికారులకు ఫోన్ చేయడంతో వారు పరుగున వచ్చి ఆమెను లోపలికి తీసుకువెళ్లారు. ఓపీ చీటీలు ఇచ్చే కంప్యూటర్ ఆపరేటర్లు, అత్యవసర విభాగంలో పనిచేసే సిబ్బంది, పీజీ వైద్య విద్యార్థులు, డ్యూటీ డాక్టర్లతో డీఎంఈ మాట్లాడారు. వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆరోగ్య శాఖ కార్యదర్శి ఆదేశాలను సైతం లెక్కచేయకుండా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అని మండిపడినట్లు సమాచారం.

శిల్పకళావేదికలో 21 నుంచి లోక్‌మంథన్

» దక్షిణ భారతదేశంలో తొలిసారి నిర్వహణ

» హాజరుకానున్న రాష్ట్రపతి, కేంద్రమంత్రులు

» దేశ విదేశాల నుంచి వెయ్యిమందికి పైగా కళాకారులు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో లోక్‌మంథన్-2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 22న ప్రారంభిస్తారని చెప్పారు. అంతకుముందురోజు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎగ్జిబిషన్, సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం టూరిజం ప్లాజాలో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరపడం, వాటి పరిష్కారం కోసం ఆలోచన విధానాన్ని రూపొందించి అందుకు అనుగుణంగా వ్యవస్థ ఏర్పాటు చేయడం లోక్‌మంథన్ ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ఈ కార్యక్రమంలో వందకుపైగా కళారూపాలు ప్రదర్శిస్తారని, వెయ్యి మందికి పైగా కళాకారులు పాల్గొంటారని చెప్పారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా లోక్‌మంథన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనవాసీ, గ్రామవాసీ, నగరవాసీ.. కలిస్తేనే భారతవాసీ.. అని పేర్కొన్నారు. కులం, భాష పేరిట విభజన రాజకీయాలు చేస్తున్న సందర్భంలో లోక్‌మంథన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు, జాతీయ, అంతర్జాతీయ విద్యావేత్తలు హాజరవుతారని తెలిపారు.

మాయమాటలతో అధికారంలోకి రాలేదు

- ఇందిరమ్మ రాజ్యంలో సంతోషంగా ప్రజలు
- డిసెంబరులోపు రుణమాఫీని పూర్తి చేస్తాం
- జనవరి నుంచి రేషన్ ద్వారా సన్న బియ్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



భైంసా రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారంలోకి రాలేదని, రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయన.. మార్గమధ్యలో నిర్మల్ జిల్లా భైంసాలో మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ్ పటేల్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు రూ.8.34లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మాటేగాం గ్రామానికి వెళ్లి అక్కడ కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజా సేవకులుగా పని చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలను నెరవేర్చి తీరుతామని పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులకు డిసెంబరు లోపు మాఫీ చేస్తామని పొంగులేటి చెప్పారు. తెల్ల రేషన్ కార్డులున్నవారికి జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మహారాష్ట్రలోనూ ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆయన ఆకాంక్షించారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు సోలార్ ప్లాంట్లు

- ఇంధనశాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు రేవంత్‌రెడ్డి సర్కారు తగిన ప్రాధాన్యం కల్పిస్తోందని, అందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా 1,000 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను కేటాయించాలని ఇంధనశాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపినట్లు ఆమె తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఈ ప్లాంట్లకు ఒక్కోదానికి రూ.3కోట్ల వ్యయం అంచనావేశామని, అందులో 90 శాతం బ్యాంకు ద్వారా లోన్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇంధనశాఖ అనుమతులిస్తే సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని చెప్పారు.

రేపటి నుంచి గ్రూప్-3 పరీక్ష

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో గ్రూప్-3 పరీక్ష జరగనుంది. సుమారు 5.68 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు 1,401 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 1,365 గ్రూప్-3 పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం మూడు పేపర్లకు సంబంధించిన పరీక్షలను అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది. 17న మొదటి సెషన్‌లో భాగంగా పేపర్-1 పరీక్షను ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, రెండో సెషన్‌లో పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 18న పేపర్-3 పరీక్షను ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్ష మొదలయ్యే సమయానికి 30 నిమిషాల ముందుగానే గేట్లను మూసివేస్తారు. అంటే.. ఉదయం సెషన్ పరీక్షలకు 9.30 గంటల లోపు, మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 2.30 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాలి.

కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే గురువారం(నవంబరు 21) జరగాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం వాయిదా పడింది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో ఈనెల 25వ తేదీ తర్వాత సమావేశాన్ని నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తి మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, సమావేశం జరిగే కొత్త తేదీని ప్రకటించలేదు. కాగా, తదుపరి జరిగే బోర్డు సమావేశంలో 2024 వాటర్ ఇయర్(జూన్ 1 నుంచి 2025 మే నెలాఖరు దాకా)లో నీటిని ఏ విధంగా పంచుకోవాలనే దానిపై తెలుగు రాష్ట్రాలు చర్చించనున్నాయి.

కుల గణన సామాజిక న్యాయానికి తొలిమెట్టు

- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక ముందడుగు
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్

న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుల గణన సామాజిక న్యాయానికి తొలిమెట్టు అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక ముందడుగు వేసిందని శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "కులాల సర్వే అనేది సామాజిక న్యాయం దిశగా విప్లవాత్మకమైన ముందడుగు మాత్రమే కాదు, దీనికి అపారమైన పరిపాలనా సామర్థ్యం అవసరం. ఇది చాలా పెద్ద పని. తెలంగాణలోని 33 జిల్లాల్లో 1.17 కోట్ల కుటుంబాల సర్వేకు 80వేల మంది ఎన్యూమరేటర్లు పనిచేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి విభిన్న సంస్కృతులు, ఆర్థిక పరిస్థితిని సమగ్ర సర్వే చేయడానికి గ్రామ, వార్డుస్థాయి నుంచి సీఎంవో స్థాయి వరకు యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలి. నల్గొండ జిల్లాలో ఇప్పటికే 55శాతం సర్వే పూర్తయింది. కులాల సర్వే సమగ్రత ఎన్నికల ప్రక్రియకు సమానంగా, సమాంతరంగా ఉంటుంది. 2021లో జరగాల్సిన దశాబ్ద జనాభా గణనను నిర్వహించడంలో కేంద్రం విఫలమైంది. ఈ పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో విశిష్టతను సంతరించుకుంది."అని జైరాం రమేష్ పేర్కొన్నారు.

పవర్ ఇంజనీర్స్ అధ్యక్షుడిగా పి.రత్నాకర్‌రావు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా పి.రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పి.సదానందం ఎన్నికయ్యారు. ఈ నెల 13వ తేదీన సంఘం కార్యవర్గం ఎన్నిక జరగ్గా.. శుక్రవారం ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో అసోసియేట్ అధ్యక్షుడిగా జె.ఎల్.జనప్రియ, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్లుతో పాటు 17 మంది గెలుపొందారు. ఆ తర్వాత ట్రాన్స్‌కో విభాగం ఉపాధ్యక్షుడిగా ఎం.రమేశ్, కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్‌తో పాటు 14 మందిని ఎన్నుకున్నారు. ఇక జెన్‌కో విభాగం ఉపాధ్యక్షుడిగా టి.బ్రహ్మాజీ, కార్యదర్శిగా ఎన్.సురేశ్‌కుమార్‌తో పాటు 17 మందిని, టీజీ ఎస్పీడీసీఎల్ విభాగం ఉపాధ్యక్షుడిగా కె.జైహింద్, కార్యదర్శిగా బి.శ్రీనివాస్‌రెడ్డితో పాటు 13 మంది గెలిచారు. టీజీ ఎన్పీడీసీఎల్ విభాగం ఉపాధ్యక్షుడిగా వి.రాంబాబు, కార్యదర్శి బి.సమ్మను ఎన్నుకున్నారు.

లెండి ప్రాజెక్టు నిర్మాణ అడ్డంకులను తొలగిస్తాం

- త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణం చేపడతాం
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉత్తమ్ ప్రకటన

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల తర్వాత లెండి ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోతామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ, మహారాష్ట్ర అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను తొలగిస్తామని తెలిపారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో కలిసి మరాఠ్వాడా ప్రాంతంలోని ముఖేడ్ నియోకవర్గంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అక్కడి ప్రజలకు ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లెండి ప్రాజెక్టుతో ఇరు రాష్ట్రాల ప్రజలకూ ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలనే మలుపు తిప్పనున్నాయని, ఈ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ 200పైచిలుకు స్థానాల్లో గెలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు రశీదులు!

తూకం వేయగానే లెక్కలు తేల్చాలని ప్రభుత్వ ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు రశీదులు(ట్రక్ షీట్) అక్కడికక్కడే జారీ చేయాలనే నిబంధన కచ్చితంగా అమలుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తూకం వేయగానే రైతుల సంతకం తీసుకొని రశీదు ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రైతు ఎన్ని బస్తాల ధాన్యం తెచ్చారు? వాటి బరువు ఎంత? ఎన్ని డబ్బులు వస్తాయి? అనే వివరాలు రశీదుపై రాయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే రశీదులు జారీచేసేందుకు సెంటర్ల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి ఈ నిబంధన గతంలోనూ ఉన్నా రైస్‌మిల్లర్లు అనుమతిచ్చిన తర్వాతే రశీదులు జారీచేసేవారు. రైస్ మిల్లర్లు ధాన్యం లోడెత్తుకొని, మిల్లుల్లో దిగుమతి చేసుకున్న తర్వాత, తరుగు, తాలు, కడ్తా అన్నీ లెక్కచూసుకొని పరిమాణంలో కోత పెట్టేవారు. దీంతో రైతులకు క్వింటాలుకు బదులుగా 90 కిలోల ధాన్యానికే డబ్బులు వచ్చేవి. ఇకపై రైతుల అనుమతి లేనిదే కొనుగోలు కేంద్రం నుంచి లారీ లోడయ్యేదిలేదని, సెంటర్ నుంచి కదిలేది లేదని చెప్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్ల అతి జోక్యానికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రభుత్వం సేకరించే ధాన్యానికి సంబంధించి రైతులకు, రైస్‌మిల్లర్లకు ఎలాంటి సంబంధం లేకుండా చేసింది. కేవలం బ్యాంకు గ్యారెంటీ గానీ, సెక్యూరిటీ డిపాజిట్ గానీ, ఒప్పందపత్రాలుగానీ రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అప్పుడు రైస్‌మిల్లు కెపాసిటీకి అనుగుణంగా ధాన్యం కేటాయింపులు చేస్తారు. కేటాయించిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉండే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైస్‌మిల్లులకు పంపిస్తారు. ఆ ధాన్యాన్ని దించుకొని కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సిన బాధ్యత రైస్‌మిల్లర్లకు ఉంటుంది. అంతే తప్ప కొనుగోలు కేంద్రాల్లో జరిగే ప్రక్రియలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. మిల్లులకు చేరిన ధాన్యాన్ని దిగుమతి చేసుకొని, మిల్లింగ్ చేసేవరకే మిల్లర్లను పరిమితం చేశారు.

10 లక్షల టన్నులు దాటిన ధాన్యం సేకరణ

రాష్ట్రంలో శుక్రవారం నాటికి 10.81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో దొడ్డు రకాలు 8.43 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకాలు 2.38 లక్షల మెట్రిక్ టన్నులు. 91.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 8,062 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించగా ఇప్పటివరకు 7,507 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇందులో 4,153 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతోంది. మిగిలిన సెంటర్లకు ఎప్పుడు ధాన్యం వస్తే... అప్పుడు ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు 1.59 లక్షల మంది రైతుల నుంచి రూ. 2,509 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలుచేశారు.

ఫ్యూచర్ సిటీ 30 వేల ఎకరాల్లో

(మొదటిపేజీ తరువాయి)

భూమి ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. రైతులు కోల్పోతున్న భూమి విలువకు సమానంగా ఉండేలా అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఫ్యూచర్ సిటీలో నిర్మించే ప్రధాన రోడ్లకు అనుకొని ఉండే ప్లాట్లనే బాధిత రైతులకు కేటాయించనున్నట్లు సమాచారం. ఆ ప్లాట్లలో భారీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. దీంతో రైతులకు ఇచ్చే ప్లాట్లకు ఎక్కువ ధర లభించే అవకాశాలు ఉంటాయి. అసైన్డ్ భూములు సేకరించినా, వాటిని అనుభవిస్తున్న వారికి తగిన న్యాయం చేసేలా.. అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వనున్నారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రీజనల్ రింగురోడ్డు వరకు 41.5 కి.మీ. మేర నిర్మిస్తున్న 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులను ప్రభుత్వం వేగిరం చేసింది. తొలివిడత రావిర్యాలలోని ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం ఇటీవల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ రహదారి కోసం 449 ఎకరాల 27 సెంట్ల భూమిని సేకరిస్తోంది. ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే మెట్రో రైలు నిర్మాణం కూడా చేపట్టనుంది. దీనికి సంబంధించి భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చిన సర్కారు.. రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ పనులు కూడా పూర్తి చేసింది. మహేశ్వరం మండలంలోని కొంగరకుర్దు-ఎ గ్రామంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలంలోని లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడివెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట గ్రామాల్లో మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఆనుకునే మెట్రోరైల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రహదారికి రెండో విడత భూసేకరణ నోటిఫికేషన్‌ను ఈ వారంలోనే ఇవ్వనున్నారు. స్కిల్ వర్సిటీ నుంచి కొత్తగా నిర్మించే రింగు రోడ్డు వరకు భూసేకరణ కోసం నోటిఫికేషన్ సిద్ధం చేశారు. ఇందు కోసం దాదాపు 500 ఎకరాల వరకు సేకరిస్తున్నారు.



స్కిల్ వర్సిటీ పనులు షురూ!

ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న స్కిల్ వర్సిటీ నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు అదాని కంపెనీ రూ.100 కోట్ల విరాళం ఇవ్వగా, మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ (ఎంఈఐఎల్) రూ.200 కోట్లతో ఇక్కడ భవన నిర్మాణం చేపడతామని ముందుకు వచ్చింది. ఈ మేరకు కంపెనీ నిర్మాణ పనులను ప్రారంభించింది. వచ్చే ఏడాది తెలంగాణ అవతరణ దినోత్సవం నాటికి తొలివిడత భవన నిర్మాణం పూర్తిచేస్తామని ప్రకటించింది.

సమస్త సౌకర్యాలతో..

ఇదిలా ఉంటే అంతర్జాతీయ నగరాలకు దీటుగా ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇందులో అన్ని వనరులు, సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. అన్నివర్గాల వారు ఇక్కడ జీవించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే మలక్‌పేటలో 150 ఎకరాల్లో ఉన్న హైదరాబాద్ రేస్ క్లబ్‌ను ఇక్కడకు తరలించే ఏర్పాట్లు మొదలు పెట్టింది. అలాగే ప్రపంచ స్థాయి గోల్ఫ్ క్లబ్ నిర్మించేందుకు 250 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించింది. ఇక్కడ పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉండడంతో ఇందులో పనిచేసే ఉన్నతశ్రేణి ఉద్యోగులు, వ్యాపారవేత్తల అభిరుచులకు అనుగుణంగా బిలియనీర్ల క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. బీసీసీఐ కూడా ఇక్కడ అతిపెద్ద స్టేడియం నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఇక్కడ కంపెనీలు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహాలో వాణిజ్య కేంద్రాన్ని నిర్మించేందుకు వరల్డ్ ట్రేడ్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఇటీవల స్థల పరిశీలనకు వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు 70 ఎకరాలు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీకి అవసరమైన తాగునీటిని కృష్ణా నది నుంచి తరలించనున్నారు. అలాగే ఇక్కడ వేల ఎకరాల్లోని పార్కులు, రోడ్లకు ఇరువైపులా ఉండే మొక్కల కోసం మూసీ నీటిని శుద్ధి చేసి వినియోగించాలని నిర్ణయించారు. మూసీ నీటిని తరలించేందుకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పక్క నుంచే ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు.

త్వరలో ఫార్మా కంపెనీలకు

ఫ్యూచర్ సిటీలో హెల్త్ సైన్స్ పేరుతో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీని నిర్మించనున్నారు. ఇప్పటికే ఇక్కడ భూమి కోసం దాదాపు 300 ఫార్మా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో రాష్ట్రంలోని ప్రధాన ఫార్మా కంపెనీలకు తొలి విడత భూ కేటాయింపులు చేసేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. వీటిని ఫ్యూచర్ సిటీకి చివర్లో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఐదు ఫార్మా కంపెనీలకు 50 ఎకరాల చొప్పున 500 ఎకరాలను కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. మేడిపల్లి గ్రామ పరిధిలో ఈ భూ కేటాయింపులు చేయనున్నట్లు తెలిసింది. 'కాలుష్య రహిత' హామీతోనే ఈ భూములు కేటాయిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి కాలుష్యం లేకుండా పరిశోధన చేసే సంస్థలకు, బయటి నుంచి ముడి సరుకు తీసుకొచ్చి ఔషధాలు తయారు చేసే సంస్థలకే భూములు ఇవ్వనున్నారు.



సర్వేను అడ్డుకుంటే ఉపేక్షించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

వివరాలు రాష్ట్ర పౌరుల అభ్యున్నతి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారంనాటికి 5,24,542 ఇళ్లలో సర్వే పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 87,807 మంది సిబ్బంది, 8,788 పర్యవేక్షక అధికారులు ఈ సర్వేలో పాల్గొంటున్నారని... ప్రజల నుంచి స్పందన కూడా బాగా ఉందని వివరించారు. 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ ప్రాంతాలను కలిపి మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి.. సర్వే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాలవారీగా నియమించినట్టు చెప్పారు. దీంతో సర్వే జరుగుతున్న తీరుపట్ల సీఎం రేవంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తదితర అధికారులు పాల్గొన్నారని సమాచార శాఖ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కాగా.. సిక్కు మత స్థాపకుడు గురునానక్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గురునానక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీఎం వెంట ఆయన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యోగుల జీపీఎఫ్‌కు వడ్డీ ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భవిష్య నిధి (జీపీఎఫ్) ఖాతాలు ఉంటాయి. ప్రతి నెలా వారి మూల వేతనాల నుంచి కనీసం 6 శాతం సొమ్మును మినహాయించి జీపీఎఫ్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంటుంది. కొంత మంది.. ఆదాయ పన్ను మినహాయింపు కోసం ఎక్కువ మొత్తంలో కూడా జీపీఎఫ్ కింద మినహాయింపజేసుకొని ఆ ఖాతాల్లో జమ చేయించుకుంటుంటారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఈ జీపీఎఫ్ ఖాతాలోని సొమ్మును ఉద్యోగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. సర్వీసు మధ్యలో కూడా ఇళ్ల నిర్మాణం, పిల్లల పెళ్లిళ్ల కోసం 'పార్ట్ ఫైనల్ ఉపసంహరణ' కింద కొంత సొమ్మును తన ఖాతా నుంచి తీసేసుకోవచ్చు.

ఉద్యోగులకు వేర్వేరు జీపీఎఫ్ ఖాతాలు..

జీపీఎఫ్ ఖాతాలు అందరు ఉద్యోగులకు ఒకేలా ఉండవు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సొమ్ము 'అకౌంటెంట్ జనరల్ జీపీఎఫ్ (ఏజీజీపీఎఫ్)' ఖాతాల్లో జమ అవుతుంది. జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌ల కింద పనిచేసే ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ శాఖలోని ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగులు, ఇంజనీర్ల సొమ్ము మాత్రం 'జిల్లా పరిషత్ జీపీఎఫ్ (జడ్పీ జీపీఎఫ్)' ఖాతాల్లో జమ అవుతుంటుంది. అయితే ఈ ఖాతాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయి. ఈ దృష్ట్యా ఉద్యోగుల ఖాతాల్లో జమ అయిన భవిష్యనిధి సొమ్మును ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటుంది. ఇలా వినియోగించుకుంటున్నందుకుగాను ఉద్యోగుల సొమ్ముకు ప్రభుత్వం వడ్డీని కలపాల్సి ఉంటుంది. జీపీఎఫ్ సొమ్ముపై 7.8 శాతం మేర వార్షిక వడ్డీని జమ చేయాల్సి ఉంటుంది. దీంతో జీపీఎఫ్ ఖాతాలో రూ.4 లక్షల సొమ్ము కలిగి ఉన్న ఉద్యోగికి.. ఏడాదికిగాను వడ్డీ రూపంలో దాదాపు రూ.30 వేల దాకా జమ అవుతుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల జీపీఎఫ్ సొమ్ముకు 2023 సంవత్సరానికి సంబంధించిన వడ్డీని ఇప్పటివరకు కలపలేదని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. ముఖ్యంగా జడ్పీ జీపీఎఫ్ ఖాతాలున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకే ఈ సమస్య ఎక్కువగా ఉందని పేర్కొన్నాయి.

కొత్త జిల్లాల ఏర్పాటు తరువాతే సమస్య..!

జీపీఎఫ్ సొమ్ముకు ప్రభుత్వం వడ్డీ కలపని సమస్య రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత తలెత్తిందని ఉద్యోగ సంఘాలు చెప్పాయి. రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఉమ్మడి 10 జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 33 జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులను కొత్త జిల్లాలకు సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఇలా కొత్త జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల జడ్పీ జీపీఎఫ్ ఖాతాలను పాత జిల్లాల నుంచి కొత్త జిల్లాలకు బదలాయించాల్సి ఉంటుంది. కానీ, ఈ ప్రక్రియ చాలా ఆలస్యమైంది. 2016లో కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటికీ.. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ, జోన్ల ఏర్పాటు వంటి ప్రక్రియల నేపథ్యంలో ఖాతాలు బదిలీ కాలేదు. ఎట్టకేలకు 2023లో కొన్ని ఖాతాలను బదలాయించారు. ఇంకా కొన్ని ఇప్పటికీ బదిలీ కాలేదు. బదిలీ అయిన ఖాతాలకు కూడా 2023కు సంబంధించిన వడ్డీ బదిలీ కాలేదని ఉద్యోగ సంఘాలు తెలిపాయి. కొత్త జిల్లాలకు వచ్చిన ఖాతాలకు.. ఆయా జిల్లా పరిషత్ అధికారులు గత ఏడాదికి సంబంధించిన వడ్డీ శాతాన్ని లెక్కగట్టి జమ చేయడం లేదని చెప్పాయి. 2024 నుంచే వడ్డీ జమ అవుతుంది తప్ప.. 2023 వడ్డీతో తమకు సంబంధం లేదంటున్నారని వివరిస్తున్నాయి. దీంతో తాము ఏడాది వడ్డీని నష్టపోవాల్సి వస్తోందని, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఎస్‌హెచ్‌జీ సభ్యులు పారిశ్రామికవేత్తలు కావాలి

వారికి సహకరించండి

- పవన విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు తోడ్పడండి
- బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు అందేలా చూడండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అధికారులు సహకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. శుక్రవారం ప్రజా భవన్‌లో 'మహిళా శక్తి పథకం'పై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సమాఖ్యల ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున పవన విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. దాదాపు రూ.4 వేల మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి కావాలని ఆకాంక్షించారు. సంఘాలు పవన విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేలా సహకరించాలని, అందుకు అవసరమైన స్థలాలను సేకరించి, లీజుకివ్వాలని అధికారులకు సూచించారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల వారు 99 శాతం మేర రుణాలను తిరిగి చెల్లిస్తున్నారని, ఈ విషయాన్ని బ్యాంకర్లకు వివరించి, రుణాలు అందేలా చూడాలని చెప్పారు. సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో బ్యాంకర్లు కూడా రుణాలు ఇవ్వడానికి ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. అందుకే ఈ విషయంలో అధికారులు మరింత చొరవ తీసుకోవాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా సహకరించాలని చెప్పారు. తద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడతారని అన్నారు. సంఘాలకు బస్సులను కూడా కొనివ్వాలని ప్రభుత్వం యోచిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, విద్యుత్తు శాఖల అధికారులు పవన విద్యుత్తు విషయంలో సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో తెలంగాణ 'హస్తం'

- అక్కడ ప్రచారంలో రాష్ట్ర నేతల బిజీ
- శని, ఆదివారాల్లో రేవంత్ ప్రచారం
- 80కి పైగా నియోజకవర్గాలలో పరిశీలకులుగా ఉత్తమ్, సీతక్క

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర మన సరిహద్దు రాష్ట్రం.. ఆ రాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ మూలాలున్న వారు ప్రభావితం చేసే నియోజకవర్గాలు ఎన్నో..! దీంతో ఏఐసీసీ కూడా మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ నాయకులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటోంది. స్టార్ క్యాంపెయినర్‌గా నియమితులైన సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం కోసం ఇప్పటికే రెండు సార్లు మహారాష్ట్ర వెళ్లివచ్చారు. ఇప్పుడు మరోమారు శని, ఆదివారాల్లో ప్రచారంలో పాల్గొంటున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు నాగ్‌పూర్ చేరుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాజూరా, డిగ్రాస్, వార్దా నియోజకవర్గాల్లో నిర్వహించే రోడ్‌షోలు, ప్రచార సభల్లో పాల్గొని తిరిగి నాగ్‌పూర్ చేరుకుంటారు. రెండోరోజు ఆదివారం నాగ్‌పూర్ నుంచి నాందేడ్ చేరుకుంటారు. తెలుగు వారు ఎక్కువగా ఉండే నయగావ్, భోకర్, షోలాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఇక, ఉత్తర మహారాష్ట్రలోని 40 నియోజకవర్గాలకు మంత్రి సీతక్కను, మరాఠ్వాడ పరిధిలోని 48 నియోజకవర్గాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని సీనియర్ పరిశీలకులుగా ఏఐసీసీ నియమించింది. దీంతో ఉత్తమ్, సీతక్క ఆయా నియోజకవర్గాల నేతలతో నిరంతరం సమీక్షలు జరుపుతూ, తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగిస్తూ పరిస్థితిని చక్కదిద్దుతూ వస్తున్నారు. సీతక్కకు కేటాయించిన నియోజకవర్గాల్లో ఎస్టీ రిజర్వుడు 12 నియోజకవర్గాలు ఉండడంతో వాటిపై ఆమె ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ప్రచారం, ఇతర కార్యాక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, పార్టీ నేత కోట నీలిమ తదితరులకు లోక్‌సభ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతో ఆయా నియోజకవర్గాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ బాధ్యతలు చూసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పార్టీ నేతలు రాచమళ్ల సిద్దేశ్వర్, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, అన్వేష్‌రెడ్డి, కత్తి వెంకటస్వామి తదితరులకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు కేటాయించారు. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీమ్, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ కూడా ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు కూడా ముమ్మర ప్రచారం చేస్తున్నారు.

ఆదాయం చేదు!

- రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ఆఫీసులోనే ఫైళ్లు
- 22ఏ మీద కలెక్టర్లు క్లియరెన్స్ ఇచ్చినా విపరీత జాప్యం
- శేషాద్రి తర్వాత వచ్చినవారు ఒక్క ఫైలూ ఆమోదించలే

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం ఆశించిన మేర రావడం లేదు. ఏప్రిల్-అక్టోబరు మధ్య మూడు నెలల్లో రాబడి తగ్గింది. దీంతో అదనపు ఆదాయ వనరులపై దృష్టిసారించాలని సీఎం రేవంత్, ఆర్థిక శాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం భట్టి పలుసార్లు సూచించారు. శాఖలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే ఈ మేరకు మెరుగుదల ఉంటుంది. కానీ, ఆ దిశగా స్పందన కొరవడిందనే విమర్శలున్నాయి. ఉదాహరణకు 22ఏ వివాదాలపై కోర్టు ఉత్తర్వుల ద్వారా లేదా కలెక్టర్ల నుంచి క్లియరెన్స్ అయి వచ్చిన ఫైళ్లను ఐజీ సంబంధిత జిల్లా రిజిస్ట్రార్లకు పంపాలి. కానీ, ఇవి ఐజీ కార్యాలయం దాటి బయటకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రూ.కోట్లలో ఆదాయం సమకూరే ఈ తరహా ఫైళ్లు ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ పరిధిలో 50కి పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఉన్న శేషాద్రి రిజిస్ట్రేషన్ శాఖ ఐజీగా ఉన్న సమయంలో 22ఏ వివాదంపై కలెక్టర్ల నుంచి వచ్చిన ఫైళ్లను వెంటనే జిల్లా రిజిస్ట్రార్లకు పంపేవారు. జిల్లాల రిజిస్ట్రార్లు సబ్ రిజిస్ట్రార్లకు పంపి పర్యవేక్షణ చేసేవారు. తద్వారా స్టాంప్ డ్యూటీ, ఇతర సేవల రూపంలో ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేది. కాగా, శేషాద్రి తర్వాత వచ్చిన ఐజీలు ఫైళ్లను పెండింగ్‌లో పెట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2024-25లో మే నెలలో రాబడి 18.06% తగ్గింది. సెప్టెంబరులో -26.15%, అక్టోబరులో -8.34 % నమోదైంది. ఆదాయం పెరుగుదల కూడా అంతంతమాత్రమే ఉంది. ఏప్రిల్‌లో 2.55%, జూన్‌లో 9.61 %, ఆగస్టులో 0.77 శాతమే పెరిగింది. గత ఏడాదితో పోల్చితే.. జూలైలోనే 38.06 % అదనపు రాబడి కనిపించింది.

'పుష్ప' సినిమా చూపిస్తూ మెదడుకు సర్జరీ

» రోగి మెదడులో కణతిని తొలగించిన వైద్యులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని కిమ్స్- సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన శస్త్రచికిత్స చేశారు. 'పుష్ప' సినిమా చూపిస్తూ సర్జరీ చేసి రోగి మెదడులో కణతిని తొలగించారు. నిజామాబాద్‌కు చెందిన సి.బి ప్రతిప్(30) కొనేళ్లుగా బహరేన్‌కు(అరబ్ దేశం)లో ఉద్యోగం చేస్తున్నారు. రెండు నెలలుగా తరచూ ఫిట్స్ వస్తుండడంతో అక్కడే చికిత్స తీసుకున్నారు. అయినా నయం కాలేదు. అనంతరం బేగంపేట కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని సంప్రదించగా న్యూరోసర్జన్లు డాక్టర్ వేణుగోపాల్ గోక, డాక్టర్ మోహన శశాంక్ నేతృత్వంలో పరీక్షలు చేసి ప్రతిప్ మెదడులో ఎడమవైపు ట్యూమర్(కణతి) ఉన్నట్లు గుర్తించారు. కణితి చుట్టూ ఉన్న నరాలు మాట్లాడేందుకు, అర్థం చేసుకోవడానికి సంకేతాలు పంపే నరాలు కావడంతో నావిగేషన్ గైడెడ్ అవేక్ క్రానియోటమి ద్వారా ఫంక్షనల్ న్యూరో సర్జరీ పద్ధతిలో రోగికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. శస్త్ర చికిత్స సమయంలో రోగిని మెలకువగానే ఉంచి అతనితో మాట్లాడుతూ, ట్యాబ్‌లో సినిమాలు, సినిమా పాటలతో పాటు కొన్ని వస్తువులు, జంతువుల ఫోటోలను చూపిస్తూ వాటి పేర్లు, విషయాలను గుర్తిస్తున్నాడా, అర్థం చేసుకుంటున్నాడా అని పరీక్షిస్తూ అవసరమైన మేర అనస్తేషియా అందిస్తూ కణతిని తొలగించారు. రెండు గంటలపాటు శస్త్ర చికిత్స కొనసాగింది. ఈ సందర్భంగా కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి సీవోవో డాక్టర్ సుధాకర్ జాదవ్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, టెక్నాలజీ, నిపుణులైన డాక్టర్లతో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

1,465 కి.మీ మేర 'కవచ్' విస్తరణ

» సనత్‌నగర్-వికారాబాద్ మార్గంలో 63 కి.మీలలో అప్‌గ్రేడ్

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాల నివారణ కోసం వినియోగంలోకి వచ్చిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్'ను దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1,465 కి.మీ మేర ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైళ్ల ప్రమాదాలను నియంత్రించేందుకు స్వదేశీయంగా అభివృద్ధి చేసిన కవచ్ 4.0 వెర్షన్‌ను తాజాగా సనత్‌నగర్-వికారాబాద్ మార్గంలో 63 కి.మీ మేర అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. కవచ్ 4.0 రక్షణ వ్యవస్థను రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో) సహకారంతో భారతీయ రైల్వే అభివృద్ధి చేసింది. నాగర్‌సోల్-ముద్ఖేడ్-ధర్మాబాద్-నిజామాబాద్, సికింద్రాబాద్- కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్ విభాగంలో 959 కి.మీ మేర కవచ్ 3.2 రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వికారాబాద్-బీదర్ మధ్య 90 కి.మీలు, వికారాబాద్-వాడి మార్గంలో 112 కి.మీ మేర కవచ్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్‌కు చైర్మన్‌ను నియమించండి:ఎఫ్‌జీజీ

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాల కేసులను విచారించడానికి 2016లో ఏర్పాటు చేసిన మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్‌కు చైర్మన్, సభ్యులను నియమించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి లేఖ రాశారు. మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలను గుర్తించి, చర్యలు తీసుకునే సందర్భంలో బిల్డర్లు న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే ఆర్డర్లు తెస్తున్నారని తెలిపారు. ఇలాంటి వివాదాస్పద కట్టడాల గురించి తెలియని అమాయకులు ఫ్లాట్లను కొనుగోలు చేసి నష్టపోతున్నారని వివరించారు. అదే ట్రైబ్యునల్ ఉంటే ఇలాంటి కేసులను విచారించి, ఆదిలోనే కట్టడి చేస్తుందని తెలిపారు. జిల్లా రిటైర్డు జడ్జి చైర్మన్‌గా ఉండే ఈ ట్రైబ్యునల్‌కు ఇప్పటివరకు చైర్మన్‌ను, సభ్యులను నియమించలేదని పేర్కొన్నారు.

టీచర్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలి: పీఆర్టీయూ

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. 33 జిల్లాల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శుల సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. టీచర్లకు సంబంధించి జీపీఎఫ్, మెడికల్, సరెండర్ లీవ్, టీఎస్‌జీఎల్‌ఐ వంటి బిల్లులన్నీ గత ఏడాదిన్నర కాలంలో పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఈ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

8న బాలికల విద్య ఉపకార వేతనం పరీక్ష

ఎన్టీఆర్ విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యా సంస్థలు నిర్వహించే బాలికల విద్య ఉపకారవేతనం పరీక్ష (జీఈఎస్‌టీ-2025) డిసెంబరు 8న జరుగుతుందని ఎన్టీఆర్ విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా ఉపకార వేతనం అందిస్తామన్నారు. మొదటి 10 ర్యాంకులు పొందిన బాలికలకు నెలకు రూ.5 వేలు, తర్వాతి ర్యాంకులు పొందిన 15 మంది బాలికలకు రూ.3 వేలు చొప్పున ఎన్టీఆర్ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసే వరకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి చదువుతున్న బాలికలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థినులు వెబ్‌సైట్ www.ntrcollegeforwomen.educationలో 16 నుంచి వచ్చే నెల 4 వరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7660002627/28 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బిర్యానీ షహర్ నుంచి

గ్లోబల్ సిటీ వరకు..

» హైదరాబాద్ ప్రయాణంపై సీనియర్ జర్నలిస్టు దినేశ్ శర్మ రాసిన పుస్తకం ఆవిష్కరణ..

» అభివృద్ధిలో చంద్రబాబు కృషి కీలకమన్న వక్తలు

న్యూఢిల్లీ, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం ఇప్పుడెంత మాత్రం బిర్యానీ షహర్ కాదని, చరిత్ర ఘట్టంలో ఎంతో దూరం ప్రయాణించి గ్లోబల్ టెక్నాలజీకి కేంద్రంగా మారిందని సీనియర్ జర్నలిస్టు సంజయ్ బారూ, చరిత్రకారుడు ప్రొఫెసర్ అమర్ ఫరూఖీ, శాస్త్రవేత్త గీతా వాణి రాయసం అన్నారు. హైదరాబాద్‌లో చాలాకాలం పనిచేసిన సీనియర్ జర్నలిస్టు దినేశ్ శర్మ 'బియాండ్ బిర్యానీ-ద మేకింగ్ ఆఫ్ గ్లోబలైజ్‌డ్ హైదరాబాద్' అనే పుస్తకాన్ని శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆవిష్కరించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఏపీ సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారని రచయితతో సహా వక్తలు పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఐటీ, బయో టెక్నాలజీ తదితర రంగాలకు ఇచ్చిన మద్దతు హైదరాబాద్ విజయానికి కారణమని సంజయ్ బారూ చెప్పారు. ప్రభుత్వ పరిశోధనా ప్రయోగశాలలు హైదరాబాద్‌ను ప్రపంచ ఫార్మసీ నగరాల్లో ఒకటిగా మార్చాయని గీతావాణి అన్నారు. ఒక రాచరిక సంస్థానం నుంచి గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా మారేందుకు సాలార్ జంగ్ నుంచి చంద్రబాబు వరకు చేసిన కృషిని తన పుస్తకంలో వివరించినట్లు దినేశ్ శర్మ తెలిపారు. మలేసియా స్ఫూర్తితో చంద్రబాబు హైదరాబాద్‌ను విజన్ 2020తో సైబరాబాద్‌ను నిర్మించారని, అమెరికా, యూరప్‌ల స్ఫూర్తితో జినోమ్ వ్యాలీ ఏర్పడిందని చెప్పారు.

అగ్నిప్రమాదంలో పది మంది శిశువుల మృతి

» ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఘటన

ఝాన్సీ, నవంబరు15: ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది శిశువులు మృతిచెందారు. మరో 32 మందిని సహాయ సిబ్బంది కాపాడారు. ఇన్‌క్యుబేటర్లలో ఉండగానే శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఎస్ఐసీయూలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

పది ఫీజు పరేషాన్

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. ఈ వివరాల ప్రకారమే విద్యార్థులకు ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాంలు అందించడం అమలు చేస్తున్నారు. ఈ యూడైస్ పోర్టల్‌లోని డేటాను బోర్డ్ ఆఫ్ సెకండరి ఎడ్యుకేషన్‌కు బదిలీ చేస్తే టెన్త్ పరీక్షల ఫీజును చెల్లించడానికి వీలవుతుంది. ఈ డేటా ప్రకారమే నామినల్ రోల్‌ను రూపొందిస్తారు. దీని ప్రకారమే విద్యార్థికి సంబంధించిన వివరాలతో టెన్త్ మెమోను ముద్రిస్తారు.

కొత్త నిబంధనతో ప్రక్రియ ఆలస్యం

ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన ఒక నిబంధన కారణంగా అనేక స్కూళ్లల్లో విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తి కాలేదు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులు సర్క్యులర్‌ను జారీ చేశారు. ఇందులో ఒక్క విద్యార్థికి సంబంధించిన వివరాల నమోదు కాకపోయినా టెన్త్ ఫీజును చెల్లించడంలో ఇబ్బంది తలెత్తుతున్నది. గత ఏడాది వరకు కేవలం టెన్త్ క్లాసు విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఫీజును చెల్లించడానికి అవకాశం ఉండేది. కానీ ఈ ఏడాది కచ్చితంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల వివరాలను నమోదు చేయాలనే నిబంధనతో కొంత ఇబ్బంది తలెత్తిందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. విద్యార్థులు స్కూళ్లు మారడం, కొత్తగా అడ్మిషన్లను తీసుకోవడం, స్కూల్ వదిలి వెళ్లిపోవడం వంటి కారణాలతో కొంత మంది విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఇబ్బంది ఎదురవుతుందని చెప్తున్నారు.

పరీక్ష ఫీజు గడువును పొడిగించాల్సిందే

విద్యార్థుల వివరాలను ఇంకా పూర్తి స్థాయిలో నమోదు చేయకపోవడంతో టెన్త్ క్లాసు పరీక్ష ఫీజుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సాంకేతిక ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ పరీక్ష ఫీజు గడువును పొడిగించాల్సిందిగా తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్ర ప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు.

'మిత్తి'మీరిన ఆగడం

ఉమ్మడి నిజామాబాద్‌లో అడ్డే లేని వడ్డీ వ్యాపారుల దందా.. రాబట్టుకునేందుకు కిరాయి మనుషులు.. వారితో బెదిరింపులు

» వందకు రూ. 3 నుంచి రూ.10 దాకా

» ప్రత్యేక కార్యాలయాలతో రోజుకో కొత్త ఫైనాన్స్ సంస్థ పుట్టుక

» వీరిలో ఉద్యోగులు, పోలీసులు, కొందరు రాజకీయ నేతలూ!

» సామాన్యుల వద్ద ముక్కుపిండి వసూలు

» వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నాలు

» దందాపై చర్యలు తప్పవ్.. నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి

నిజామాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అవసరాన్ని బట్టి రూ.10 వడ్డీ.. అది కూడా తక్కువ గడువే.. ఆలోగా అసలుతో కలిపి చెల్లించారా సరేసరి..! లేదంటే.. ఆస్తులు తనఖా పెట్టి తీసుకున్నా వేధింపులు తిప్పలు తప్పవు..! కిరాయి మనుషులతో బెదిరింపులు ఆగవు..! ఇదీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారుల ఆగడం. దీనిని తట్టుకోలేక కుటుంబాలే ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. వీరు అప్పు ఇచ్చే సమయంలో పూర్తి నిబంధనలు చెప్పరు. ఖాళీ చెక్కులను తీసుకుంటారు. ఈ క్రమంలో మధ్య తరగతి, సామాన్యులతో పాటు చిరుద్యోగులు వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి విలవిల్లాడుతున్నారు. అధిక వడ్డీల దెబ్బతో కొందరైతే ఆస్తులను అమ్ముకుంటున్నారు. ఇలాంటి దారుణాలు పెచ్చుమీరుతున్నా కేసులు మాత్రం నామమాత్రంగానే నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల వడ్డీ వ్యాపారులకు పోలీసులు కూడా సహకరిస్తుండడంతో ఆస్తులను జప్తు చేసుకుంటున్నారు. దీనిని చూసి రోజుకో సంస్థ పుట్టుకొస్తోంది. ఏ గుర్తింపు లేకుండానే రూ.లక్షలు చెలామణీ చేస్తున్నాయి. ఇలాంటివాటిలో కొన్ని.. రుణం తీసుకున్న సమయంలోనే వడ్డీ పట్టేసుకుంటున్నాయి. కాగా, చిరు వ్యాపారులకు నిత్యం అవసరాలు ఉండడంతో వడ్డీకి తీసుకోక తప్పడం లేదు. ఇళ్లు, భూములు, బంగారం తనఖా పెట్టుకున్నా వడ్డీ మాత్రం తగ్గించడం లేదు. నిర్ణీత సమయంలో వడ్డీతో పాటు అసలు కట్టనివారికి చక్రవడ్డీ వేసి ఆస్తులను జప్తు చేస్తున్నారు. ఇచ్చిన అప్పు కన్నా ఆస్తుల విలువ ఎక్కువగా ఉన్నప్పటికీ చక్రవడ్డీ కలిపి గుంజుతున్నారు. వేధింపులపై పోలీసుల వద్దకు వెళ్లినా సివిల్ వ్యవహారంగా చెప్పి కేసు నమోదు చేయడం లేదు. మరికొందరికి పోలీసులే మధ్యవర్తిగా ఉండి సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారు.

ఆర్మూర్ డివిజన్‌లో బంగారం విలువలో 60-70 శాతం వరకు అప్పుగా ఇస్తున్నారు. వారు పెట్టిన నిబంధనల ప్రకారం చెల్లించకుంటే జప్తు చేస్తున్నారు. నిజామాబాద్, బోధన్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లలో చిన్న గదులు తీసుకుని కొందరు కార్యాలయాలు తెరవగా, మరికొందరు ఇంటి నుంచే నిర్వహిస్తున్నారు. కొందరు వ్యాపారులు ప్రధాన పార్టీల్లో చేరి నాయకుల మద్దతుతో దందా నడిపిస్తున్నారు. కాగా, నిర్ణీత సమయంలో చెల్లించినా తనఖా ఆస్తులను తిరిగివ్వడం లేదు. లేదా చెప్పినదాని కంటే ఎక్కువ మొత్తం తీసుకుంటున్నారు.

గల్ఫ్ వెళ్లేవారికీ..

ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన చోట ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుంటే వడ్డీ వ్యాపారులు వెనకడుగు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల వారే వడ్డీ వ్యాపారుల వెనుక ఉన్నారు. కాగా, గతంలో గ్రామాల్లో రూపాయిన్నర నుంచి రూ.2 వరకు వడ్డీకి ఇచ్చేవారు. ఇప్పుడు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. గల్ఫ్ వెళ్లేవారు కూడా వీరినే ఆశ్రయిస్తున్నారు. ఒకవేళ అక్కడ ఉపాధి దొరకకపోతే అప్పులకు వడ్డీలు చెల్లించలేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వడ్డీ వ్యాపారం చేసేవారిలో ఎక్కువమంది వ్యాపారులు, ఉద్యోగులు, పోలీసులు, కొందరు నాయకులు ఉన్నారు.ముఖ్యంగా ఉద్యోగులు వెనుక ఉండి నడిపిస్తున్నారు. పలు రంగాలకు చెందినవారు ఉండడంతో కేసులు నమోదు కావడం లేదు. ముగ్గురు నలుగురు కలిసి ఫైనాన్సుల పేరు మీద ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే దందా సాగిస్తున్నారు. గొడవలు వచ్చిన సమయంలో కేసులు కాకుండా చూసుకుంటున్నారు. వడ్డీ దందా డబ్బును భూముల కొనుగోళ్లు, ఇతర వ్యాపారాలకు మళ్లిస్తున్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

అధిక వడ్డీ వసూలు, వేధింపులకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చేయకుండా పోలీసులను ఆశ్రయించాలి. గతంలో కొందరు ప్రైవేటు ఫైనాన్స్ నిర్వాహకులపై కేసులు పెట్టాం.

\- నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి

ఇవిగో దారుణాలు

- నిజామాబాద్‌కు చెందిన చిరు వ్యాపారి రుణదాతల వేధింపులను తట్టుకోలేక ఇటీవల బాసర వద్ద గోదావరిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యాల్‌కల్‌కు చెందిన వ్యాపారి వేణు, భార్య అనురాధ, కూతురు పూర్ణిమతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశాడు. తండ్రీకూతురు మృతిచెందగా అనురాధ ప్రాణాలతో బయటపడింది. అసలు చెల్లించినా.. అధిక వడ్డీ వేసి వేధింపులకు పాల్పడడంతో బలవన్మరణానికి యత్నించామని ఆమె పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- రెండు నెలల క్రితం ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తండ్రీ, తల్లీ, కొడుకు వడ్డీ వ్యాపారి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. మూడేళ్ల క్రితం నిజామాబాద్ వ్యాపారి ఆస్తులను జప్తు చేయడంతో ఏపీలోని విజయవాడ వెళ్లి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు ఇప్పటికీ ఉంది.
- కొందరు ఊళ్లను విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఆస్తులను తీసుకోవడంతో పాటు వేధింపులు, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో అవమానంగా భావించిన పలువురు మరోచోట అధిక వడ్డీలకు తెచ్చి చెల్లించిన ఉదంతాలున్నాయి.

ఆత్మహత్య చేసుకుంటానని

సెల్ఫీ వీడియో పెట్టి..

» భర్త అదృశ్యం.. భార్య ఆత్మహత్య

» 5 నెలల క్రితం కులాంతర ప్రేమ వివాహం

గజ్వేల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న ఆ జంట మధ్య పొరపొచ్చాలొచ్చాయి పరస్పరం గొడవపడ్డారు. ఇంట్లో నుంచి వెళ్లిన భర్త తాను చనిపోతున్నానని, తన చావుకు భార్యే కారణమంటూ సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. ఇది చూసిన ఆ భార్య.. తన భర్త చనిపోలేదని.. ఇంటికి వస్తాడని ఎదురు చూసి చివరికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన రేణుక(22), అదే మండలం మైలారం గ్రామానికి చెందిన భాను(24) ప్రేమించుకుని ఐదు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఆయా గ్రామాల పెద్దలు ఇద్దరినీ విడదీశారు. రేణుక ఫిర్యాదు మేరకు పెద్దలపై కేసు నమోదు చేయడంతో మళ్లీ పెద్దలే మధ్యవర్తిత్వం వహించి, ఇద్దరినీ కలిపారు. భార్యాభర్తలు గజ్వేల్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. అయితే, వారి మధ్య గొడవలు జరిగేవి. సోమవారం కూడా ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరగగా, రేణుక స్వగ్రామానికి వెళ్లిపోయింది. కాగా భాను తాను చనిపోతున్నానని, తన చావుకు తన భార్య రేణుక కారణమని సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి.. ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. ఈ క్రమంలో తన భర్త తనకు కావాలని రేణుక మైలారం గ్రామంలోని భాను తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. తన భర్త చనిపోడని, రాత్రి ఇంటికి వస్తాడని గజ్వేల్‌లో అద్దెకు ఉంటున్న ఇంటికి గురువారం చేరుకుంది. శుక్రవారం ఉదయం వరకు వేచి చూసిన రేణుక భర్త రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరి వేసుకుంది. రేణుక తల్లిదండ్రులు ఇంటికి వచ్చి తలుపులు తట్టగా, ఎంతకీ తెరవకపోవడంతో కిటికీలోంచి చూశారు. ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో రేణుక కనిపించింది. పోలీసులొచ్చి మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో

అలెగ్రో మైక్రోసిస్టమ్స్ పరిశోధన కేంద్రం

» 500 మందికి ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటోమోటివ్, విద్యుత్తు వాహనాల తయారీలో ఉపయోగించే మ్యాగ్నెటిక్, సెన్సర్లు, చిప్‌ల తయారీలో దిగ్గజ సంస్థ అయిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్.. హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, అలెగ్రో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సచివాలయంలో మంత్రి మాట్లాడారు. అలెగ్రో పరిశోధన కేంద్రం ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి సంతృప్తి చెంది హైదరాబాద్‌ను ఎంచుకున్నట్టు అలెగ్రో యాజమాన్యం తెలపడం హర్షదాయకమని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటులో ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అమెరికా కేంద్రంగా ఉన్న అలెగ్రో పరిశోధన కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రంలో సెమీకండక్టర్ చిప్‌ల తయారీ పరిశ్రమకు ఊతం లభిస్తుందన్నారు. బీఎండబ్ల్యూ విద్యుత్తు కార్ల తయారీ సంస్థతో పాటు ఈవీ రంగంలో బ్యాటరీల నిర్వహణ, పవర్ చిప్‌ల తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా ఉందని శ్రీధర్ బాబు వివరించారు. ప్రస్తుతం 90శాతానికి పైగా సెమీకండక్టర్లను దేశం దిగుమతి చేసుకుంటోందని, ఈ రంగంలో దేశీయంగా ఉత్పత్తి చేసి స్వయం సమృద్ధి సాధించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అలెగ్రో మైక్రోసిస్టమ్స్ సీఈవో వినీత్ నర్గోల్వాలా, సీనియర్ వీపీ సుమన్ నారాయణ్, మరో సీనియర్ వీపీ మ్యాక్స్ గ్లోవర్‌లు పాల్గొన్నారు.

రెండో స్థానం కోసం బీఆర్ఎస్, బీజేపీ పోటీ

ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం అందుకే.. వరి సాగు, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ టాప్

» మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా

» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

» కేటీఆర్‌ది దుర్మార్గపు రాజకీయం: మంత్రి శ్రీధర్ బాబు



తుమ్మలకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో స్థానం కోసం బీఆర్ఎస్, బీజేపీ పోటీ పడుతూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల పుట్టినరోజు సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సచివాలయంలో శుక్రవారం ఆయన్ను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు మంత్రులు విలేకరులతో మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెట్టే రాజకీయ క్రీడను మానుకోవాలని బీఆర్ఎస్, బీజేపీలను ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హెచ్చరించారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. వరి సాగు, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. 2023 వానాకాలంలో 65.94 లక్షల ఎకరాల్లో వరి సాగైతే... ఇప్పుడు అది 66.77 లక్షల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. నిరుడు 146 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే ఈసారి అది 153 లక్షల టన్నులకు చేరిందని తెలిపారు. సన్నాల సాగు విస్తీర్ణం కూడా 25.05 లక్షల ఎకరాల నుంచి 40.44 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. కనీస మద్దతు ధర మీద రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనతో సన్నాల సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ఈ సీజన్‌లో నవంబరు 14 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 7,411 కొనుగోలు కేంద్రాలు ద్వారా 1,41,377 మంది రైతుల నుంచి 9.58 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా, అధికారం కోల్పోయి మతిభ్రమించిన బీఆర్ఎస్ నేతలు రైతుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెండో స్థానం కోసం పోటీ పడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. ధాన్యం ఆరబెట్టిన చోటకు వెళ్లి ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ధాన్యం సేకరణ జరుగుతోందని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరతోపాటు సన్నాలకు ప్రకటించిన బోనస్‌ను కూడా ధాన్యం సేకరించిన వారం రోజుల్లోపే రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు తుమ్మల వెల్లడించారు. రైతు భరోసా పథకాన్ని తప్పనిసరిగా అమలుచేస్తామని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే ఒక పంట కాలానికి ఎకరానికి రూ. 7,500 చొప్పున ఏడాదికి రూ. 15 వేలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు ఉండే అవకాశముందని తుమ్మల ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఏదోలా అరెస్టవ్వాలని కేటీఆర్ పాకులాట

ప్రజల్లో ఏదో ఒక రకంగా సానుభూతి పొందటం కోసం అరెస్టు అవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ పాకులాడుతున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. లగచర్ల ఘటనపై ఉన్నతస్థాయి అధికారితో విచారణ చేపడుతున్నామని, అమాయకులైన గిరిజన రైతులను అడ్డంపెట్టుకొని కేటీఆర్ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో బలవంతంగా భూములు లాక్కున్న విషయాన్ని ప్రజలు మరిచిపోలేదని అన్నారు. రాష్ట్రం ప్రగతిపథంలో నడిచేందుకు పరిశ్రమలు అవసరమని, అప్పుడే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్, బీజేపీ కలిసి కుట్రపన్నుతున్నాయని వ్యాఖ్యానించారు.

నేడు బీజేపీ మూసీ నిద్ర!

» మూసీ పరీవాహక బస్తీల్లో నిద్రించనున్న బీజేపీ ముఖ్యనేతలు

» నేడు సాయంత్రం 4 గంటల నుంచి రేపు ఉదయం 9 గంటల వరకు

» అంబర్‌పేట తులసీరామ్ నగర్‌లో నిద్రించనున్న కిషన్‌రెడ్డి

» కార్యక్రమంలో పాల్గొననున్న ఎంపీలు లక్ష్మణ్, ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

హైదరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక బస్తీల్లో ఒక రోజు నిద్రించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ప్రకటించారు. బీజేపీ ముఖ్యనేతలు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు మూసీ పరీవాహక ప్రాంతాల్లోని సుమారు 20 బస్తీల్లో.. ఆయా బస్తీవాసులతో మమేకమై.. అక్కడే నిద్రించనున్నట్లు తెలిపారు. అక్కడి పేద ప్రజలకు నేతలు భరోసా కల్పిస్తారన్నారు. ఈ బస్తీ నిద్ర కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, 8 జిల్లాలకు సంబంధించి బీజేపీ జిల్లా అధ్యక్షులు పాల్గొంటారని వెల్లడించారు. ఎట్టిపరిస్థితుల్లో కూడా మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ప్రజల ఇళ్లను కూల్చనివ్వబోమన్నారు. మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం విషయంలో సమగ్రమైన నివేదిక బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏయే బస్తీల్లో ఏయే నాయకులు పాల్గొంటారన్న వివరాలను వెల్లడించారు.

బస్తీ నిద్ర కార్యక్రమంలో పాల్గొనే ముఖ్య నాయకులు - ప్రాంతాల వివరాలు:

అంబర్ పేట్ (తులసీరామ్ నగర్) -కేంద్ర మంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు- జి.కిషన్ రెడ్డి, ఓల్డ్ మలక్‌పేట్ (శాలివాహన్ నగర్) -రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, రాజేంద్రనగర్ (హైదర్‌షా కోట్) - పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఎల్బీనగర్ (ద్వారకాపురం కాలనీ, గణేష్ నగర్) -పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, జౌలిగౌడ -ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి, అంబర్ పేట్ (కమలానగర్) -మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, అంబర్ పేట్ (శాస్త్రినగర్) -మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం, అంబర్ పేట్ (అంబేద్కర్ నగర్) -మాజీ మంత్రి కృష్ణ యాదవ్, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం లంగర్ హౌస్ - డి. ప్రదీప్ కుమార్ , కార్వాన్ డివిజన్ -తల్లోజు ఆచారి, జియాగూడ -యెండల లక్ష్మీ నారాయణ, బహదూర్ పురా- ధర్మారావు, గోషామహల్ నియోజకవర్గం అఫ్జల్ గంజ్ లోని రెసిడెన్షియల్ హౌసింగ్ బస్తీ -బీబీ పాటిల్, జుమ్మెరాత్ బజార్ -సీతారాం నాయక్, హైదర్ గూడ (బహదూర్ పురా) - మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, రాజేంద్రనగర్ (అత్తాపూర్) -బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడి, ఉప్పల్ (రామంతాపూర్) - మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎల్బీనర్ (సత్యనగర్, న్యూ మారుతీనగర్) మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి, మేడ్చల్ రూరల్ (ఘట్ కేసర్) - మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు.

పని చేయని టీ-యాప్ ఫోలియా

» 15 రోజులుగా సేవలకు అంతరాయం

» ప్రభుత్వ పెన్షన్ లబ్ధిదారులకు ఇబ్బందులు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న టీ-యాప్ ఫోలియో అప్లికేషన్ పనిచేయకపోవడంతో ప్రభుత్వ పెన్షన్ తీసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజులుగా యాప్ బంద్ కావటంతో లైఫ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయడానికి అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పింఛను లబ్ధిదారులు తాము బతికే ఉన్నామని తెలుపుతూ ఏటా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. దీనిని టీ-యాప్ లేదా పింఛను ఖాతా ఉన్న బ్యాంకు, పోస్టాఫీసు, మీ సేవా కేంద్రాల ద్వారా అప్‌లోడ్ చేయాలి. నవంబరు నుంచి 3 నెలల వ్యవధిలో లైఫ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయకపోతే పింఛను నిలిచిపోయే అవకాశం ఉంది. నడవలేని స్థితిలో ఉన్నవారు యాప్ ద్వారా వివరాలను నమోదు చేసుకుంటారు. ఈ సమస్యను ప్రస్తావిస్తూ ఇటీవల తెలంగాణ పింఛనుదారుల సమాజ్ ప్రధాన కార్యదర్శి ఎంఏ కరీమ్ ఐటీ కార్యదర్శికి లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మయ్య ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. రాష్ట్రంలోని 2.86 లక్షల మంది పింఛనుదారుల్లో 30% నడవలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.